- తెలుగు భాషాభివృద్ధి వ్యూహంగా అనువాదం
- జంజాటం (బందారం కథలు)
- భక్తి రస పోషణ - పోతన గారి పోషణ
- పల్లెపదానికి పట్టాభిషేకం
- ప్రాచీన సాహిత్యంలో దేవదాసీలు
- నల్లగొండ జిల్లా - తెలంగాణ సాయుధ పోరాటం - సాహిత్యం
- తెలంగాణ దళిత వాగ్గేయకారుడు గూడ అంజన్న విప్లవ దృక్పథం
- గిరిజన కథా సాహిత్యంలో సమాజ ఆవిష్కరణ

# మూసీ
# MUSI

• Samputi : 25 • Sanchika : 05 • Pages : 64 • Rs. 20
• March 2022

25 వసంతాలు

UGC Care List
Approved Journals





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 25 సంచిక : 5
మార్చి - 2022
'ప్లవ' ఫాల్గుణ మాసం
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

ISSN 2457-0796



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలుగు భాషాభివృద్ధి వ్యూహంగా అనువాదం ... డా. బాణాల భుజంగరెడ్డి 7
జంజాటం (బందారం కథలు-4) ... డా. నందిని సిధారెడ్డి 11
అనుముల కృష్ణమూర్తి పద్యఖండిక 'నా మనసాయెనే' అర్థశిల్ప రామణీయకత ... డా. గంగ్ర లక్ష్మణ రావు 15
భక్తి రస పోషణ - పోతన గారి పోహణ ... టి. శ్రీవల్లీ రాధిక 19
పల్లెపదానికి పట్టాభిషేకం ... నాగభూషణం పరికె 25
పద్య మనోహరం - 28 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 28
ప్రాచీన సాహిత్యంలో దేవదాసీలు ... డా. శిరీష ఈడ్పుగంటి 29
గ్రంథాంతరంగం 10 - స్వారోచిష మనుచరిత్ర టీకా తాత్పర్య వ్యాఖ్య ... ఘట్టమరాజు 35
వ్యాస రచయితగా 'కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి' ... ఆర్. గోపాల్ 38
నడిచే పద్యంతో అంతేవాసం ... ఏ. మారుతి 41
నల్లగొండ జిల్లా - తెలంగాణ సాయుధ పోరాటం - సాహిత్యం ... కొండ విజయకుమార్ 43
తెలంగాణ దళిత వాగ్గేయకారుడు గూడ అంజన్న విప్లవ దృక్పథం ... సంగి సంజీవ్‌కుమార్ 47
వాసిరెడ్డి సీతాదేవి నవలలు - జీవన చిత్రాలు ... ఎం. రాజ్‌కుమార్ 50
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 21 ... టి. లక్ష్మీనారాయణ 53
గిరిజన కథా సాహిత్యంలో సమాజ ఆవిష్కరణ ... ధనావత్ పద్మ 56

### కవితలు

మహా శివరాత్రి ... డా. అయాచితం నటేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6, వాగ్దేవతా!!... అవుసుల భానుప్రకాశ్ - 18; వస్త్రాస్త్రం ... సాహిత్యమణి - 18; స్వర సువర్ణలత ... గురిజాల రామశేషయ్య - 62; తేనెలో మునిగి తేలిన తెలుగు ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 62.

### సమీక్షలు

ముఖాముఖి అను స్తుతి విలాసము ... డా. శ్రీరంగస్వామి 58
అసామాన్యుడికి అక్షరార్చన -2 ... డా. అట్టెం దత్తయ్య 59
స్వీకృతి ... 61

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





## స్వస్థత

స్థా ధాతువుకు ఉండుట అని అర్థం. సంస్కృతంలో ఇది విరివిగా ఉపయోగింపబడినా, ఆంగ్లంలో కూడా బాగానే వాడబడుతుంది. స్టే, స్టాండ్, సిట్, స్టేషన్, స్టుడెంట్ మొదలైన ఆంగ్ల పదాలు మనకు ఆంగ్లంలో కనిపిస్తున్నాయి. అనేక పదాల మధ్యలో కూడా ఈ ధాతు సంబంధ అర్థాలతో పద ప్రయోగాలుంటాయి. మధ్యస్థ, అంతరస్థ, పరస్థ, విశ్వస్థ మొదలైన శబ్దాలలోనూ ఉండుట అనే అర్థం ఉంది. అదేవిధంగా ఒక వ్యక్తి తనలో తాను ఉండడాన్ని 'స్వస్థత' అని అంటారు. ఈ పదాన్ని 'ఆరోగ్యం' అనే అర్థంలోనే వినియోగిస్తున్నాం. తనలో తాను కాకుండా, తనలో ఇతరులు ఉన్నా, తాను ఇతరమైన ప్రదేశాలలో ఉన్నా పరస్థత అవుతుంది. సాధారణార్థంలో ఇది సాధ్యం కాదు. ఈ పదం ఆరోగ్యం అనే పరిమితార్థంలో మాత్రమే ఉపయోగించనవసరమూ లేదు.

మనిషికి బాహ్యంగా కనిపించే శరీరం, దాన్ని నడిపే మనస్సు, మూలమైన చైతన్యం మూడూ కలిసి ఉంటాయి. ఇవే మనకు తెలిసిన త్రిపురాలు. వీటిల్లో రాక్షసత్వం నిండితే త్రిపురాసురులుగా, సౌందర్యం నిండితే త్రిపుర సుందరిగా భాసిస్తుందీ జీవితం. శరీరం, మనస్సు, చైతన్యం మూడింటినీ మనవాళ్ళు 'తన' శబ్దంతోనే ప్రయోగించవచ్చు. ఈ మూడింటిలో చైతన్యం మూలాధారం. మనస్సు నిర్వహణ శక్తి. శరీరం కేవలం ఉపయోగించుకునే పరికరం. నిర్వహణ శక్తితో కూడుకున్న మనస్సు, తనకున్న అజ్ఞానం వల్ల ఎక్కడెక్కడో సంచరిస్తూ ఉంటుంది. ఇంటిబయట బురదను తొక్కి కాళ్ళు కడుక్కోకుండా ఇంట్లోకి వచ్చి పోతుంటే ఇల్లంతా బురద అయినట్టుగానే, వేరు వేరు వ్యక్తులు, వ్యవహారాలు, తమకు సంబంధించినవి, లేవిని అన్నీ ఆలోచించి, అన్నింటినీ స్పర్శించి మళ్లీ మన శరీరాంతరస్థమైన చైతన్యంలోకి ఈ మనస్సు రావడం వల్ల ఈ శరీరం అంటువ్యాధులకు గురి అయి మలిన పడుతుంది. ఇది తనలో తానుండటం కాదు, ఇతరములో తానుండటం. మరొకదాన్ని తాకి కడుక్కోకుండా తన ఇంట్లోకి తాను వస్తుంటే 'కరోనా'లు వస్తుంటాయని అందరికీ తెలిసిందే. 'అడుసు తొక్కనేల, కాలు కడుగ నేల' అనే సామెత కూడా అందరం వింటున్నదే. తప్పనిసరి అయి తొక్కవలసిన వానిని శుద్ధి చేసుకోవడానికే యోగ, ప్రాణాయామ, జప, ధ్యానాదులు సాధనాలుగా మనవాళ్ళు ఎప్పుడో నిర్దేశించినారు. అవేవీ చేయనపుడు ఈ అంటువ్యాధులకు మూలమైన పరస్థత ప్రభావం తప్పదు. శరీరానికీ, మనస్సుకీ రోగమూ, భారమూ తప్పదు.

తన చైతన్యంలో, తన మనస్సు ఉండడం స్వస్థత. తన చైతన్యాన్ని నిరంతరం ఉపాసించేది స్వస్థత. రామునికి హనుమంతునిలా ఎప్పటికీ చైతన్యం ప్రక్కనే మనస్సును, తలవంచి ఉంచడం అలవాటు అయితే ఎప్పటికీ స్వస్థత చేకూరినట్లే. ఇది ఆరోగ్యం అనే సంకోచార్థంలోనే కాకుండా చాలా విస్తరంగా వినియోగించుకోదగిన పదం. మనస్సుకు కావలసిన శక్తి సముపార్జించుకుంటే నిత్య జీవన వ్యవహారాలు త్వరగా పూర్తి అవుతాయి. ఇంకా, ఇంకా అదే పని చేస్తూ ఉండి, తనలో తాను ఉండడం వల్ల ఇతర వ్యవహారాలకు దూరమైన మనస్సుకు అపరిమితమైన శక్తి వస్తుంది. దానితో ఈ శరీరం అనే పరికరంతో అద్భుతాలు సృష్టించగలుగుతారు. పరస్థతలో ఉండేవారి శక్తి క్రమంగా క్షీణించి వారు శారీరక, మానసిక బలహీనతలతో ఇబ్బందులకు గురి అవుతూ ఉంటారు. అందుకే అందరూ స్వస్థతను పొందాలి. నిరంతరం ఇంద్రియ సంబంధమైన లోక వ్యవహారాల్లో కాకుండా, ఆనంద వ్యవహారాల్లో, చైతన్య వ్యవహారాల్లో మనస్సును నిమగ్నం చేస్తూనే ఉండాలి. అద్భుతాలను సృష్టిస్తున్న కొందరిదే ఈ లోకం అన్నప్పుడు వారంతా స్వస్థులైనవారే. నిరంతరం తపస్సంపన్నులే. ఆ మార్గమే మన ఉన్నతికి శిరోధార్యం.

# మహా శివరాత్రి



అఘములను బాపు పుణ్యాల యభవరాత్రి
సకల భువనాల గాపాడు శైవరాత్రి
చీకటుల వెన్నెలలు నింపు చిత్రరాత్రి
భువిని గాపాడు శివరాత్రి పుణ్యరాత్రి!

స్థావర జంగమ్ములను చక్కగ గాచెడి లింగరూపమే
పావనరాత్రి యుద్భవముపాస్యమునై గనుపట్టెనే నిశన్
పావనమైన యా నిశి విభాసితమై శివరాత్రి పర్వమై
జీవులకెల్ల జీవనమశేష సుఖమ్ములనిచ్చి బ్రోచెడిన్

శివుడన జీవుడే సకల జీవులు గాంచ శివ స్వరూపులే
యవిరళ కర్మలన్ వెలయు నాంతరతత్త్వము శైవమేయనన్
స్తవనము జేయు వేదములు సంతతమున్ నమకాది మంత్రముల్
భువి నలరించు పుణ్యముల పుష్కలరీతిగ పంచిపెట్టుచున్



గాంగ తరంగ మాలికలు గావలె శంభుని సేవజేయగా
తుంగశిరోజ పంక్తి తులతూగును పున్నమచందమామయే
యంగములన్ విభూతియసమంచిత లేపనమై చెలంగగా
మంగళ దాయకమ్మయిన మాన్యశివున్ ప్రణుతింతు నెప్పుడున్

లాస్యములనాడు పార్వతి లాలనమున
తాండవములాడు శంభుడు తత్పరుండయి
భువిని ప్రతి యిల్లు కైలాసముగ వెలుంగ
సాగుచుండును శివరాత్రి సత్ఫలముగ





డా. అయాచితం నటేశ్వర శర్మ
విశ్రాంత అధ్యాపకులు, కామారెడ్డి, ఫోన్ : 94404 68557

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5 6 హైదరాబాద్ మార్చి : 2022

నివాళి

## ప్రఖ్యాత ఆంధ్ర నాట్య కళాకారిణి "డా. సువర్చల" గారి అస్తమయం



కాకతీయుల కాలంలో ఉన్న పేరిణి నృత్యకళకు ఆధునిక కాలంలో తిరిగి ప్రాభవాన్ని కల్పించిన పద్మశ్రీ నటరాజ రామకృష్ణగారి ప్రత్యక్ష శిష్యురాలు శ్రీమతి పెన్నా సువర్చలగారు. వీరు తెలుగు విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 1991లో హైదరాబాదు కేంద్రీయ విశ్వ విద్యాలయంలో నృత్యకళలో ఎం.ఏ పూర్తిచేసిన వీరు ఆంధ్రనాట్యం మీద పిహెచ్.డి. పూర్తిచేసి 1997 డాక్టరేట్ పట్టాను తీసుకున్న మొదటి మహిళగా ఖ్యాతికెక్కినారు.

లాస్యాభినయం చేయడంలో వీరిని మించినవారు లేరనడం అతిశయోక్తి కాదు. తెలుగువిశ్వవిద్యాలయంలో నృత్యశిక్షకురాలుగా చేరినప్పటినుండి వందలాది మంది శిష్యులకు ఆంధ్రనాట్యం బోధించినారు. ఆ శిక్షణలో భాగంగానే అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చినారు. స్వయంగా తన కూతురు సాత్వికకు గురువుగా ఉండి ఆంధ్రనాట్య పరిధిని విస్తరించినారు.

తెలంగాణా ప్రభుత్వంవారి విశిష్ట మహిళా పురస్కారంతో పాటు అనేక దేశీయ విదేశీయ అవార్డులను అందుకున్నారు. పలు పత్రికలలో నాట్యసంబంధమైన వ్యాసాలు రచించారు. సుమారు 30 వరకు దేశీయ, జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పత్ర సమర్పణలు చేసినారు.

1. 'ది లాస్య డాన్స్ ట్రెడిషన్ ఆఫ్ ఆంధ్ర' 2. ది నాయికాస్ ఆఫ్ క్షేత్రయ్య పదాన్ 3. నటరాజ రామకృష్ణగారి జీవితచరిత్రకు సహరచయిత్రి 4. ఆంధ్రనాట్య వికాసం అనే మోనోగ్రాఫ్ 5. నటరాజ రామకృష్ణగారి మోనోగ్రాఫ్, 5. సరిదె మాణిక్యమ్మ మోనోగ్రాఫ్ 6. నర్తన స్ఫూర్తి – వ్యాసమంజీరాలు అనే పుస్తకాలు రచించి ముద్రించారు.

శ్రీమతి సదిరె మాణిక్యమ్మ వద్ద చిన్నతనంలోనే నృత్యశిక్షణ తీసుకున్న వీరు నటరాజరామకృష్ణగారి వద్ద శిష్యరిషం చేసి నృత్యరీతిలో మెళకువలు గ్రహించి తన అభినయాన్ని మెరుగుదిద్దుకున్నారు.

అవాంఛనీయ అనారోగ్య సమస్యతో2.03.2022వ తేదీన హైదరాబాదులో మరణించారు. మూసీ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వీరి మరణం మాకే కాదు యావత్ నృత్యకుటుంబానికి తీరని లోటని భావిస్తున్నాం. వారి పాదాలు నటరాజును చేరినాయి. అలసిన ఆ పాదాలకు సాత్వికతను చేకూర్చాలని ఆ నటరాజును ప్రార్థిస్తూ......

## తుకారాం అభంగం

ఆనందాల కోటి భావన
అమృతాల సాటి దీవెన
అంతరాల భావ సాధన
వంపి పోసె నా ఉదరాన

ప్రేమ పొంగెనొక ప్రవాహమై
నామ ఘోషణము ప్రమాణమై
భూమి గర్జించె పదముల
పాండురంగ పాండురంగ

అఖండ జీవన సుఖముల
ఖండిచ ఖరాలు గాంచితి
రామకృష్ణ నారాయణుని
మంత్ర జపము జేయుచుంటిని

గట్టి పలుకు విని నువు మరలు
తుకాతో పిల్ల త్రోవన నడువు




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5

UGC Care List Approved Journals
హైదరాబాద్ మార్చి : 2022

# తెలుగు భాషాభివృద్ధి వ్యూహంగా అనువాదం

**డా. బాణాల భుజంగరెడ్డి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 94 93 97 6813

**1. ఉపోద్ఘాతం :**

ఏ భాషైనా రెండు విధాలుగా అభివృద్ధి చెందుతుంది.

**ఒకటి :** తనలోని ప్రకృతి, ప్రత్యయాల నూతన కలయికల ద్వారా కొత్త పదాలు ఏర్పడుతాయి. కృదంతాలు, తద్ధితాలు, శబ్దపల్లవాలు ఇలా ఏర్పడినవే. **రెండు :** ఇతర భాషా పదాలను ఆదానం (borrowing) చేసుకోవడంవల్ల, అనువాదం (translation) చేసుకోవడంవల్ల, నూతన పద సృష్టి (lexical coining) వల్ల కూడా నూతన పదాలు ఏర్పడతాయి. లారీ, బస్సు, కారు, హోటలు, మోటరు మొదలైనవి ఆదానం ద్వారా తెలుగులో చేరాయి. నల్లధనం (black money), శ్వేతపత్రం (white paper), పచ్చజెండా (green signal) మొదలైనవి అనువాదం ద్వారా తెలుగులో చేరాయి. రాష్ట్రపతి, ఉపకారవేతనం, ద్రవ్యరాశి, గరిమనాభి మొదలైనవి నూతన పద సృష్టి ద్వారా ఏర్పడినవి. భాష అభివృద్ధి చెందే విధానాన్ని గురించి ఇద్దరు భాషావేత్తలు చెప్పిన ఈ కింది మాటలు ఈ సందర్భంలో గమనించదగ్గవి. **"ఏ భాష అయినా రెండు విధములుగా పెరుగుతూ ఉంటుంది. 1. సహజముగా దానికి గల శక్తిని బట్టి, 2. ఇతర భాషల ప్రభావము, సంపర్కమును బట్టిన్నీ. సహజశక్తి అనగా, క్రొత్త భావములను వ్యక్తము చేయుటకు అదివరకున్న మాటలకు ప్రత్యయములను గాని అనుబంధములను గాని చేర్చుకోగల శక్తి.....ఇతర భాషల సంపర్కమువల్లనుగానీ, ప్రభావము వల్లనుగాని భాషాభివృద్ధి ఎట్లు కలుగునంటే - చిన్న జెలగా పుట్టిన ఊటగడ్డ మహానదిగా ప్రవహించుటకు శాఖానదులు తోడ్పడును. అట్లే విదేశీయ పదములు భాషాభివృద్ధికి తోడ్పడుతవి."** (సీతాపతి 1970 : 39) అని గిడుగు సీతాపతిగారు అన్నారు. **"మానవ సమాజంలో అనునిత్యమూ పెరుగుతున్న అవసరాల దృష్ట్యా భావావిష్కరణ విధానాలలో ప్రధాన సాధనమైన భాష పెరుగుతుంది. సరికొత్త మలుపులతో మారుతుంది. అది సొంత వనరులతో కొంత ఎదగవచ్చు, పరభాషల సంసర్గంతో మరికొంత పెరగవచ్చు. ఆయా భాషా వ్యవహర్తల అవసరాలపరమైన మౌలిక దృష్టీ, స్వస్థాన వేషభాషా ప్రియత్వమూ, పాలక పాలిత సంబంధాలూ, పరభాషలపట్లగల వ్యామోహ వైముఖ్యాలూ మున్నగు అనేకాంశాలపై ఏతద్భాషల పరమైన ఆదాన వైవిధ్యమూ, అభివృద్ధి విధానమూ ఆధారపడి ఉంటాయి."** (దొణప్ప 1988: 67) అని తూమాటి దొణప్పగారు అన్నారు. **"అహేహ్యమన్య దేశీయం యత్తదేవ ప్రయుజ్యతే"** అని అన్యదేశి పదాల ప్రయోగానికి మన లాక్షణికులు అనుమతించారు




(దొణప్ప 1988: 79). "You cannot keep out foreign words as you keep out foreign manufactured goods. Perhaps Telugu accepts them more easily than any other Indian language and this will certainly help to make it a rival to Hindi in teaching science, medicine and engineering (quoted by Kusuma kumari 2012 :86). కాబట్టి, ఆదానాలద్వారాగానీ, అనువాదాలద్వారా గానీ తెలుగులో చేరిన అన్యదేశి పదాలు తెలుగు భాషాభివృద్ధికి కారణమయ్యాయనే చెప్పాలి.

**1.1. భాషా ప్రణాళిక** (Language Planning)

ఏ భాషైనా కాలక్రమంలో సొంత వనరులతోనూ, పరభాషల ప్రభావంతోనూ సహజంగానే అభివృద్ధి చెందుతుంది. కాని, దానికి చాలాకాలం పడుతుంది. ఏదైనా భాషను ప్రయత్నపూర్వకంగా తక్కువ సమయంలో కూడా అభివృద్ధి చెయ్యవచ్చు. ప్రభుత్వంగానీ, ప్రభుత్వేతర సంస్థలుగానీ, వ్యక్తులుగానీ ఇలా ఒక భాషను ప్రయత్న పూర్వకంగా తక్కువ కాలంలో అభివృద్ధి చెయ్యడానికీ, దాని వాడుకను విస్తరించడానికిగానీ చేసే ప్రయత్నాలనే భాషా ప్రణాళిక (Language Planning) అంటారు. ఈ భాషా ప్రణాళిక రెండు రకాలు.

**ఒకటి :** స్థాయి / హోదా ప్రణాళిక (Status planning),

**రెండు :** వనరుల/ సామగ్రి ప్రణాళిక (Corpus planning).

**1.1.1 స్థాయీ ప్రణాళిక** (Status planning):

ఒక భాషను ప్రయోగించే పరిధిని విస్తృతంచేసి దాని స్థాయిని పెంచితే అది స్టేటస్ ప్లానింగ్. ఉదాహరణకు, మాండలికంగా కేవలం నిత్యవ్యవహారంలో మాత్రమే ఉపయోగిస్తున్న భాషను ప్రామాణిక భాషగా నిర్ణయించి పాఠ్యపుస్తకాల్లోనూ, పరిపాలనలోనూ, ప్రసార సాధనాల్లోనూ అధికార భాషగా అమలు చేయడాన్ని స్టేటస్ ప్లానింగ్

అంటారు. తెలంగాణా భాషను తెలంగాణా రాష్ట్రం ఏర్పడకముందు మాండలికంగా భావించేవారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణా భాషను అన్ని పాఠ్యపుస్తకాల్లోనూ, పత్రికల్లోనూ ప్రామాణిక భాషగా వాడే ప్రయత్నం చేస్తున్నారు. పెరిగిన తెలంగాణా భాషా స్థాయికి అనుగుణంగా ఈ భాషను అభివృద్ధి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**1.1.2. వనరుల ప్రణాళిక** (Corpus planning):

కార్పస్ ప్లానింగ్ లో మూడు అంశాలుంటాయి. 1. Graphization, 2. Standardization, 3. Modernization. ఒక భాషకు కొత్తగా లిపిని ఏర్పరచడాన్ని లేదా ఇదివరకే వాడుకలో ఉన్న లిపిలో మార్పులుచేసి సంస్కరించడాన్ని **లిపి కల్పన లేదా లిపి సంస్కరణ** (Graphization) అంటారు. ఒక ప్రాంతంలో అనేక మాండలికాలు ఉన్నప్పుడు వాటిలో ఏదో ఒక మాండలికాన్ని ప్రమాణ భాషగా గుర్తించి దాని రూపాన్ని స్థిరీకరించడాన్ని ప్రామాణీకరణ (Standardization) అంటారు. ఒక ప్రాంతం మాండలికాన్ని ప్రమాణ భాషగా గుర్తించిన తరువాత ఈ భాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి ఆధునికీకరించడమే Modernization. కార్పస్ ప్లానింగ్ లో ఇదే అత్యంత కీలకమైంది. ఎందుకంటే, ఒక భాషను ఆధునికీకరించడం అంటే ఆధునిక అవసరాలకు తగినట్లుగా భాషలో నూతన పదజాలాన్ని సృష్టించడం, పాత పదాలకే కొత్త అర్థాలను కల్పించడం, నూతన వ్యాకరణాలు రాయడం, భాషలోని మొత్తం పదజాలానికీ, పదబంధాలకూ, సామెతలకూ నిఘంటువులు తయారు చెయ్యడం. Language development is the series of ongoing planned actions that a language community takes to ensure that its language continues to serve its changing social, cultural, political, economic and spiritual needs and goals. (Suh Joseph Che 2011)" Suh Joseph Che అన్న మాటలు ఈ సందర్భంలో గమనించదగ్గవి.

**2. నూతనపద కల్పన పద్ధతులు :**

తెలుగు భాషాభివృద్ధిలో 7 రకాల నూతన పద కల్పన పద్ధతులు కనిపిస్తున్నాయి. అవి. 1. ఆదానం (borrowing), 2. మిశ్ర ఆదానం (loan blends), 3. ఆదాన అనువాదం (loan translation), 4. పాక్షికానువాదం (partial translation), 5. నవీనార్థ కల్పన (semantic re-interpretation), 6. అర్థవిస్తరణ (semantic expansion), 7. నూతనపద సృష్టి (lexical coining) (Krishnamurti 1984 : 101-106) వీటిలో ఆదాన అనువాదం, పాక్షికానువాదం, భావానువాదం అనే పద్ధతులతోపాటు అనువాద ప్రక్రియ తెలుగు భాషాభివృద్ధికి ఎలా తోడ్పడిందో వివరించడమే ఈ పత్రం ఉద్దేశం.

**3. అనువాద ప్రక్రియ - తెలుగు భాషాభివృద్ధి :**

నన్నయ కాలం నుంచి ఇప్పటివరకు జరిగిన తెలుగు భాషాభివృద్ధిని పరిశీలించినట్లయితే, నన్నయ కాలం నుంచే అనువాదం తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడినట్లు మనకు తెలుస్తుంది. సంస్కృత మహాభారతాన్ని తెలుగులోకి అనువదించే సమయంలో నన్నయ, తిక్కన, ఎర్రన మహాకవులు సంస్కృతంలోని అనేక పదాలనూ, పదబంధాలనూ తత్సమాల రూపంలో తెలుగు భాషలోకి ప్రవేశపెట్టి తెలుగుభాషకు స్థిర రూపాన్నీ, ప్రామాణిక రూపాన్నీ కల్పించి తెలుగు భాషాభివృద్ధికి బాటలు వేశారు. మారన, పోతన, శ్రీనాథుడు, పెద్దనాది ప్రబంధకవులు కూడా సంస్కృత కావ్యాలను తెలుగులోకి అనువదించేటప్పుడు సంస్కృతంలోని అనేక పదాలనూ, పదబంధాలనూ తత్సమాల రూపంలో తెలుగు భాషలోకి ప్రవేశపెట్టారు. ప్రాచీన తెలుగు కవుల కావ్యానువాదాలవల్ల తెలుగు సాహిత్యమూ, దానితోపాటు తెలుగు భాషా అభివృద్ధి చెందాయి. మహ్మదీయ రాజులైన కుతుబ్షాహీల, అసఫ్జాహీల పరిపాలన సమయంలో పరిపాలనకు సబంధించిన అనేక అరబ్బీ, పారసీ, తుర్కీ పదాలు ఆదానాల రూపంలోనూ, అనువాదాల రూపంలోనూ తెలుగులో చేరి తెలుగు భాషకు పుష్టినిచ్చాయి. కరారునామా, కౌలునామా, చిరునామా, రాజీనామా, ఫౌజ్దారు, జమీన్దారు, అమీన్సాబ్, మొదలైన పర్షో అరబిక్ పదాలు తెలుగులో చేరాయి. ఖురానును తెలుగులోకి అనువదించడంవల్ల ఖురాను, ప్రవక్త, మసీదు, నమాజు, అజా, అల్లా లాంటి పదాలు తెలుగులో చేరి తెలుగు భాషను సుసంపన్నం చేశాయి. అలాగే, బ్రిటీషు వారు మనదేశానికి వచ్చి మనల్ని పరిపాలించడం మొదలుపెట్టిన తరువాత ఇంగ్లీషు భాష తెలుగు భాషను నిరంతరాయంగా ప్రభావితం చేస్తూ తెలుగు భాష అభివృద్ధికి తోడ్పడుతున్నది. ఇంగ్లీషు బైబిలు అనువాదం ఇంగ్లీషు భాషాభివృద్ధికి తోడ్పడినట్లుగానే తెలుగు బైబిలు అనువాదాలు కూడా తెలుగు భాషలో కొత్త పదాలనూ, పదబంధాలను ప్రవేశపెట్టి తెలుగు భాషాభివృద్ధికి తోడ్పుతున్నాయి. బాప్తిజం, జ్ఞాన స్నానం, స్వస్థత కూటాలు, సువార్త, ఎహోవా, ఏసు క్రీస్తు, బిషప్, ఫాదర్, చర్చి మొదలైన పదాలు బైబిలు అనువాదాల ద్వారా తెలుగులో చేరాయి.

ఇంగ్లీషు - తెలుగు ద్విభాషా నిఘంటు నిర్మాణంలో కూడా అనువాదం ఎంతో ఉపయోగపడింది. నిఘంటువులూ, పదకోశాలూ నిర్మించడం భాషాభివృద్ధిలో భాగమే. తెలుగు అకాడమి Concise Oxford Dictionary ని తెలుగులోకి అనువదింపజేసింది. భౌతిక, రసాయన, జీవ, భాషాశాస్త్రాలకు పారిభాషిక పదకోశాలను (glassories) ద్విభాషా నిఘంటువుల రూపంలో తయారు చేయించింది. ఆంగ్లంలోని అనేక శాస్త్ర గ్రంథాలను అనువాదం చేయించి తెలుగు భాషాభివృద్ధికీ, ఆధునికీకరణకు కృషి చేసింది, చేస్తున్నది. ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ప్రసారాంగ శాఖ, పొట్టి

శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ప్రచురణల విభాగం, నేషనల్ బుక్ ట్రస్టు, కేంద్ర సాహిత్య అకాడమి, నేషనల్ ట్రాన్స్లేషన్ మిషన్, రష్యాలోని రాదుగ, ప్రగతి ప్రచురణాలయాలతోపాటు అనేక ప్రచురణ సంస్థలు ఇతర భాషలనుంచి అనేక గ్రంథాలను తెలుగులోకి అనువదింపజేసి ప్రచురించి తెలుగు సాహిత్యంతోపాటు తెలుగు భాషాభివృద్ధికి పాటుపడుతున్నాయి. తెలుగు దిన, వార, పక్ష పత్రికలు, రేడియో, టీవీ ఛానళ్ళు ప్రతిరోజు అనేక అంతర్జాతీయ వార్తలనూ, కథనాలనూ ఇంగ్లీషునుంచి అప్పటికప్పుడు శరవేగంతో అనువాదం చేసి ఎన్నోనూతన పదాలను కల్పించడం ద్వారా తెలుగు భాషాభివృద్ధికీ, ఆధునికీకరణకూ ఇతోధికంగా సహాయపడుతున్నాయి.

భాషా సాహిత్య రంగాలతోపాటు గణిత, భౌతిక, రసాయన, జీవశాస్త్ర రంగాల్లోనూ, సామాజిక శాస్త్రాల రంగంలోనూ, మానవీయ శాస్త్రాల రంగంలోనూ, పరిపాలనా, న్యాయ రంగాల్లోనూ, వైద్యరంగంలోనూ, పత్రికా రంగంలోనూ, సినిమారంగంలోనూ, క్రీడారంగంలోనూ, ఇంకా అనేక ఇతర రంగాల్లోనూ నూతన పద కల్పనకు అవకాశం కల్పించి తెలుగు భాష అభివృద్ధికి అనువాదం ఎంతగానో తోడ్పడుతున్నది. ఇక్కడ పేర్కొన్న రంగాలలో ఆదాన అనువాదం, పాక్షికానువాదం, భావానువాదం పద్ధతిలో కల్పించబడిన నూతన పదాలను ఇప్పుడు చూద్దాం.

**4.1 (పదాల) ఆదాన అనువాదం** (Loan translation / Calquing) :

ఇతర భాషల్లోని పదబంధాలను పద పదానువాదం చెయ్యడమే ఆదాన అనువాదం. ఉదాహరణలు : Socio linguistics = సామాజిక భాషా శాస్త్రం Applied linguistics = అనువర్తిత భాషాశాస్త్రం, Language Planning = భాషా ప్రణాళిక, Standardization = ప్రామాణికీకరణ (Modernization = ఆధునికీకరణ / నవీకరణ, Dictionary of synonyms = పర్యాయ పదకోశం, Etymological dictionary = వ్యుత్పత్తి పదకోశం, deep structure = గుప్తనిర్మాణం, surface structure = వ్యక్తనిర్మాణం, simple sentence = సామాన్య వాక్యం, compound sentence = సంయుక్తవాక్యం, complex sentence = సంశ్లిష్ట వాక్యం, lowest common multiple = కనిష్ఠ సామాన్య గుణిజం, maximum common multiple = గరిష్ఠ సామాన్య గుణిజం, right angle = లంబకోణం, trigonometry = త్రికోణమితి triangle = త్రిభుజం, abdominal cavity = ఉదరకుహరం, cross - pollination = పరపరాగ సంపర్కం, self - pollination = ఆత్మపరాగ సంపర్కం, gravitational force = గురుత్వాకర్షణ శక్తి, light reflection = కాంతి పరావర్తనం light refraction = కాంతి వక్రీభవనం, relativity theory = సాపేక్ష సిద్ధాంతం convex lens = కుంభాకార




కటకం, concave lens = పుటాకార కటకం, united nations organization = ఐక్య రాజ్య సమితి, joint action plan = ఐక్య కార్యాచరణ పథకం, all party meeting = అఖిల పక్ష సమావేశం, public relations officer = ప్రజా సంబంధాల అధికారి, civil supply department = పౌర సరఫరాల శాఖ, human resource development = మానవ వనరుల అభివృద్ధి, financial crisis = ఆర్థిక సంక్షోభం, developing countries = వర్ధమాన దేశాలు, poverty line = దారిద్ర్యరేఖ, summit conference = శిఖరాగ్ర సమావేశం, midterm polls = మధ్యంతర ఎన్నికలు మొదలైనవి.

**4.1.1 నుడికారాల ఆదాన అనువాదం** (Loan translation of idioms) :

నుడికారాలను పద పదానువాదం చెయ్యడం ఈ పద్ధతిలో కనిపిస్తుంది. ఉదాహరణలు : pen stroke = కలంపోటు, lame excuses = కుంటి సాకులు, crocodile tears = మొసలి కన్నీరు, whirlwind tour = సుడిగాలి పర్యటన, paper tiger = కాగితం పులి, to kick the bucket = బాల్చీ తన్ను, white elephant = తెల్ల ఏనుగు, bed of flowers = పూల పాన్పు మొదలైనవి.

**4.2 (పదాల) భావానువాదం** (Conceptual translation):

ఇతర భాషా పదాలకు పద పదానువాదం కాకుండా భావ సమానార్థకాలను కల్పించడమే భావానువాదం. ఉదాహరణలు: Encyclopedia = విజ్ఞాన సర్వస్వం, Concordance = పదప్రయోగ కోశం, Thesaurus = సంబంధి పదకోశం, University = విశ్వవిద్యాలయం, Editor = సంపాదకుడు, Alge-

bra = బీజగణితం, Calculus = కలనగణితం, Functions = ప్రమేయాలు, Fractions = భిన్నాలు, Numerator = లవము Denominator = హారము, Gravitational force = గురుత్వాకర్షణ శక్తి, Mass = ద్రవ్యరాశి మొదలైనవి.

**4.2.1 నుడికారాల భావానువాదం** (Conceptual translation of idioms) :

మూల భాషలోని నుడికారాలను పద పదానువాదం చెయ్యకుండా భావ సమానార్థకాలను కల్పించడమే నుడికారాల భావానువాదం. ఉదాహరణలు : poke one's nose = తల దూర్చు, grease one's palm = చేయి తడుపు, cock and bull stories = కాకమ్మ కథలు / పిట్టకథలు, black day = నిరసన దినం, hard nut to crack = కొరకరాని కొయ్య, in a nutshell = ఒక్క మాటలో / క్లుప్తంగా, tall talk గొప్పలు / బడాయిలు మొదలైనవి.

**4.3 పాక్షికానువాదం** (Partial translation) :

మూలభాషలోని పదబంధంలో ఉన్న ఒక పదాన్ని లిప్యంతరీకరణ ద్వారా ఆదానం చేసుకోవడం, మరో పదాన్ని అనువాదం చెయ్యడాన్ని పాక్షికానువాదం అంటారు. ఉదాహరణలు: member of parliament = పార్లమెంటు సభ్యుడు, world bank = ప్రపంచ బ్యాంకు, five star hotel = ఐదు నక్షత్రాల హొటల్, small scale industry = చిన్న తరహా పరిశ్రమ, small savings = చిన్న మొత్తాల పొదుపు మొదలైనవి.

**4.3.1 నుడికారాల పాక్షికానువాదం** (Partial translation idioms) :

నుడికారాలను పదపదానువాదం చెయ్యకుండా, మూల భాషలోని ఒక పదాన్ని లిప్యంతరీకరణ ద్వారా ఆదానం చేసుకోవడం, మరో పదాన్ని అనువాదం చెయ్యడం ఈ పద్ధతి. storm in a teacup = టీ కప్పులో తుఫాను. ఇందులో storm అనే పదాన్ని మాత్రమే అనువాదం చేసారు. teacup ను అనువాదం చెయ్యకుండా లిప్యంతరీకరణ ద్వారా ఆదానం చేసుకోవడం జరిగింది.

**పాక్షిక భావానువాదం** (Conceptual partial translation):

మూల భాషలోని పదబంధంలోని ఒక పదాన్ని పదానువాదం చెయ్యడం మరొక పదాన్ని భావానువాదం చెయ్యడం పాక్షిక భావానువాద పద్ధతి. ఉదాహరణలు : cold war = ప్రచ్ఛన్న యుద్ధం, civil war = అంతర్యుద్ధం, cloud seeding = మేఘ మథనం, drip irrigation = బిందు సేద్యం, sprinkler irrigation = తుంపర్ల సేద్యం, standing committee = స్థాయి సంఘం, capital punishment = మరణ శిక్ష, death sentence = ఉరిశిక్ష మొదలైనవి.

**ముగింపు :**

వివిధ రంగాల్లో అనువాదం ద్వారా తెలుగు భాషలో ఎన్ని నూతన పదాలూ, నుడికారాలూ తెలుగు భాషలో చేరాయో పైన పేర్కొన్న ఉదాహరణల వల్ల తెలుస్తుంది. పైన పేర్కొన్న ఉదాహరణల జాబితా సమగ్రం కాదు, మచ్చు మాత్రమే. పై ఉదాహరణల్ని చూస్తుంటే, అనువాదం లేకుండా తెలుగు భాషాభివృద్ధి అసాధ్యమేమో అనిపిస్తున్నది. అనువాదం అనేది మనకే కాదు ఏ జాతికైనా ఎంత అవసరమో ఈ కింది Paul Engel గారి మాటల్ని చదివితే తెలుస్తుంది. As the world shrinks together like an aging orange and all people in all cultures move closer together (however reluctantly and suspiciously) it may be that the crucial sentence for our remaining years on the earth may be very simply TRANSLATE OR DIE" (quoted in Gentzler, Edwin. 1993:9).

**ఉపయుక్త గ్రంథ సూచి :**


దొణప్ప, తూమాటి. 1988. ఆకాశభారతి. హైదరాబాదు : సుధారా పబ్లికేషన్స్

సీతాపతి, గిడుగు వెంకట. 1970. సాహిత్యోపన్యాసములు-1. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

Gentzler, Edwin. 1993. Contemporary Translation Theories. London : Routledge

Kaplan B., Robert, and Richard B. Baldauf Jr. 1997. Language Planning from Practice to Theory. Clevedon: Multilingual Matters ltd.

Krishnamurthi, Bh. And Aditi Mukherjee. 1984. Modernization of Indian Languages in News Media. Hyderabad: Department of Linguistics, Osmania University

Suh Joseph Che. "The Role of Translation in the implementation of Language Policy in Cameron" in Translation Journal. Volume 15, No. 3 July, 2011 at http://translationjournal.net/journal/57cameroon.htm

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2022

బండారం కథలు - 4

# జంజాటం

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



ఇల్లలుకుతుంటే చంద్రవ్వకు పరవశం కలుగుతున్నది. ఆ పరవశంలో తెలియకుండానే కూనిరాగం కూడా వచ్చింది. ఎవరేమనుకుంటారోనని తమాయించుకున్నది. అలుకుతూ అలుకుతూ అలుకుపిడుచ కుండలో ముంచి తీసింది. ఎర్రలుకు కదా పొడి ఎండకు అరుగు మెరుస్తున్నది. అమాసకో పున్నానికో తప్ప అలుకు ఎరుగని ఇల్లు, మెరువని ఇల్లు రెండూ కాకపోయినా ఇయ్యాల మెరుస్తున్నది. అలుకు మరకలంటిన చంద్రవ్వ ముఖం కూడా మెరుస్తున్నది. అంగీల్లేకపోయినా సోపుబెండ్లతో బండి చేసుకొని ఆటాడుకుంటున్న ఇద్దరు చిన్నపిల్లల ముఖాలు కూడా మెరుస్తున్నాయి. అలుకు పూర్తిచేసి ఎర్ర అరుగుమీద తెల్లటి ముగ్గు వేస్తుంటే ఇంటికే కొత్తకళ వచ్చింది. ఇల్లంటే ఇల్లు కాదు. తాటాకుల గుడిసె. ముందు చిన్న అరుగు. పైన ఆకులుండిపోయిన పందిరి. పేడ అలికిన వాకిలి. నడుమ మరో ముగ్గు. ఆ రోజు ఎవరికి ఏ పండుక కాకపోయినా ఆ ఇంటికి పండుగే. చంద్రవ్వకు పెద్ద పండుగ.

ఏడాదిన్నర కిందట ఊరిడిసి, ఇల్లిడిసి చెప్పా పెట్టకుండా వెళ్లిపోయిన చంద్రవ్వ పెనిమటి రామనర్సయ్య ఈవేళ తిరిగొస్తాడు. ఏడాది దాకా ఎటు వెళ్లాడో జాడ దొరకలేదు. జాడ దొరికినా అడ్రస్ దొరకలేదు. జాడ దొరికినా అడ్రస్ దొరుకలేదు. అడ్రస్ దొరికించుకొని బతిమాలుతూ కార్డులు రాయగా రాయగా ఈరోజు తిరిగొస్తున్నాడు. కనబడని మనిషి కనిపించబోతున్నందుకు ఎవరికైనా ఆనందమే కదా. చంద్రవ్వ తడికచాటు ఏర్పాటులో తలారాస్నానం చేసింది. పిల్లలిద్దరికీ స్నానం చేయించింది. ఎన్నోరోజుల తర్వాత తలకు ఇంతనూనె రాసి తయారైంది. పిల్లల్ని తయారు చేసింది. రెండు రోజుల నుండి వాడంతా చెపుతూనే ఉన్నది. రామనర్సయ్య వస్తానన్నాడని.

చంద్రవ్వంటే రామనరసయ్యకూ, రామనర్సయ్యంటే చంద్రవ్వకూ తనివి తీరని ప్రేమే. ఒకరికొకరు ఇష్టం కాదా, విడిచి ఉండలేనంత ఇష్టం. మరెందుకట్లా జరిగింది? అదే విధి. అదే రాతంటారు.

చంద్రవ్వ ఎండలో కూచుని ఇద్దరు పిల్లలకు తినిపిస్తున్నది. ఎప్పుడో తప్ప తినిపించని అవ్వ ఈరోజు తినిపిస్తున్నందుకు పెద్దపిల్లవాడికి ఆనందంగానూ, ఆశ్చర్యంగానూ ఉన్నది. పైగా రోజూ గటక తినే ఇంట్లో ఈరోజు బువ్వ. జరమొస్తే బువ్వ, జేజెకు పెడితే బువ్వ తప్ప దొరకని బువ్వ ఇంటి సంబురాన్ని తలపిస్తున్నది. చంద్రవ్వ మనసు దాచుకోలేదు, నోరు దాచుకోదు. రెక్కలు దాచుకోదు. పనిచేస్తే పొక్తాగా చేస్తుంది. వంకుండదు. మాటొస్తే, బాజాప్త మాట్లాడుతుంది. ఉంచుకోదు. పటేండ్లు పనికి పిలిచారు, రానన్నది. ఇంత తీరిగ్గా, ఇంత హుషారుగా ఎప్పుడూ లేదు. ఆమె చూపు రోలుమీదికి, అటుమీదికి పొయ్యిమీదికి పొయ్యింది. మండి చల్లారిన కట్టెలు తనలాగే అనిపించాయి. అట్లా చూస్తుంటే ఎదురుగా గుడిసె చూరు. పక్కన కొయ్యబోసిగా ఉంది. ఏక్తార కనబడలేదు. సంసారాన్ని చట్టుబండలు చేసిన ఏక్తార. ఏక్తార గుర్తుకురాగానే రామనర్సయ్య గుర్తుకొచ్చాడు.

పెళ్లయ్యేనాటికి అటు ఆసరా, ఇటు ఆసరా లేదు. రెక్కాడితే తప్ప డొక్కాడని బతుకులు. డొక్కనిండ తిండి ఉంటే మనసు నిండ ప్రేమలుంటాయి. తల్లిగారింట్లయినా, అత్తరారింట్లయినా కష్టం చేస్తెనే సంసారం గడిచేది. ఎవుసం లేని కుటుంబాలు, మొగోల్లు జీతముండాలె. ఆడోల్లు కైకిలి జెయ్యాలె. అట్లయితేనే నడిచే సంసారాలు. చంద్రవ్వ కాపురానికొచ్చే నాటికి అత్తామామలుండేది. మామ నీరటి పని. అత్త కైకిలి పని. తాను అత్తతోటి అన్ని పనులకు వెళ్ళేది. యాడాది దాకా తిప్పలు తెలియకుంట నడిచింది. రామనర్సయ్య ఒక్కడే కొడుకు. గావురం పెరిగాడు. పని ఇష్టం ఉండదు. పాటలిష్టం. ఏక్తార్ పట్టుకోని తత్వాలు పాడుతుంటే చంద్రవ్వకు కూడా నచ్చేది. నాట్లేసేటప్పుడు తను కూడా పాడేది. తన పాటలు వేరు. ఆయన పాటలు వేరు. ఇంతలోనే కరువొచ్చి చెరువులెండిపోయాయి. నీరటి పని మూలకు పడింది. పంటల్లేవు. బిచ్చాల్లేవు. మామ మూలకువడి రోగాన పడి వెళ్ళిపోయాడు. అన్ని చేసుకునే అత్త కొడుకు తీరుకు నొచ్చుకున్నది. కొడుకుననలేక కోడలుమీద పడేది. కొట్లాటలకు గుడిసె గుండె పగిలింది.

రామనర్సయ్య తత్త్వాలు పాడుకుంటూ తరించేది. చంద్రవ్వ గులుగుకుంటూ భరించేది. సంసారం కష్టపడింది. మనుమడి పుట్టుకతో ఎంత మురిసినా ఇల్లు ఎల్లదియ్యలేక అత్త అవస్థ పడింది. కడుపు కట్టుకొని కట్టుకొని నొప్పి పెరిగితే చీర బిగదీసి కడుపుకు కట్టుకొని కట్టుకొని లోకం విడిచింది.

అంతే, చంద్రవ్వ కష్టాలు చెప్పరాదు. తన ఒక్కదాని రెక్కలు ముగ్గురికి ఇంత పెట్టలేకపోయాయి. తరచుగా రామనర్సయ్యతో జగడం పెట్టుకునేది. పని చెయ్యమని పోరు పెట్టేది. రామనర్సయ్య మరింత తత్త్వంలోకి వెళ్లాడు. మరిన్ని తత్త్వాలు నేర్చుకున్నాడు.

**"ఇట్లయితె ఇల్లెట్ల ఎల్లుతదయ్య. సంటిపోరడేం గావాలె. చేసి చేసి రెక్కలు పోతున్నాయి. సంసారం పాడుగాను చావు దగ్గరికి రావట్టె. జీతమన్నా ఉండు. పనికన్న పో"** అని కొట్లాట పెట్టుకునేది చంద్రవ్వ.

రామనర్సయ్య ఎదిరించేవాడు కాదు. సర్ది చెప్పితే సంసారం సర్దుకోలేదు. తన తత్త్వాలు మానుకోలేదు. నిదుర పట్టకపోతే ఏక్‌తారతో ఊరిమీద పడేటోడు. బజార్లు తిరిగేటోడు.

**"చెప్పలేదంటనకపొయ్యేరు. నరులార మీరు చేరి మొక్కితె బతుకనేర్చేరు"** పాటలోనే ఊరట పొందేవాడు. ఇళ్లల్లోకి వెళ్ళి అడగటం ఇష్టముండేది కాదు. పరిస్థితి గమనించి ఎవరైనా ఏమైనా పెడితే తీసుకునేవాడు. తొలుత కొందరు ఏదో కొంత ధాన్యం పెట్టినా రోజూ పెట్టలేకపొయ్యేవారు. కొందరు సోమరిపోతన్నారు. బద్ధకస్థుడన్నారు మరికొందరు. పనికిరాదన్నారు. చాతకాదని చులకన చేసేవారు. అయినా కొంచపడేవాడు కాదు. కోపపడేవాడు కాదు. బాధొచ్చినా తత్త్వమే. కోపమొచ్చినా తత్త్వమే. ఆ ఆడలో కాస్త చదువు నేర్చింది రామనర్సయ్యొక్కడే.

**"ఏ కులమని నను వివరమడిగితే ఏమని చెప్పదు లోకులకు పలు కాకులకు"** ఆకర్షణీయంగా అర్థవంతంగా పాడేవాడు. అది ఆయనను ఆదుకోలేదు. చంద్రవ్వ మనసులో కలత పోకపోయినా కడుపులో మరో నలుసు పడింది. చంద్రవ్వ కడుపుతో పనికి వెళ్లలేక పోయింది. సంసారం ఎల్లకపోయింది. తను గట్టిగా అరిచేది. తగువు పెట్టుకున్నది. వాదంతా పాకింది. భరించటం కష్టంగా తోచింది రామనర్సయ్యకు.

**"దాటరా మాయను దాటరా / ఈ కర్మ బంధము దాటరా / మాయను దాటరా, మాట మనకు కన్నతల్లి కన్నతల్లి / దాటనివ్వదు మనోకాంత / సందు జేసుక మనోకింతకు బంధమేసి అల్లవాకిలి దాటరా"** చింత చెట్టుకింద కూచుని రాత్రంతా పాడుకున్నాడు. రాత్రికి రాత్రే మాయను దాటాడు. సందు జేసుకొని చంద్రవ్వకు చెప్పా పెట్టకుండా ఊరు దాటాడు రామనర్సయ్య.

చంద్రవ్వ ఒంటరైంది. ఎదురు చూసింది. ఏడ్చింది, వెదికి చూసింది. ఊరూ వాడా కోడై కూసింది. చంటి పిల్లవాడు మీదపడి బుక్కపెట్టమని చంద్రవ్వను లాగుతున్నాడు. తేరుకొని పిల్లలకు తినిపించింది. తానూ ఇంత చల్లబడ్డది. దూరమైన పెనిమిటి తిరిగివచ్చే రోజును మించిన పండుగేముంటుంది?

సాయంత్రానికి రామనర్సయ్య చేరుకున్నాడు. కాషాయవస్త్రాలు, సాధువేషం. చేతిలో ఏక్‌తార. పక్కన మరో ఆడమనిషి.

చంద్రవ్వకు మనసులోపల కష్టం కలిగింది. మనిషి వచ్చిన సంతోషం మరునిమిషంలో మాయమైంది. జగడం పెట్టుకోనని మాటిచ్చింది గనుక కార్డులో రాయించింది గనుక మనసు అదిమి పట్టుకున్నది. బయటపడకుండా ఇద్దరికీ కాళ్లకు నీళ్లిచ్చింది. పాతదు:ఖం, కొత్తదు:ఖం కలిపి మీదపడి ఏడ్చింది. పిల్లల్ని ఆయనమీద పడేసి ఏడ్చింది. రామనర్సయ్య వాళ్లను దగ్గరకు తీసుకున్నాడు. కండ్లనీళ్లు తుడిచాడు. కొత్తమనిషి ముభావంగా చూస్తూ ఉండిపోయింది.

ఒకరోజు గడిచింది. వారం గడిచింది. నెల గడిచింది. కొత్త మనిషి పాతబడింది కానీ ఇల్లు విడిచి వెళ్ళలేదు. చంద్రవ్వ అడుగకముందే పక్క వాళ్లడిగారు. ఆమె లక్ష్మీబాయి. షోలాపూర్. ఆరు నెలలల నుంచి రామనర్సయ్య ఆమె ఆశ్రయంలోనే ఉన్నాడు. శిష్యురాలిగా గురువును అనుసరించి జీవిస్తున్నది.

చంద్రవ్వ నోరు విప్పొద్దని ఎంత అదుకుమున్నా విప్పక తప్పలేదు. వాళ్లిద్దరూ పని చెయ్యరు. ఏదీ సగవెట్టరు. తత్త్వాలు సరే. బోధలు సరే. తిండి తిండెట్లా... అప్పుడు ఒక్కదాని కష్టంతో సంసారమెల్లకనే గదా తగువు పెట్టుకున్నది. ఇప్పుడు అదనంగా మరొక మనిషి. ఎట్లా గడువాలి? ఉండబట్టలేక రామనర్సయ్యను అడిగింది. **"ఆమె కూడా మనలో మనిషి. మనతోనే ఉంటుంది. నేను ఉండాలంటే ఆమె ఉండాల"**న్నాడు. చంద్రవ్వకు కొత్త లంపటం, కొత్త భారం. ఏం చెయ్యాలో తోచలేదు. పొద్దున లేచింది మొదలు పనే పని. పటేండ్ల వాకిండ్లూడ్చేది. ఇంటిపని, తర్వాత వంటపని, తర్వాత కైకిలికి వెళ్లేది. రెక్కలు దాచుకోక దినం ఎంత పనిచేసినా సంసారం కష్టమైంది. రామనర్సయ్య మారలేదు. ఇది చేస్తాననలేదు. పనికిపోలేదు. అయినా పొమ్మనలేదు. మనిషికి మనిషే. ఒంటి బతుకు ఒక తిప్పలు. పెనిమిటి వచ్చాడనుకుంటే సమితితోని ఇదొక తిప్పలు. ఎటూ తేల్చుకోలేకపోయింది.

మెల్లమెల్లగా లక్ష్మీబాయికి ఇల్లుపని, పిల్లలపని అప్పగించింది. ఆమే అలవాటు చేసుకున్నది. ఆయనతోని అని లాభం లేదనుకొని తనతో ఆమెను వాకిలి పనులకు, కైకిలి పనులకు తీసుకెళ్లసాగింది. లక్ష్మీబాయి ఓపిగ్గా అన్నీ నేర్చుకున్నది. చెరోపని చేస్తుంటే సంసారం ఓ దారిన పడింది. ఆ ఒడబాటు ఎన్నోరోజులు నిలువలేదు.

లక్ష్మీబాయికి బరువు పనులు అలవాటులేదు. కాలు చేతులు నొప్పులు పెట్టాయి. నడుము నొప్పి వచ్చింది. నొప్పులు వంకతో

పని ఆపితే పటేండ్లు ఊరుకోరాయె. కైకిలికి వద్దనేవాళ్లు. చంద్రవ్వ కసురుకోవటం మొదలుపెట్టింది.

**"కూసుండబెట్టి సాదటానికి నువ్వెవతవే. నాయి మాత్రం రెక్కలు కాదా! నాకు నొప్పి పుట్టదా? నా సంసారం నాశనం చెయ్యటాని కొచ్చినావె? పో జెష్టముండా. పో"** తిట్టటం షురువు చేసింది చంద్రవ్వ. మొదట్లో మౌనంగా ఉన్నా లక్ష్మి తర్వాత తర్వాత ఎదురు తిట్లు నేర్చింది. రామనర్సయ్యకు చెప్పుకునేది. ఆయన ఎవరు చెప్పినా పట్టించుకునేవాడు కాదు. చక్కగా పాడుకునేవాడు.

**"జ్ఞానికెరుకా, సుజ్ఞానుల మరుగు జ్ఞానికెరుకా? అజ్ఞానికేమెరుక, హరుడుండె మరుగు – మొలక తామర పువ్వు మొగిలి తుమ్మెదకెరుక కవుసునీళ్ళతో ఉన్నా కప్పాకేమెరుక?"**

ఏక్‌తార మీటుతూ పాడుతుంటే పిల్లలు చుట్టూ చేరేవాళ్ళు. రాను రాను చంద్రవ్వకు, లక్ష్మీబాయికి తగువులు పెరిగిపోయాయి. వాడంతా వింతగా వినేవాళ్లు. కొందరికి అదో కాలక్షేపమై పోయింది. ఆరునెలలు దాటేసరికి ఆపలేని స్థాయికి చేరుకున్నాయి. చంద్రవ్వ ఓపిక నశించింది.

ఆరోజు బావి పని నుంచి వచ్చేసరికి కొడుకు ఏడుస్తున్నాడు. అడగగా అడగగా చెప్పాడు "చిన్ని వీపుల కొట్టింది" అంటూ ఏడుస్తూ ఎక్కెక్కి పడుతున్నాడు. చిన్ని మాట వినగానే చంద్రవ్వ కోసం నశాలానికంటింది. లక్ష్మి తల వెంట్రుకలు పట్టి లాగింది. వీపుల దబాదిబా కొట్టింది. లక్ష్మి ఎదురు తిరిగి చంద్రవ్వ వెంట్రుకలు పట్టింది. చూస్తుండగానే వాళ్ళ గాయి మిన్ను ముట్టింది. రాయనర్సయ్య చూస్తూ ఊరుకోలేకపోయాడు. అదుపు తప్పాడు. చెరొకటేసి విడిపించాడు.

ఇద్దరు ఏడుస్తున్నారు. పిల్లలు ఏడ్చి నిద్రపోయారు. ఎవరూ తినలేదు. ఎవరూ దీపం ముట్టించలేదు గుడిసె నిండా చీకటి నిండిపోయింది. రామనర్సయ్య ఎంత చెప్పినా మనసు వినలేదు. ఊరి శిష్యున్ని ఆదేశించి సారా తెప్పించుకున్నాడు. సేవించాడు. శిష్యున్ని తీసుకొని చింతచెట్టు వైపు నడిచాడు. ఏక్‌తార మోగుతున్నది చీకటిపూట.

**"సారగొని రుచిగానరమ్మా/ ఇల సాధులందరు ఈ సారమున కడతేరరమ్మా/ తత్వమనే బట్టిపెట్టి/ సంసారయోగమున సాధించి తెచ్చిన సారా యిది"** పాడుతూ పాడుతూ పద్యమందుకున్నాడు.

**"లక్షాధికారయిన లవణమన్నమె కాని మెరుగు బంగారంబు మింగబోడు"**

**"చెప్పులోని రాయి, చెవిలోని జోరీగ, ఇంటిలోని పోరు ఇంతింత గాదయా"** అట్లా ఎంతరాత్రి దాకా పాడాడో గాని రామనర్సయ్య మళ్ళీ జాడలేదు.

వాడంతా వ్యవహారం తెలిసింది. ఊరంతా వెటకారం చేసింది. ఆవేశం చల్లారిన తర్వాత చంద్రవ్వకు, లక్ష్మీబాయికి మమకారం ఏర్పడింది. జరిగిన దానికి చింతించారు. జగడం వద్దనుకున్నారు. పనికయినా, పంచుకోవడానికైనా ఒకరికొకరు తోడనుకున్నారు. అక్కాచెల్లెండ్లయిపోయారు. పిల్లల్లోనే మురిపెం పెంచుకున్నారు రామనర్సయ్య ఆచూకీ కోసం ఆపసోపాలు పడుతూనే ఉన్నారు. ఆరా తీస్తూనే ఉన్నారు.

ఏడాది దాటేసరికి రామనరసయ్య జాడ కనిపెట్టారు. కార్డులు రాశారు. కబురు పెట్టారు. కలిసి మాటిచ్చారు.


## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం

ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## సాధన పంచకమ్

**సంగః సత్సు విధీయతాం భగవతో భక్తిర్ దృఢాఽఽధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాఽఽశు సంత్యజ్యతామ్**
**సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్.**

తాత్పర్యం : 1. సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొనవలెను. 2. దృఢమైన భగవద్భక్తిని కలిగి ఉండవలెను. 3. శాంతి మొదలైన సద్గుణములను తెలిసికొని ఆచరించవలెను. 4. వదలని కర్మబంధనము (కామ్యకర్మలు) వెంటనే వదిలిపెట్ట బడు గాక! 5. సద్గురువును ఆశ్రయించవలెను. 6. ప్రతిదినము గురుదేవుని పాదుకలను సేవించవలెను. 7. అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. 8. వేదములకు శిరస్సుల వంటి ఉపనిషత్తుల వాక్యములను శ్రవణము చేయవలెను.

**వివరణ**

**8. శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్ -**

శ్రుతి అంటే వేదం. శిరస్సు అంటే తల. శ్రుతిశిరస్ అంటే - వేదానికి శిరస్సు వంటివి ఉపనిషత్తులు లేక వేదాంతము అని తాత్పర్యం. వేదాంత వాక్యాలను చక్కగా శ్రవణం చేయాలి. జ్ఞానానికి శ్రవణమే ప్రధానమైన సాధన. **"మృత్యుం శ్రుతి పరాయణాః"** (13-25) శ్రవణ పరాయణులైన వారలు మృత్యువు నుండి లేక మృత్యురూప సంసారసాగరము నుండి నిస్సందేహముగా తరించెదరు అని కదా గీతావచనం. కావున అర్హత, నమ్రత కలిగినటువంటి సాధకుడు సద్గురువు వద్ద వేదాంత వాక్యములను శ్రద్ధగా శ్రవణం చేయవలెను.

## సత్సంగం





**ఆత్మజ్ఞానం**

ఆత్మజ్ఞానం మృత మనస్సుకే కలుగుతుంది. అంటే ఏ భావాలూ లేక, అంతర్ముఖమైన మనస్సుకేనన్న మాట. అప్పుడు మనస్సు తన మూలాన్నే తెలుసుకునే, అదే (అంటే ఆత్మే) అయిపోతుంది. ఒకరు వేరొక పదార్థాన్ని చూచినట్టు కాదది. గది చీకటిగా ఉన్నప్పుడు అందులోని వాటిని కళ్ళు చూచి గ్రహించాలంటే దీపం అవసరం. కాని సూర్యుడు ఉదయించిన తర్వాత వాటిని చూడటానికి దీపం అవసరం లేదు. సూర్యుణ్ణి చూడటానికి కూడా దీపం అక్కర్లేదు. నువ్వు స్వయంప్రకాశమైన సూర్యుని వైపు ముఖం త్రిప్పితే చాలు. మనస్సు విషయం కూడా అంతే. వస్తువులను చూటానికి పరివర్తితమైన మనస్సు యొక్క కాంతి అవసరం. హృదయాన్ని చూడాలంటే మనస్సు అంతర్ముఖమైతే చాలు. అప్పుడు మనస్సు, హృదయంలోకి మాయమై ప్రకాశిస్తుంది. మనస్సుకి ముఖ్య లక్షణం చైతన్యం లేక ఎరుక. కాని అహంకారం దానిపై ఆధిపత్యాన్ని పొందినప్పుడు అదే బుద్ధిగా, ఆలోచనగా, ఇంద్రియ జ్ఞానంగా పనిచేస్తుంది. విశ్వమయమైన చిత్తానికి అహంకారం విధించే పరిమితులుండవు. దానికి తన నుంచి భిన్నమైనదేదీ ఉండదు. అందువల్ల దానికి ఉండేదల్లా కేవలం ఎరుకే. బైబిల్‌లో "నేనున్నాను నేనదే" అనే వాక్యానికి అర్థమిదే.

మనస్సు తన ఆత్మ అనే శుద్ధ చైతన్యంలో దగ్ధమై పోయినప్పుడు అన్ని శక్తులూ మాయమై పోతాయి. అంటే మక్కువ కలిగించే శక్తి, పని చేయించేది, తెలుసుకునే శక్తి వంటి వన్నీను. ఇవన్నీ వ్యక్తిగత చైతన్యంలో ఉదయించే అభూత కల్పనలని ఎరిగి, మాయమవుతాయి. ఆలోచిస్తూ, మరచిపోతూ ఉండే అపరిశుద్ధ మనస్సే సంసారమంటే. అదే జనన మరణాల పరిభ్రమణం. ఈ ఆలోచించటం, మరచిపోవటం వంటి కలాపాలన్నీ నాశనమై పోతాయి. అసలైన "నేను"లో - అదే శుద్ధమైన విముక్తి. అందులో ప్రమాదం లేదు. (ఆత్మని మరచిపోవటం అంటూ ఏమీ లేదు). ప్రమాదమే జనన మరణాలకు కారణం.

సాక్షాత్కారం : మంట నుంచి నిప్పుకణం లేచినట్లు ఆత్మ నుంచి అహంకారం లేస్తుంది. లేవగానే దేనితోనో తాదాత్మ్యం చెందుతుంది. అజ్ఞానిలో అట్లా దేనితోనైనా ఐక్యత చెందకుండా అది మనలేదు. ఈ ఐక్యతే అజ్ఞానం. దానిని నాశనం చేయటమే మన లక్ష్యం. అట్లా దేనితోనైనా ఐక్యత చెందే దాని ప్రవృత్తిని నాశనం చేస్తే అది శుద్ధంగా ఉండటమే కాక, తన మూలంలో నిమగ్నమయిపోతుంది కూడా. శరీరంతో తప్పుగా ఐక్యతని చెందటాన్ని దేహాత్మబుద్ధి అంటారు. ఇది పోతేనే గాని సత్ఫలితాలు రావు. ఎప్పుడూ రెండు ఆలోచనలకి నడుమ గల వ్యవధిలో "నేను" అనేది శుద్ధరూపంలో అనుభవ సిద్ధమవుతుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక   సంపుటి -25 : సంచిక - 5

UGC Care List Approved Journals
హైదరాబాద్   మార్చి : 2022

## అనుముల కృష్ణమూర్తి పద్యఖండిక 'నా మనసాయెనే'

# అర్థ శిల్ప రామణీయకత

**డా. గంద్ర లక్ష్మణ రావు,** సాహితీవేత్త ఫోన్ : 9849328036

సరస్వతీ సాక్షాత్కారముతో సుప్రసిద్ధులు, సరస్వతీ సాక్షాత్కారము పొందిన కవీశ్వరులు శ్రీ అనుముల కృష్ణమూర్తిగారు. కాళోజీ, వానమామలై సోదరులు, పల్లా దుర్గయ్య, బి.రామరాజు వంటి అనేకమంది పండిత కవులకు నిలయమైన మడికొండలోనే వీరు జన్మించారు. సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు. పద్యాన్ని అందంగా మధురంగా చదివేవారు. జువ్వాడిగౌతమరావుగారు వీరు మంచి సన్నిహితులు. శబరి వంటి కావ్యాలు రాశారు. అయితే ఎంత ప్రతిభావంతులో ఎంత కవితా శక్తిమంతులో అంతగా వాటిని దాచిపెట్టుకుందామని, రాసిపెట్టుకుందామని శ్రద్ధలేనివారు. వారి కూతురు సరస్వతిగారు, వారి మిత్రులు నాగిళ్ళ రామశాస్త్రిగారు అనేకం సేకరించి ఒక సంకలనంగా ముద్రించారు. అంతకుముందు యువభారతి వారిచేత సరస్వతీ సాక్షాత్కారము ముద్రింపబడి ప్రఖ్యాతి పొందింది. కృష్ణమూర్తిగారి ఖండికలలో **నా మనసాయెనే** అనే ఖండిక ఒకటి.

ఈ ఖండికలో పదకొండు పద్యాలున్నాయి. కృష్ణమూర్తిగారి పద్యాలు ఆశువుగా చెప్పినట్లు, అలవోకగా మాట్లాడినట్లు సాగిపోతాయి. నిజానికి ఆయనకు ఆ సందర్భమో, సమయమో, అనుభవమో కలిగినప్పుడు లేదా ఎవరైనా మిత్రులు కదిలించినప్పుడు ఆశుధారగా పద్యాలు చెపుతుండేవారు. అవి మాట్లాడుకున్నంత తేలికగాను అందమైన ఛందోబంధంగాను ఇమిడిపోయేవి. పద్యాలుగా కాక గేయాలుగా అచ్చువేస్తే అవి గేయాలే అనుకునే విధంగా కూడా ఉంటాయి.

కృష్ణమూర్తిగారు 1960 ప్రాంతాలనుండి ఖండికలు రాశారు. అప్పటికే తెలుగులో గేయకవిత్వం బలంగా కాలూనింది. పద్యాలలో మహాకావ్యాలకన్నా ఖండకావ్యాలకే ప్రాచుర్యం వచ్చింది. భావకవిత్వం రాజ్యం చేసి అభ్యుదయ కవిత్వానికి అవకాశమిచ్చింది. ఈ కాలంలో వస్తు రూపాలలో ప్రయోగాల దశ కూడా సాగింది. వచన కవిత్వం కూడా ప్రచారంలోకి వచ్చింది. ఈ దశలో ప్రాచీన సాహిత్యాన్ని కావ్య ప్రబంధాలను అధ్యయనం చేసిన పండితకవులు, కేవలం ఆధునిక వస్తురూపాలమీద అభిమానం చేత రాసిన కవులు రెండువిధాలుగా ఉన్నారు. ఆ విభాగం ఇప్పుడు కూడా ఉంది. కాని మొదటి తరంలో మొదటివారు ఎక్కువ. ఇప్పటి తరంలో రెండవవారు ఎక్కువ అనవచ్చు.

జాతీయత, దేశీయత, భాషాభిమానం మొదలైనవి ఒక ఉద్యమంగా ప్రభావితం చేశాయి. ప్రకృతి భావుకత, సౌందర్య దృష్టి మరో విధంగా ప్రభావితం చేశాయి. కాగా అభ్యుదయం, సమసమాజం వంటివి కూడా ప్రచారం జరుగుతున్న రోజులు. వీటితో పాటు తెలంగాణ విమోచన, విశాలాంధ్ర అవతరణ వంటివి కూడా సమకాలికులను



ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంనుండి కృష్ణమూర్తి గారి పద్యఖండికను విశ్లేషించవచ్చు. ప్రత్యేకంగా ఈ ఒక్క ఖండిక **నా మనసాయెనే!** విలక్షణంగా కనిపిస్తుంది.

పదకొండు పద్యాలలో ప్రకృతి, మాధుర్యము, మార్దవము, మానవత్వము, దేశభక్తి, సమాజ హితం అనే అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. ప్రకృతి వర్ణన చేసిన సందర్భాలలో పక్షులు, కోకిలలు, పూవులు, తేనెలు ఇట్లాంటి సుందర దృశ్యాలను మనముందుంచారు. అయితే వాటిని వాటిగానే వర్ణించకుండా వాటితో తాను గొంతు కలపాలని, చేయి కలపాలని, మనసు నిలపాలని కోరుకుంటాడు. అంటే మనిషి ఎంత సహజంగా ప్రకృతికి అనుకూలంగా ఉండాలో ఉంటే ఎంతో ఆనందమో ఆయన పద్యాలలో తెలుపుతూ మనలనూ ఆ ఆనంద లోకాలకు తీసుకెళతాడు. వసంతం, శరత్తు వంటి వాటి ప్రస్తావనలున్నాయి. ఋతువులను ఆదికవి వాల్మీకినుండి నేటి తెలుగు కవులదాకా వర్ణించకుండా ప్రస్తావించకుండా ఉన్నవారు లేరనవచ్చు. కాని కృష్ణమూర్తి వర్ణన విలక్షణం.

వసంతంలోని పికాళితో కలిపి కూయాలని నా మనసాయెనే అంటారు. పద్యం ఎత్తుగడను చివరికి అన్వయం చేసుకోవాలి. కాని

మనసుపడిన విషయం యొక్క గాఢత కోసం మొదటే ఆ పదాన్ని ప్రయోగించారు. ఇది కవితా శిల్పం పద్యశిల్పం.

**నా మనసాయెనే! తెలుగునాట పసందు రసాల తోపులన్**
**మామిడి పూతగుత్తులను మత్తిలి యొత్తుగ వీచు పిల్ల విం**
**జామర కైపుటూయలల సంబరముల్ వడబోసి తెచ్చు ఈ**
**యామని యావహించు సమయాల పికాళి గళాల పాడగన్**

ఒక మూడు పద్యాలలో అచ్చంగా తెలుగు గ్రామీణ జీవితాన్ని చెప్పారు. వర్ణించారని అనలేదు. ఎందుకనగా ఇక్కడ పల్లె అందం రూపు రేఖల వర్ణన లేదు. పల్లె జనుల మనస్తత్వాలు జీవన శైలిలోని ఆంతర్యాన్ని మాత్రమే చెప్పారు. ఇది ప్రత్యేకంగా గమనించదగ్గ అంశం.

గ్రామీణ ప్రజలలో నమ్మకం చేబదులుగా దొరుకుతుందంటారు కవి. జీవితాలమీద నమ్మకముండడమే గొప్ప విషయం కాగా అది చేబదులుగా దొరుకుతుందట. అంటే పల్లె ప్రజలు దాన్ని అమ్మరు, వ్యాపారం చేయరు, వాళ్ళను చూస్తే తెలుస్తుంది అని చెప్పడం. అంతేకాదు బలువైన మక్కువల్ పల్లెలో దొరుకుతాయంటారు. అక్కడి వారు పరంధాములుగా బతుకుతున్నారు అంటారు. అంటే ఊరే వైకుంఠంగా బ్రతుకు గడుపుతున్నారు అని. పల్లె ప్రజల ఆత్మ విశ్వాసము, సంతృప్త జీవనము చూసి నేర్చుకోవాలని. నిజానికి వారికి ఎన్నో కష్టాలు, అసౌకర్యాలు ఉంటాయి. వాటిని చెప్పకుండానే వాటి మధ్యకూడా వారి మానసిక స్థితిని వ్యక్తం చేశారు. అదీ ఆశాజనకంగా, ఆదర్శంగా.

వారి ఎద పునాదులు భాగవత మార్దవములు అంటారు. ఇక్కడ భాగవతులు అంటే భక్తిపరులు అని. భాగవతం వెలసింది బమ్మెర పల్లెటూరే. అందులోని పద్యాలు వాటి అర్థాలు కొందరికి వచ్చీ, కొందరికి రాకా అర్థం మాత్రం ఒంటబట్టిన జీవనం కనపడుతుంది. అందుకే వారి బ్రతుకులో కమ్మదనాలు కూర్చె అంటారు. ఈ కమ్మదనం భౌతికంగా ఉన్న సుఖాలు, సంపదలు కాదు, ఇది ఒక సాంస్కృతిక జీవన శైలి. ఇదొక సంతృప్త మధుర జీవన విధానం.

కవి అమ్మ పలుకు వినాలని, అమ్మ కంటివెలుగులో ఉందామని, ఆ తల్లి నివసించిన చోట ఉందామని అంటారు. ఈ అమ్మ అంటే **'నా సమస్త బహుధా రమణీయ భావనారామ రమామతల్లి'** అంటారు. రమణీయ భావనామతల్లి సరస్వతి, రమణీయ భావనామతల్లి ఊరు, దేశం. ఎందుకంటే కవి భావనా సమస్తములు వీటిచుట్టే అల్లుకున్నాయి.

కొన్ని పద్యాలు సమాజంలో శాంతియుత జీవనాన్ని ఆకాంక్షిస్తాయి. ఇంతవరకు ఉన్న ఒక సంస్కృతిని మన కళ్ళముందుంచారు.

**నా మనసాయెనే! విషపు నాగుల కోరలు దీసి యాడుకుం**
**దామని - పాలుగారు సరదారులు దూకుచు చిందులాడ కం**
**దామని - కోరలూడి పసితామర కాడల రీతి పారి పో**
**దామని కాళ్ళలో సతమతమ్మగు నాగుల ఆగమున్ గనన్**

కాని ప్రస్తుతం సమాజం అట్లా లేదని కొన్ని విషనాగులు తిరుగుతున్నాయని, వాటి కోరలు తీయాలని, పాలుగారు సరదారులు అంటే పసిపిల్లల ఆడుతుంటే చూడాలని , ఇట్లా.... తెలుగు ప్రజలు నిజం మాట్లాడేలా చేయాలని, గుండెల్లోని పరదాలను తొలగించుకోవాలని, ప్రేమ లోతులను తవ్వుకోవాలని, మంచితనం ఉండలు చేసి పంచాలని హితవు కొరారు.

ఇక్కడ కూడా ఎక్కడా వర్గభేదం, కులభేదం వంటి మాటలు లేవు. సమసమాజం వంటి నినాదం లేదు. కాని ఈనాటి సమాజానికి అది రావాలనే ఆశంస ఉంది. అది హింసతో గాని, ప్రతీకారంతో కాని, పగతో కాని కాదు. కేవలం మంచితనంతో, నిష్కల్మషత్వంతో, నిజాయితీతో సాధించాలని ఆయన ఆకాంక్ష. అందుకే మనుషులు కూర్మి లోతులు తవ్వుకోవాలని చెపుతాడు. ఎక్కడ ప్రేమగా ఉంటారో అక్కడ ద్వేషం వైరం ఉండదు. ఉపవనాలలో ఆడుకునే పిల్లల వలె, దువ్వెనల (సీతాకోక చిలుకల) వలె హాయిగా స్వేచ్ఛగా ఉండాలని వాటితో తానుండాలని నా మనసాయెనే అంటారు,

**నా మనసాయెనే తొలిదినాల సుఖాలు మదిన్ కెలంకగా**
**మోములు వాచినట్టి జనమున్ కరుణింపగ వచ్చు ఈ శరత్**
**స్వామికి స్వాగతాంజలిని పాడగ, హాయిగ ఊపిరాడ బా**
**ధామయ జీవితార్తి పరితాప సమాప్తికి నాంది పాడగన్**

జనుల బాధామయ జీవితార్తికి పరిసమాప్తిని పాడాలని ప్రగాఢంగా కోరుకున్నారు.

జనగణాల అధినాయకత్వం గల ఈ పుణ్యభూమిపైనే మళ్ళీ పుట్టాలని నా మనసాయెనే! అంటారు.

దేశం మీద, గ్రామం మీద, పురాసంస్కృతి మీద, ప్రేమ మంచితనం మీద, మానవత్వం మీద అపారమైన విశ్వాసాన్ని ప్రకటిస్తూ వాటితో కలిసిపోవాలని నా మనసాయెనే! అని తన ఆంతర్యాన్ని ప్రజల ఆంతర్యంతో ముడివేసి పాడిన పద్యఖండిక నామనసాయెనే!

భావుకతలో ఒక్కొక్కసారి భావకవులను తలపిస్తారు. తెలుగునాట **"పసందు రసాల తోపులన్ మామిడి పూత గుత్తులను మత్తిలి యొత్తుగ వీచు పిల్ల వింజామర కైపు టూయలల సంబరముల్ వడబోసి తెచ్చు ఈ ఆమని"** అంటారు. మామిడి పూతలనుండి వచ్చే ఒత్తయిన వాసన పిల్ల వింజామరల కైపుకు ఊగే ఊయలలు, ఇక్కడ మామిడి పూత ఒత్తుగా ఉంది, వాటి వాసన గాఢంగా ఉంది, ఆ వాసనతో మత్తెక్కించే పిల్ల వింజామర వీస్తున్నది, ఆ ఊపులో ఊయలలూగుట....

ఇంతవరకు ప్రబంధ కవులవలె అనిపిస్తుంది, ఈ ఊయల ఊపులో సంబరముల్ వడబోసి తెచ్చి అనేది భావుకత, ఇంకా ఆ సంబరం ఆవహించిన పికసమూహాలు పాడుతుండగా వాటితో కలిసి పాడగా నా మనసాయెనే అంటారు.

పద్యరచనలో ప్రతి పదం కోమలంగా మృదువుగా ఉంటుంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2022

ఎక్కడా పరుషంగా వాడిన పదాలుండవు. సంస్కృత సమాసాలున్నా అవి కూడా మధురంగా సుకుమారంగా ఉన్నవే ఉన్నాయి. పద్యాలు వెన్నెల తీగలు సాగినట్లుగా, వెన్న మీగడ పంచినట్లుగా ఉంటాయి. అంతే కాదు. అవి ఎక్కడా తడబడవు. ఒక సుధాధారగా సాగిపోతాయి. ఈ పద్యనిర్మాణం ఆయన ప్రత్యేకం.

నా మనసాయెనే! అని పదకొండు పద్యాలు ఒకే ఎత్తుగడతో మొదలుపెట్టారు. ప్రతి పద్యం తప్పనిసరి ఉత్పలమాలయే కావాలి. ప్రతి పద్యం మొదటిపాదంలో యతి న కారమే ఉండాలి. ఇట్లాంటివి ఏమాత్రం క్లిష్టం కాకపోగా అవి మరింత సొగసుగా సాగిపోవడం చదువరులకు ఆనందాన్ని కలుగజేస్తాయి.

నా మనసాయెనే అనేది ఒక కీర్తన ఎత్తుగడ వలె ఒక పాట వలె ఉంటుంది. అట్లాంటి పదం ఒక ఉత్పలఛందానికి ఒదిగించి అలాగే కొనసాగించడం ఆశుకవితా ప్రవాహం వలె, గేయగానం వలె అనిపిస్తాయి.

దీర్ఘాక్షరంతో ప్రారంభమైన పద్యం గురువులు రావలసినచోట్ల దీర్ఘాక్షరాలే వాడటం వలన పద్యం ఒక రాగం సాగదీసినట్లుగా సాగిపోతుంది. "ఉదా : ఆమని యావహించు సమయాల పికాళి గళాల పాడగన్" ఈ పాదంలో ఆ, యాలు, పికాళిలో ఆ గళాలలో ఆ, పా లో ఆ అన్నీ దీర్ఘాక్షరాలే. **"పాలుగారు సరదారులు దూకుచు"**, **'తొలిదినాల సుఖాలు'**, వంటివి పద్యపాదాలకు కొత్త నడకలు నేర్పాయి. గురువులుగా ఛందస్సుకోసం బిందుపూర్వకాలుగాని, ద్విత్వ సంయుక్త పూర్వకాలుగాని వాడుకోవచ్చు, కాని ఈ నాదమాధుర్యం రాదు. అట్లే 'అమ్మ పల్కు విందామని, కాంతి కందామని, యాడు కుందామని, పారిపోదామని, నిద్దామని, చూద్దామని, పెళ్ళగిద్దామని', ఇట్లాంటి పదాలన్నీ పాదాల మొదట మ కార ప్రాసతో కలిపి వాడటం వలన అక్కడ ఒక తాళం పడినట్లుగా అనిపిస్తుంది. పద్యానికి ఒక లయ ఒక గతి ఏర్పడుతుంది. ఇది పద్యనిర్మాణ శిల్పం వైశిష్ట్యం.

పద్యాలలోని అర్థాలంకారాలు, శబ్దాలంకారాలు కూడా ఆ పద్యాలకు వన్నె చేకూర్చాయి. ముందు చెప్పినట్లుగా ఆయన పండిత కవి కనుక అలంకార ప్రయోగం కూడా అంత సహజంగా వాడారు. **'గుత్తులు మత్తిలి యొత్తుగ,', 'గుండె గుండె తొంగి తొంగి, కూర్మి కూర్మొని,'** గణమ్ము మనమ్మధినాయకమ్ముగా వంటి అనుప్రాసల ప్రయోగాలు కూడా శబ్ద సౌందర్యాన్ని కలిగిస్తున్న అలంకారాలు.

నా మనసాయెనే అనే వైయక్తిక ప్రయోగం కూడా ఆత్మాశ్రయ ధోరణిలో సాగి ప్రతి పాఠకుడు తనమనసే అట్లా కోరుతున్నదా అనే అనుభూతి కలిగిస్తుంది. ఆయెరా అనకుండా ఆయెనే అనటంలో కూడా ఆత్మీయత కనబడుతుంది.

ఈ పద్యాలలో కొన్ని కొత్త పదాలు, పదబంధాలు ప్రయోగించారు. ఉదా : పూత గుత్తులు, పూగుత్తులు, పూల గుత్తులు అనేది సాధారణ ప్రయోగం. కాని పూత గుత్తులు సాభిప్రాయంగా వాడారు. మామిడి పూత అంటాం కాని పూలు అనం, అందుకే పూత గుత్తులు అన్నారు. పిల్ల వింజామరలు పిల్ల గాలులు అంటారు కాని వింజామరలు అనడం, గుండె పరదాలు, పువు మెత్తనివి, కూర్మి లోతులు, మంచి తనం ఉండలు ఉండలుగా పంచటం, ఇట్లాంటివి ఆయన సాధు సాభిప్రాయ ప్రయోగాలకు నిదర్శనం.

అనుముల కృష్ణమూర్తిగారి ఈ చిన్న పద్యఖండికలో భాషా, పద్య ప్రయోగాలు, భావన, హితకామన వంటి అర్థ ప్రయోగాలు నిండి ఉన్న ఖండిక. ఇది చదివితే ఎవరికైనా నా మనసాయెనే! అనిపించక మానదు.




# శిలాక్షరం

**(బి.ఎన్. శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**

# వాగ్దేవతా!!!

శ్రీవాణీ! వరదాయినీ! సుపదినీ! శ్రేయస్కరీ! భారతీ!
కైవల్యామృత బిందుకోటి లహరీ! గైర్వాణ సంపూజితా!
శ్రీవాత్సల్య సుధారసాబ్ధి వగుచున్ శీఘ్రమ్ము నన్ బ్రోవుమా!
నీవా వాహనమైన సాగు రచనల్ నిత్యమ్ము వాగ్దేవతా!!

వరవీణన్ కరమందు దాల్చి సిరియౌ వర్ణంపు తంత్రావళిన్
ధర మీటంగను నిల్పినావు పదమై, ధన్యత్వమౌ శిల్పమై,
స్వర వాక్యమ్మయి, పారిపద్య సుధయై, సాహిత్య వాక్స్వాదువై
వర కావ్యాళిగ ధారలొల్క వసుధన్ వర్ధిల్ల వాగ్దేవతా!!

శిరమున్ పద్మము జేతు నీ పదమునన్ చిచ్ఛక్తి సంధాత్రి! నా
యురమున్ వీణగ మీటి, మేటి రసనాదోత్ఫుల్లముంజేతు!నే
నరయన్ నా యెదలోన నీవు గలవో యానంద చిద్రూపిణీ!
విరులౌ పద్యసుమాళి గూర్చి మెడలో విప్పార్తు వాగ్దేవతా!!

కవినై, భారతి హాస భాస సుమమై, కావ్యేతిహాసమ్మునై
రవినై, విస్తృత దీపకాంతి తతినై, రంజిల్లు సచ్ఛీలునై
కవనమ్మందున సత్కవీంద్రు కలమై, కావ్యాత్మకానందమై,
ఛవినై గౌరవమందనిమ్ము! వరమై చైతన్య వాగ్దేవతా!!

ఏ తీవన్ కొనగోట మీటెదవొ? నా యీ జన్మ తంత్రావళి
న్నేతీరౌ వరమిచ్చి నిల్పెదవొ? నన్నే పీఠమెక్కింతివో?
యే తీరమ్మున జీవనమ్ము నిలుపన్నే భాగ్యమెట్లున్నదో?
యే తీరైనను నీవె నాకు వెలుగౌ నీ ధాత్రి వాగ్దేవతా!!



**అవుసుల భానుప్రకాశ్**
పద్య సారస్వత పీఠం, తెలంగాణ,
ఫోన్ : 96032 04507

# వస్త్రాస్త్రం??

మానవత్వం మరణిస్తుంది
మతవాదం పెచ్చురిల్లుతుంది
వేషధారణ కొరకు వేటమొదలైంది
అతివల పై వేటు పడుతుంది

నవ నిర్మాతలై తరాలు నిర్మించే
నాగరికుల భవిష్యత్ ఏంటో
అని భయం కలుగుతుంది

సర్వసమానత్వం బోధించే
సెక్యులర్ విశ్వవిద్యాలయాలలో
మనిషిని మనిషి చీలుచుకునే
జంగు సైరన్ మోగించిందెవ్వడు
ఈ విషవస్త్రాస్త్రం వికృత రూ(పా)పానికి
మూల విరాట్ ఎవ్వడు...?

సమత మమతల సారం ఒకవైపు
మతోన్మాదం మరోవైపు....
ఈ లౌకిక ప్రజాస్వామ్య దేశంలో
నాటికి నేటికి ఏనాటికి భాషావేషాన్ని,
సంస్కృతి, సంప్రదాయాలను
మార్చాలంటే దేశాన్ని
విభజన చేయడమే సరైన మార్గం

విభేదాలు సృష్టించి
ఆకలి తీర్చుకునే
రాజకీయాన్ని రద్దు చేయడమే ఉత్తమం
ఈ ఎన్నికల ఎత్తులను చిత్తు చేసి
సర్వమతాలను ఏకం చేయాలి

**సాహిత్యమణి**
ఫోన్ : 9704 118352

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2022

# భక్తిరసపోషణ – పోతనగారి పోషణ

**శ్రీమతి టి. శ్రీవల్లీ రాధిక,** ఫోన్ : 9441644644

తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకూ ఎక్కడయినా భక్తిరసము అన్న మాట కనిపిస్తే ఆ ప్రక్కనే పోతన గారి పేరు కనబడకుండా ఉండటం అరుదు. భక్తిరసమును గురించి వివరించే, ప్రస్తావించే వ్యాసాలకు సాధారణంగా పోతనభాగవతంలోని పద్యాలే ఆధారమవుతుంటాయి. ఒకవేళ అది ప్రత్యేకంగా ఒకానొక గ్రంథం లోని భక్తిరసపోషణ గురించి మాట్లాడుతున్న సందర్భమయినా సరే, అందులో కూడా ఉపోద్ఘాతంలోనో, ఉదాహరణలుగానో పోతనగారి పద్యాలు చోటుచేసుకుంటాయి.

భక్తిరసముతో పోతనగారి పద్యాలు ఇంతగా ముడిపడటానికి కారణాన్నీ, అందుకు పోతనగారు చూపిన నేర్పునీ భాగవతంలోని ఒక ప్రసిద్ధ పద్యం ద్వారా మరొకసారి చెప్పుకునే ప్రయత్నం ఈ వ్యాసంలో చేస్తున్నాను. 'మరొకసారి' అని ఎందుకు అంటున్నానంటే భక్తిరసపోషణలో పోతన గారి నేర్పును వివరించే వ్యాసాలూ, పరిశోధనా గ్రంథాలు కూడా ఇప్పటికే ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు గజేంద్రమోక్షం వంటి ఘట్టాలలో పోతనగారు పెంచి వ్రాసిన పద్యాలను గూర్చి, తద్వారా సాధించిన రసపుష్టిని గూర్చి పరిశోధకులు ప్రస్తావించి ఉన్నారు. అయినప్పటికీ మరొకసారి మరొక పద్యం ద్వారా భక్తిరస పోషణలో పోతనగారి నేర్పును చర్చించుకోవడమూ, మరికొన్ని కొత్త అంశాలను గమనించడమూ ఆసక్తికరమే కనుక ఈ వ్యాసంలో నేను ఆ ప్రయత్నం చేస్తున్నాను.

ఇక్కడ నేను తీసుకుంటున్న పద్యం భాగవతం ప్రథమ స్కంధము లోనిది. ముందుగా ఆ పద్యాన్ని పేర్కొంటాను.

**కుప్పించి యెగసినఁ గుండలంబుల కాంతి**
**గగనభాగం బెల్లఁ గప్పికొనఁగ**
**నుఱికిన నోర్వక యుదరంబులో నున్న**
**జగముల వ్రేఁగున జగతి గదలఁ**
**జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ**
**బైనున్న పచ్చనిపటము జాఱ**
**నమ్మితి నాలావు నగుఁబాటు సేయక**
**మన్నింపు మని క్రీడి మరలఁ దిగువఁ**
**గరికి లంఘించు సింహంబుకరణి మెఱసి**
**"నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు**
**విడువు మర్జున!" యనుచు మద్విశిఖ వృష్టిఁ**
**దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు.**

**(పోతన భాగవతం 1-223)**



పద్యాన్ని గురించిన చర్చలోకి వెళ్ళేముందు ఒక్క విషయం చెప్పుకోవాలి. పై పద్యం ఆధారంగా పోతనగారు భక్తిరసపోషణ ఎలా చేశారో పరిశీలిస్తున్నామన్నపుడు, **"రసం అనేది కావ్యం మొత్తానికి సంబంధించిన అంశం కదా, ఇలా ఒక్క పద్యం తీసుకుని రసచర్చ చేయడం సబబేనా?"** అన్న ప్రశ్న ఎదురయే అవకాశం ఉంది. అయితే రసమనేది కావ్యం మొత్తానికీ సంబంధించిన విషయమే అయినా, ఇలా ఒక్కొక్క పద్యంలో కవి పాటించిన మెలకువలనీ, అవి రసపోషణకి ఉపయోగపడిన విధానాన్నీ చర్చించుకోవడం అసంబద్ధం కాదు.

**"రససాధనకు నొక పెద్ద కావ్యము కావలెనని అర్థమా? కానక్కఱ లేదు. ఒక్క పద్యమునందే రసమంతయు ధ్వనించుచున్నచో నా యొక్క పద్యమే చాలును"** అని కూడా విశ్వనాథ సత్యనారాయణ గారి వంటి పెద్దలు చెప్పారు. భారతంలో శాంతం ప్రధానరసమెలా అయిందన్న విషయాన్ని విశ్వనాథ సత్యనారాయణగారు **"ఎడపక అర్ఘ్యమచ్యుతున కిచ్చితిమి"** అన్న నన్నయగారి పద్యం ఒక్కదానిని మాత్రమే తీసుకుని చర్చించడం కూడా 'కావ్యానందం'లో కనిపిస్తుంది. కనుక కావ్యంలోని కొన్ని పద్యాలను తీసుకుని రసనిర్వహణను పరిశీలించడం ద్వారా కావ్యం మొత్తంలో రసపోషణకు సంబంధించి కవి చూపిన ప్రజ్ఞను అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం అసంగతం కాదు.

ఇక ప్రస్తుత పద్యం విషయానికి వస్తే, ఈ పద్యంలోని ఘట్టం భారతంలో కూడా కనిపిస్తుంది. మహాభారత యుద్ధంలో భీష్ముని

విజృంభణ, దానికి పాండవసైన్యం తట్టుకోలేకపోవడం, అది చూసి యుద్ధంలో ఆయుధం పట్టనన్న శ్రీకృష్ణుడు రథం దిగి భీష్ముని పైకి వెళ్ళబోవడం, వద్దంటూ అర్జునుడు ప్రాధేయపడటం – ఈ సన్నివేశం భారతంలోని భీష్మపర్వంలో తిక్కనగారిచే రచింపబడింది. అయితే భారతంలోని పద్యాలలో రౌద్రరసం కనిపిస్తే, భాగవతంలోని పద్యాలలో భక్తి పొంగులెత్తుతుంటుంది. టి.టి.డి. వారు ప్రచురించిన ఆంధ్రమహాభారతంలో భీష్మపర్వానికి వ్రాసిన వ్యాఖ్యలో నండూరి రామకృష్ణమాచార్యులు కూడా పోతనగారి ఈ పద్యాన్ని ప్రస్తావించి, **"పోతన శైలి – భక్తిరస తుందిలం"** అంటారు. పీఠిక రచించిన జివిఎస్ భీష్మపర్వంలోని ఈ సన్నివేశంలో ఉన్న పద్యాన్ని రౌద్రరసానికి ఉదాహరణగా పేర్కొంటారు.

శ్రీకృష్ణుడు 'ఆయుధం పట్టను' అన్న తన మాటను పక్కన పెట్టి, చక్రాన్ని చేతబూని భీష్ముని పైకి వెళ్ళబోవడం అనే సన్నివేశం భారతంలో రెండుసార్లు కనిపిస్తుంది. మూడవనాటి యుద్ధంలో ఒకసారి, తొమ్మిదవనాటి యుద్ధంలో ఒకసారి. రెండు సన్నివేశాల లోనూ శ్రీకృష్ణునివర్ణన ఉన్న పద్యాలను మాత్రం తీసుకుని పోతనగారి పద్యంతో పోల్చి చూడటం ద్వారా రసపోషణలోని వ్యత్యాసాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయవచ్చు.

అయితే, ఈ పద్యం పోతనగారు క్రొత్తగా వ్రాసిన పద్యం కాదు. వ్యాసభాగవతం నుండి అనువదించిన పద్యం. కనుక ఈ పద్యంలోని భక్తిరసపోషణలో పోతనగారి పాత్ర ఎంత అని అర్థం చేసుకోవడానికి మూలంలోని శ్లోకాలను కూడా పరిశీలించవలసి ఉంటుంది.

మరొక విషయమేమిటంటే, వ్యాసభాగవతాన్ని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు శ్రీకృష్ణభాగవతం అన్న పేరుతో అనువదించారు. ఇక్కడ చెప్పుకుంటున్న వ్యాసుని శ్లోకాలు వారు చేసిన అనువాదంలో కూడా ఒక సీసపద్యమూ, తేటగీతిగా మారాయి. శాస్త్రిగారు మూలంలోని భావాన్ని సూటిగా అనువదించారు కనుక పోతన ప్రత్యేకతను అర్థం చేసుకోవడానికి ఆ పద్యంతో కూడా పోల్చిచూడవచ్చు.

ఇప్పుడు చెప్పుకున్న మూడు రచనలనూ వరుసగా దిగువ పేర్కొంటున్నాను.

**తిక్కనగారి ఆంధ్రమహాభారతం**

**మొదటి సన్నివేశంలో కృష్ణుని వర్ణించే పద్యం**

**అంహోమర్దనుఁడా జనార్దనుఁడు మాద్యద్భీష్మకుంభీంద్రుపై**
**సింహోల్లాస విలాసియై కవియు నుత్సేకంబు నాటోపమున్**
**రంహఃస్ఫూర్తియు దీప్తమూర్తియును సంరంభంబుఁ జూడన్ జగ**
**త్సంహారోన్ముఖుఁడైన రుద్రుగతి రౌద్ర ప్రక్రియం బొల్చినన్**
**(భీష్మపర్వం 2.156)**

**రెండవ సన్నివేశంలో కృష్ణుని వర్ణించే పద్యం**

**ధరణీచక్రము గ్రక్కునం గదల దిగ్దంతావళశ్రేణి కం**
**ధరముల్ మ్రొగ్గఁబడన్ దిశావలయ ముత్కంపంబుగా నీ బలం**
**బురులం బాఱఁగ భీష్ముపైఁ గవిసె రౌద్రోద్రేకముం జూచి ఖే**
**చరలోకంబును సంచలింప హరి చంచద్బాహు ఘోరాకృతిన్**
**(భీష్మపర్వం 3.263)**

**వ్యాస భాగవతము**

**స్వనిగమమపహాయ మత్ప్రతిజ్ఞాం ఋతమధికర్తుమవప్లుతో రథస్థః**
**ధృతరథచరణోభ్యయాచ్చలద్గుర్హరిరివ హన్తుమిభం గతోత్తరీయః**
**(1-9-37)**

**శితివిశిఖ హతో విశీర్ణదంశః క్షతజపరిప్లుత ఆతతాయినో మే**
**ప్రసభమభిసార మద్వధార్థం స భవతు మే భగవాన్ గతిర్ముకుందః**
**(1-9-38)**

**శ్రీకృష్ణభాగవతం**

**"చక్రంబు చేబూనఁ సమరంబునందను**
**తన నియమంబెల్ల వెనుక ద్రోచి**
**చక్రంబు పట్టింతు శౌరిచేనను నాదు**
**బాస చెల్లించెదువాడ యగుచు**
**నాశరంబులనొచ్చి నలువతి మునికోల**
**రథముపైబెట్టి చక్రంబు వట్టి**
**కరిమీద బడదూకు హరివోలె నేలకు**
**నుతికి లంఘించి నాయున్న కడకు**
**గేశపాశము విడివ్రేల క్షితితలంబు**
**దద్దతిల్లగ బైకోక తావు వీడ**
**హుంకరించుచు నరుదెంచునంకకాదు**
**నాకు దిక్కయి యుండెడు గాక యిపుడు**
**(శ్రీకృష్ణభాగవతం 1-282)**

ఇపుడు ఈ నాలుగు గ్రంథాలలోని రచనను పోల్చి చూడటం ద్వారా పోతన భక్తిరసాన్ని నిర్వహించిన తీరును పరిశీలించాలను కుంటున్నాను.

**నేపథ్యం**

ఇక్కడ ఒక్క పద్యం గురించే ప్రధానంగా చెప్పుకుంటున్నా, రసం గురించి మాట్లాడుతున్నాం కాబట్టి ఆ పద్యం ఏ నేపథ్యంలో వచ్చింది, దానికి ముందు ఉన్న పద్యాలు ఏ విధంగా తీర్చిదిద్దబడ్డాయి అన్న విషయాలు చెప్పుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఈ ఘటన భారతంలో వర్తమానంలో జరుగుతున్న సంఘటనగా కనిపిస్తే, భాగవతంలో భీష్ముడు మరణసమయంలో చేసిన శ్రీకృష్ణ

స్మరణలో, స్తుతిలో భాగంగా కనిపిస్తుంది. నేపథ్యంలో ఉన్న ఈ భేదం రసానుభూతిలో కూడా మార్పు కలిగిస్తుందన్నది స్పష్టమే అయినా, మరికొంత సూక్ష్మంగా ఈ విషయాన్ని పరిశీలిద్దాం. భారతంలో ఈ ఘట్టం రెండుసార్లు వస్తుంది. రెండుసార్లూ సన్నివేశమంతా దాదాపుగా ఒకేరకంగా ఉంటుంది. మొదటి సన్నివేశంలో వచ్చే పద్యానికి ముందు **"గంగానందనుఁ గూల్చి, ద్రోణుపని సక్కంజేసి, కౌరవ్య వీరాంగమ్ముల్ నుఱుమాడి, తత్ప్రబల సైన్యంబెల్ల మాయించి, యిత్తుం గౌంతేయుల కిమ్మహీవలయమున్ దుర్దాంతచంచద్భుజా సంగస్ఫూర్జిత చక్ర విక్రమ కళా సంక్రీడనోన్మాదినై"** అనే కృష్ణుని పరుషపుపలుకులు, **"క్రోధరంజిత భయంకరాననం నుంచి ధ్వనించే సింహనాదం"** ఉంటాయి. రెండవ సన్నివేశంలో వచ్చే పద్యానికి ముందు కృష్ణుడు **"దారుణమైన రోషంతో, సహనాన్ని వదిలేసి, మునికోల తీసుకుని క్రూరతతో"** భూమిమీదకు ఉఱికాడన్న వర్ణన ఉంటుంది.

అందుకు భిన్నంగా భాగవతంలో వచ్చే పద్యానికి ముందు భీష్ముడు భక్తితో పలికే అనురాగపూరితమైన పద్యాలు నాలుగు ఉంటాయి. శ్రీకృష్ణుని మనోహరమూర్తిని వర్ణించే **"త్రిజగన్మోహన నీలకాంతిఁ దనువుద్దీపింపఁ"** అన్నది మొదటి పద్యం. గుఱ్ఱాల కాలిగిట్టల వల్ల రేగిన ధూళితో దుమ్ముకొట్టుకుపోతున్నా, ముంగురులు చెదిరిపోతున్నా, అధికమైన రథ వేగానికి అలసట చెంది ఒళ్ళంతా చెమట్లు కారుతున్నా, ముచ్చటైన ముఖమంతా ఎఱ్ఱగా అవుతున్నా, భీష్ముని శస్త్రాస్త్రాలు తగిలి బాధిస్తున్నా లెక్క చెయ్యకుండా అర్జునుడికి విజయాన్ని చేకూర్చాలనే ఉత్సాహంతో అతనిని ప్రోత్సహిస్తూ యుద్ధం చేయిస్తున్న శ్రీకృష్ణుడిని వర్ణించే **"హయరింఖాముఖ ధూళి ధూసర పరిన్యస్తాలకోపేతమై"** అన్న పద్యం రెండవది. అర్జునుడు అడగగానే చిరునవ్వు చిందిస్తూ రథాన్ని ఉభయసేనలకు మధ్యలో నిలబెట్టి, కౌరవపక్ష రాజులందరిని చూపిస్తూ, ఆ చూపులతోనే వాళ్ళ ఆయువులన్నీ లాగేసిన శ్రీకృష్ణుడిని వర్ణించే పద్యం మూడవది. బంధుమిత్రుల ప్రాణాలు తీయడానికి ఇష్టపడక వెనుదీస్తున్న అర్జునుడికి గీతోపదేశం చేసి, సందేహాలు పోగొట్టి, యుద్ధంలో ముందంజ వేయించిన శ్రీకృష్ణుడిని వర్ణించే పద్యం నాలుగవది.

అంటే భారతంలోని పద్యాలు, దారుణ రోషం, క్రూరత, భయంకరాననం వంటి పదాలతో కృష్ణుడి క్రోధాన్ని చూపిస్తే, భాగవతంలోని పద్యాలు ఆయన సౌందర్యాన్నీ, భక్తవాత్సల్యాన్నీ చూపుతాయి.

అయితే, ఇక్కడ ఒక విషయం ఉంది. ఈ మార్పు పోతనగారు చేసినది కాదు. మూలభాగవతంలోనే ఈ సన్నివేశానికి ఈ రకమైన నేపథ్యం కూర్చబడి ఉంది. కనుక ఇందులో పోతనగారు చూపిన ప్రత్యేకత ఏమన్నా ఉన్నదా అన్న విషయం తెలియాలంటే మూలభాగవతంతోను, శ్రీకృష్ణ భాగవతంతోను పోల్చి చూడాలి.

పోతనగారి భాగవతంలోని నాలుగు పద్యాలకూ సమాంతరంగా మూలభాగవతంలో నాలుగు శ్లోకాలు ఉంటాయి. శ్రీకృష్ణ భాగవతంలోనూ సరిగ్గా నాలుగే పద్యాలు ఉంటాయి.

ఈ మూడు గ్రంథాలలోనూ ఉన్న పద్యాలను పరిశీలించినపుడు, తాత్పర్యాన్ని మాత్రమే తీసుకుంటే పెద్దగా వ్యత్యాసం కనిపించదు. కానీ పదాల ఎంపికలోని భేదాలు పోతనగారి పద్యాన్ని మరింత భక్తిరసపూరితం చేశాయని అనిపిస్తుంది.

మొదటిపద్యాన్ని తీసుకుంటే సంస్కృతంలో **"త్రిభువనకమనం తమాలవర్ణం"** అంటూ మొదలయ్యే వర్ణనని పోతనగారు **"త్రిజగన్మోహన నీలకాంతిఁ దనువుద్దీపింపఁ"** అంటూ అనువదించారు. శాస్త్రిగారు **"నల్లని మేనికాంతులు ఘనాఘనసంపద సొంపుడింప"** అన్నారు. ఈ ఒక్క పదాన్ని చూస్తే పోతనగారి అనువాదం మూలానికి ఎక్కువ దగ్గరగా ఉందనిపిస్తుంది. కానీ శ్రీకృష్ణభాగవతాన్ని వ్యాస, పోతన భాగవతాలతో పోల్చి చూసిన శనగవరపు రవిశంకర హృషీకేశశర్మగారు శ్రీకృష్ణభాగవతంలోని పద్యమే వ్యాసభాగవతానికి దగ్గరగా ఉందంటారు. సంస్కృతంలో ఉన్న తమాలవర్ణం అనే మాటను పోతనగారు సాధారణ నీలకాంతిగానే చెప్పారనీ, శాస్త్రిగారు నల్లని మేనికాంతి అనడమే కాక, ఘనాఘనసంపద సొంపు అని చెప్పి తమాలవర్ణ స్ఫురణ కలిగించారనీ అంటారు. సంస్కృతంలోని త్రిభువన కమనం అనే మాటను పోతనగారిలాగా వాచ్యం చేయడానికి బదులుగా **'ఘనాఘనసంపద సొంపు'** అంటూ జగన్మోహనత్వాన్ని ధ్వనింపచేశారని అంటారు.

అయితే ఈ వ్యాసం యొక్క ఉద్దేశం మూలానికి ఎంత విధేయంగా ఉన్నదని చర్చించడం కాదు కనుక ఆ ప్రస్తావన ప్రక్కన పెట్టి, భక్తిరస పోషణకు ఏది ఎక్కువ అనుకూలంగా ఉందన్నది చూద్దాము.

భక్తిరసపోషణకు సంబంధించినంతవరకు 'తమాలవర్ణం' అనే మాటను నీలకాంతి అనడం వలన కలిగే నష్టం ఏమీ ఉండదు, కానీ 'త్రిభువన కమనం' అనే మాటను వదిలివేయడం వలన మాత్రం నష్టం ఉంది. పోతనగారు వాడిన త్రిజగన్మోహనమనే మాట ఒక భక్తుడు భగవంతుడి గురించి మాత్రమే అనగలిగిన మాట. త్రిజగన్మోహనమనే విశేషణం కృష్ణునికి మాత్రమే వాడగలిగిన విశేషణం. మానవులలో ఎంత గొప్పవాడిని వర్ణించేటపుడైనా ఆ విశేషణం వాడలేము. ఇక్కడ శాస్త్రిగారు ఈ మాటను వాచ్యంగా చెప్పకుండా ధ్వనింపచేశారని సమర్థించుకోలేము. ఎందుకంటే భక్తిరసానికి సంబంధించినంతవరకూ ఇలాంటి మాటలను వ్యంగ్యంగా కాక వాచ్యంగా చెప్పడం అవసరం. పద్యం మొత్తంలోనూ శ్రీకృష్ణుడిని సాధారణ మానవుడిగా కాక భగవంతుడిగా దర్శింపచేసే కీలకమయిన పదం అది.

అదే పద్యంలో **"నీలాలక వ్రజ సంయుక్త ముఖారవింద మతి సేవ్యంబై విజృంభింప"** అన్న పద సమూహంలోని **"అతిసేవ్యంబై"** అన్న పదం కూడా అటువంటి కీలకమైన పదమే. ఇది మూలంలో లేదు. పోతనగారు పొందుపరచిన ఈ మాట కూడా ఒక భక్తుడు మాత్రమే అనే మాట. భక్తుని అనురాగాన్నీ ఆత్మార్పణనూ అర్థం చేసే మాట. పోతనగారి పద్యంలో అలవోకగా ఇమిడిపోయిన ఈ పదం భక్తిరస పోషణకు చాలా దోహదపడే పదం. ఇక ఈ పద్యంలోని చివరి మాటలు **"మా విజయుం జేరెడు వన్నెలాఁడు మది నావేశించు నెల్లప్పుడున్"** తీసుకుంటే, ఇక్కడ మూలంలోని "విజయసఖే" అన్న పదాన్ని పోతనగారు **"విజయుం జేరెడు వన్నెలాడు"** అని అనువదించడంతో పాటు దానికి ముందు **"మా"** అన్న అక్షరాన్ని చేర్చారు. ఆ ఒక్క అక్షరం చేసే చమత్కారం అంతా ఇంతా కాదు. ఆ ఒక్క అక్షరంతో పాఠకుల మనసు నుంచి రెండు శత్రుపక్షాలూ మాయమయిపోతాయి. యుద్ధక్షేత్రం దూరమయిపోతుంది. క్రోధం, వైరం వంటి భావాలన్నీ చెదిరిపోయి భక్తిరసాస్వాదనకు మనసు సన్నద్ధమవుతుంది.

అలాగే **"హయరింఖాముఖ ధూళి ధూసర పరిస్ఫురితాలకోపేతమై"** అన్న పద్యంలో వచ్చే **"జయముం బార్థున కిచ్చువేడ్కన్"** అన్న మాట సంస్కృతంలో లేదు. అది పోతనగారు అదనంగా కూర్చిన మాట. కృష్ణుని సామర్థ్యాన్నీ, భక్తవాత్సల్యాన్నీ, ధర్మపక్షపాతాన్నీ స్ఫురింపచేసే మాట.

మూడవపద్యాన్ని **"నరుమాటల్ విని నవ్వుతో"** అంటూ మొదలు పెట్టి, **"వెలుంగుచుండెడును హృత్పద్మాసనాసీనుఁడై"** అంటూ ముగిస్తారు. ఇక్కడ కూడా **"నవ్వుతో"** అనే పదం పోతన చేర్చినదే. మూలంలో **"సఖివచో నిశమ్య"** అని మాత్రమే ఉంటుంది. భగవంతుని చూపులను, నవ్వును పదేపదే దర్శింపచేయడం భక్తి రసపోషణకు సహకరించే అంశం. ఇది భక్తకవులందరూ చూపే ఒకానొక మెలకువ. అలాగే పద్యం చివర్లోని **"హృత్పద్మాసనాసీనుఁడై"** అన్న మాట కూడా పోతనగారి చేర్పు. అది కూడా భక్తుడికీ భగవంతుడికీ మధ్య మాత్రమే చోటు చేసుకోగలమాట.

నాలుగవ పద్యం కందపద్యం. ఆ చిన్న పద్యంలోనే సంస్కృత శ్లోకంలోని భావాన్నంతా ఇమిడ్చిన పోతన చివరిపాదంలో **"మునివంద్యుని పాదభక్తి మొనయున్ నాకున్"** అంటారు. ఈ 'మునివంద్యుని' అన్న మాట పోతన చేర్పు. ఇది కూడా భక్తి రస పోషణలో కవులు వాడే మెలకువే. **'ఇది మునులు, బుధులు అర్చించిన రూపం, వారు పొందిన భాగ్యం, వారు ఆస్వాదించిన ఆనందం'** అని చెప్పడం భక్తిరస సాహిత్యంలో తరచుగా కనిపించే ఒక అందం. రామరసాన్ని వర్ణించే భక్తకవులు **'శుకశౌనక కౌశిక ముఖపీతం'** అంటూ చవులూరించడం భక్తిరచనలలో విరివిగా కనిపించే అంశం.

భారతంలోను, భాగవతంలోను ఈ సన్నివేశానికి ఉన్న నేపథ్యమే కాదు, ఈ సన్నివేశం చెప్పబడిన దృష్టికోణం కూడా భిన్నం. ఒక సన్నివేశాన్ని పాఠకుడు ఏ పాత్ర వైపు నుంచి చూస్తున్నాడన్న విషయం కూడా రసాన్ని నిర్ణయిస్తుంది.

ఇక్కడ భారతంలో కృష్ణుడిని వర్ణించే పద్యాలు కథకుడు చెప్తున్నట్లుగా ఉంటే, భాగవతంలోని పద్యం స్వయంగా భీష్ముడే చెప్తున్నట్లుగా ఉంటుంది. అందువలన మరింత రసపుష్టి కలుగుతుంది. భారతంలోని పద్యాలు రెండు సన్నివేశాలలోనూ కూడా కథకుడు బయట నుంచి చూస్తూ వ్యాఖ్యానిస్తున్నట్లుగా ఉంటాయి. కృష్ణుడు రథం మీద నుంచి క్రిందికి ఎలా దూకాడో, అప్పుడు భీష్ముడు ఏమన్నాడో, అర్జునుడు ఏం చేశాడో ఇవన్నీ కథకుడు చెప్తున్నట్లుగా ఉంటాయి. ఒక్క భీష్ముని విషయంలోనే భావానికి సంబంధించిన మాటలు ఒకటి రెండు ఉంటాయి కానీ కృష్ణార్జునుల గురించి బాహ్యవర్ణన మాత్రమే ఉంటుంది. **"భీష్ముఁడెంతయుఁ బ్రియంబున నిట్లను సంభ్రమంబు లేక"** అని మొదటిసారి, **"భీష్ముఁడుల్లము వికాసమునొందగ నల్ల నవ్వి యిట్లను"** అని రెండవసారి కనిపిస్తుంది. వీటిలో భీష్ముని మనఃస్థితి కొద్దిగా అర్థమయినా, మొత్తంమీద పద్యాలన్నీ ఆ సన్నివేశంతో ప్రత్యక్ష సంబంధం లేని వ్యక్తి బయటినుంచి చూస్తూ చెప్తున్నట్లుగా ఉంటాయి. పాత్రల మనసులోని భావాలను కాక బయటకు కనబడే చేష్టలను, మాటలను మాత్రమే ఆ పద్యాలు చెప్తాయి.

అయితే ఈ దృష్టికోణంలోని మార్పు కూడా పోతన చేసినది కాదు. మూలభాగవతంలో ఉన్నదే. కానీ భీష్ముడితో సన్నివేశాన్ని చెప్పించడమనే విషయాన్ని ఉపయోగించుకోవడంలో పోతన చూపిన ప్రత్యేకత కొంత ఉంది. తరువాతి విభాగంలో ఆ విషయాన్ని గమనించవచ్చు.

### ప్రస్తుతపద్య వివేచన

ఈ సన్నివేశంలో ఆలంబన విభావం శ్రీకృష్ణుడు. భారతంలోని రౌద్ర రసానికి, భాగవతంలోని భక్తిరసానికి కూడా ఆలంబన అతడే. అలాగే అటు భారతంలోనూ, ఇటు భాగవతంలోనూ కూడా భీష్ముడు ప్రధానంగా ఆయా రసాలకు ఆశ్రయమైనా, అర్జునుడు కూడా శ్రీకృష్ణుడిని దర్శిస్తున్నాడు. సన్నివేశంలో ఉన్నవి ఈ మూడు పాత్రలే.

ఈ మూడు పాత్రల చిత్రణలో పోతనగారు చూపిన ప్రత్యేకతను భక్తి రసానుకూలతను దృష్టిలో పెట్టుకుని పరిశీలిద్దాము. భారతంలోని రెండు పద్యాలూ కృష్ణుడిని రౌద్రమూర్తిగానే చూపుతున్నాయని అర్థమవుతుంది. **"జగత్సంహారోన్ముఖుఁడైన రుద్రుగతి"** అనే పోలిక తేవడం, **"రౌద్రప్రక్రియం బొల్చినన్, రౌద్రోద్రేకముం జూచి ఖేచర లోకంబును సంచలింప"** వంటి మాటలు వాడడం ఈ పద్యాలలో కనిపిస్తుంది.

భాగవత పద్యాలలోని కృష్ణుని వర్ణన వీటికి పూర్తిగా భిన్నంగా ఉందని స్థూల పరిశీలనకే అర్థమవుతుంది. వ్యాస, పోతన, శ్రీకృష్ణ భాగవతాలలోని పద్యాలను మరికొంత సూక్ష్మంగా పరిశీలిద్దాము.

ప్రధానంగా చర్చిస్తున్న **"కుప్పించి ఎగసిన"** పద్యాన్ని తీసుకుంటే, అందులో మొదటి పాదంలోనే **"గగన భాగంబెల్ల కప్పికొనగ"** అన్న వర్ణన కనిపిస్తుంది. ఇది మూలంలోనూ లేదు. శాస్త్రిగారి అనువాదం లోను లేదు. నిజానికి శాస్త్రిగారు అనువదించిన పద్యంలో ఎక్కడా అసలు కృష్ణుడిని భగవంతుడిగా స్ఫురింపచేసే పదమే లేదు. వ్యాస భాగవతంలో చివరకు వచ్చిన **"భగవాన్ గతిర్ముకుందః"** అన్న పదం భక్తిరసం దృష్ట్యా చూస్తే చాలా ముఖ్యమైన పదం. అది అనువాదం లోకి రావాలి. దానిని పోతనగారు **"దేవుండు దిక్కు నాకు"** అని తెనిగించారు. శాస్త్రిగారు **"హుంకరించుచు నరుదెంచునంకకాదు"** అన్నారు.

సంస్కృతశ్లోకంలో ఈ పదం చివర్లో ఉంది. తెలుగు అనువాదం లోనూ చివర్లోనే ఉంది. కానీ భగవంతుడన్న స్ఫురణ మాత్రం సీస పద్యం మొదట్లోనే కలిగేలా చూశారు పోతనగారు. **"గగన భాగంబెల్ల కప్పికొనగ"** అన్న వర్ణనద్వారా కృష్ణుని సర్వవ్యాపకత్వాన్ని ధ్వనింప చేశారు. ఆ వెంటనే **"ఉదరంబులో నున్న జగముల వ్రేఁగున జగతి గదలఁ"** అన్న పదంతో ఆ భావనను స్థిరపరిచారు. మూలంలోని **"చలద్గుః"** అన్న పదాన్ని శాస్త్రిగారు **"క్షితితలంబు దద్దతిల్లగ"** అని అనువదించారు. అది పోతన అనువాదంలా భగవంతుడనే స్ఫురణ నను కలిగించదు.

ఇక్కడ మూలంలోని ఒక భావాన్ని పోతనగారు వదిలివేశారు. అది **"ఆయుధం పట్టననే తన ప్రతిజ్ఞను పక్కనబెట్టి నా ప్రతిజ్ఞను కాపాడిన కృష్ణుడు"** అన్న భీష్ముని భావన. దీనిని శాస్త్రిగారు అనువాదంలోకి తెచ్చారు కానీ పోతనగారు తేలేదు. కృష్ణుని భక్త పరాధీనత్వానికి గీటురాయి అనదగిన ఈ భావాన్ని పోతనగారు వదిలివేశారనీ, శాస్త్రిగారు నిశితదృష్టితో పట్టుకున్నారనీ రవిశంకర హృషీకేశశర్మగారు అంటారు. అయితే ఇక్కడ ఒక విషయం ఆలోచించాలి. కృష్ణుడు తన ప్రతిజ్ఞను పక్కన బెట్టినది భీష్మునిపై వాత్సల్యంతోనా, అర్జునునిపై వాత్సల్యంతోనా! ప్రతిజ్ఞను పక్కన పెట్టడంలో భక్త పరాధీనత ఉన్నమాట నిజమే కానీ ఆ భక్తుడు భీష్ముడా, అర్జునుడా!

అర్జునుని కోసం తన ప్రతిజ్ఞను వదిలివేశాడన్న భావం పోతనగారి పద్యంలో వచ్చింది. కాబట్టి భక్తపరాధీనతకు వచ్చిన ఇబ్బంది లేదు. అది పోతనగారి పద్యంలో కనబడుతోంది. పైగా **"నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు విడువు మర్జున!"** అంటూ విడిపించుకో బోయిన కృష్ణుని వర్ణన మరింత రమ్యంగా ఉంది. నిజంగా అర్జునుడు వదిలితే తప్ప విడిపించుకోలేని బలహీనుడు కానప్పటికీ **'విడువు మర్జున'** అని అడుగుతున్న కృష్ణుడిలో భక్తుల పట్టులో చిక్కుకుపోయే, లొంగిపోయే దామోదరుడు కనిపిస్తున్నాడు.

కృష్ణుడు ఒక ప్రతిజ్ఞ చేశాడు, దానిని ఇప్పుడు వదిలివేశాడు – అన్న విషయాన్ని కథాంశంగా, ఒక సమాచారంగా చూస్తే ఆ




సమాచారం భారత కథకు ముఖ్యమైన విషయం కానీ భాగవతంలో సంక్షిప్తంగా చెప్పబడిన ఈ ఘట్టంలో అది ముఖ్యం కాదు. కనుక సమాచార పరంగా కూడా పోతనగారి పద్యంలో నష్టమేమీ జరగలేదు. కాబట్టి భక్తిరసపోషణను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే, కృష్ణుడి పాత్రకు సంబంధించినంతవరకూ పోతనగారు చేసిన ఈ మార్పు వలన అందం పెరిగిందే కానీ తరగలేదు.

ఇక భీష్మార్జునుల గురించి చూద్దాం. ఇక్కడ భారతంలోని మొత్తం సన్నివేశాన్ని కాక, ప్రస్తుతం చర్చిస్తున్న భాగవత పద్యానికి దగ్గరగా ఉన్న, కృష్ణుడిని వర్ణించే పద్యాలు రెండింటినే పరిగణిస్తున్నాం కనుక ఆ పద్యాలలో భీష్మార్జునుల ప్రస్తావన లేదు. కానీ భారతంలోని తరువాతి పద్యాలను కూడా చూస్తే, ఆ పద్యాలలోని అర్జునుడికీ ప్రస్తుత పద్యంలో పోతనగారు చూపిన అర్జునుడికీ పెద్దగా భేదం లేదు. భారతంలో అర్జునుడు పలికిన మాటలనే పోతనగారి పద్యంలోని అర్జునుడు కూడా పలుకుతాడు. కాకపోతే **"కోపము సంహరింపుము యదుకుంజర"**, **"శమియింపుము"** వంటి మాటలు భారతంలో అదనంగా ఉంటాయి. భారతంలోని కృష్ణుడు క్రోధమూర్తి కనుక అందుకు అనుగుణంగా ఆ మాటలు అక్కడ చోటు చేసుకున్నాయి. భీష్ముడి విషయంలో మాత్రం భారత భాగవతాల మధ్య కొంత భేదం కనిపిస్తుంది. భారతంలోని భీష్ముడు తనపైకి వస్తున్న కృష్ణుడిని నీ యిష్టప్రకారమే చేయమని నవ్వుతూ ఆహ్వానిస్తూనే **'ఈలోకంలో శాశ్వతమైన కీర్తినీ, పరలోకంలో వినుతికెక్కే సద్గతినీ'**

చేకూర చేయమంటాడు. భాగవతంలోని భీష్ముడికి అటువంటి కోరికలు ఉండవు. భాగవతంలో భీష్ముడు కోరుకునేది భగవద్రతిని మాత్రమే. అయితే ఇది మూలభాగవతంలోనే ఉన్న భేదం కనుక, ఈ రెండు పాత్రల చిత్రణలో పోతనగారు చూపిన నేర్పును వ్యాస, శ్రీకృష్ణ భాగవతములతో పోల్చి చూద్దాము.

మొదట అర్జునుడి పాత్రను తీసుకుంటే ఈ పాత్ర **"కుప్పించి ఎగసిన"** పద్యానికి మూలమైన సంస్కృత భాగవత శ్లోకాలలోను, శాస్త్రిగారి అనువాద పద్యంలోను కూడా కనిపించదు. కానీ ఎంత భీష్ముని దృష్టికోణంలోనుంచి చెప్తున్నప్పటికీ, భక్తిరసానికి సంబంధించి నంతవరకూ ఈ సంఘటనకు ప్రాణం అర్జునుడే. ఆ అర్జునుడి కోసమే కదా కృష్ణుడు చూపిన ఆవేశమంతా! అది భీష్ముడికీ తెలుసు. ఆయన ముచ్చట కూడా అదే. అర్జునుడిపై కృష్ణుడికి ఉన్న పక్ష పాతాన్ని చూసే భీష్ముడికి అంతటి పరవశం. ధర్మంపై భగవంతుడు చూపే ఆ పక్షపాతమే భక్తులను అమితంగా ఆకర్షించే లక్షణం. దానిని **"మా విజయుం జేరెదు వన్నెకాడు"** అంటూ సన్నివేశం మొదట్లోనే పట్టుకువచ్చిన పోతనగారు ఈ పద్యంలో మరింతగా తీర్చిదిద్దారు. భీష్మునివైపు నుంచి చెప్తూ కూడా అర్జునుడి భక్తినీ ఆ భక్తుడిపై కృష్ణుడి కరుణనీ కళ్ళకు కట్టారు.

ఇక చివరిగా భీష్ముని పాత్రచిత్రణను పరిశీలిద్దాము. **"ఆయుధం పట్టననే తన ప్రతిజ్ఞను పక్కన బెట్టి నా ప్రతిజ్ఞను కాపాడిన కృష్ణుడు"** అన్న భీష్ముని భావనను పోతనగారు అనువాదంలో వదిలివేశారని చెప్పుకున్నాం. దీనివలన కృష్ణుని పాత్రకు కాకపోయినా భీష్ముని పాత్రకు ఏమైనా నష్టం జరిగిందా అన్న విషయం చూడాలి. నిజమే మూలంలో వ్యాసుడు చెప్పినట్లు ఈ రకమైన భావన భక్తుడిగా భీష్ముడు వెలిబుచ్చే అవకాశం ఉంది. భగవంతుడు ఒక పని చేస్తే అది నాకోసమేనన్న భావ్యం భక్తుడు చెప్పుకోవడం సహజమే. భద్రాద్రిలో వెలసిన రామయ్యను చూసి ప్రతి భక్తుడూ **"నాకోసమే ఇక్కడ వెలిశావా తండ్రీ"** అనుకోవడం –అది ఒక రమ్యమైన భావమే. కానీ ఇక్కడ పోతనగారు చేసిన మార్పు రమ్యతరంగా ఉంది.

అంతేకాదు, ఇక్కడ భీష్ముని భావంలో చిన్నలోపం కనబడే అవకాశం కూడా ఉంది. భీష్మపర్వానికి వ్యాఖ్య వ్రాస్తూ నందూరి రామకృష్ణమాచార్యులు చెప్పిన కొన్ని మాటలను ఇక్కడ ప్రస్తావించు కోవాలి. ఆ మాటలలోని సారాంశాన్ని మాత్రం పేర్కొంటున్నాను. **'ప్రతిజ్ఞ ఒక ఉత్తమ లక్ష్యం కావాలి కానీ బంధం కాకూడదనీ, భీష్ముడు తన తండ్రికోసం ఒక ప్రతిజ్ఞ చేసి దానికి దాసుడయ్యాడనీ, దానిమూలంగా తర్వాతికాలంలో ధృతరాష్ట్రుడికీ, ఆపైన దుర్యోధనుడికీ కూడా దాసుడు కావలసి వచ్చిందనీ, బహుశా భీష్ముడికి ఆ విషయం తెలుసుననే అనుకోవచ్చు'**నని రామకృష్ణమాచార్యులు అంటారు.

ఆ విధంగా ఆలోచించినపుడు కృష్ణుడు చక్రం పట్టడం ఒకవేళ భీష్ముడిని అనుగ్రహించడానికే అయితే, ఆ అనుగ్రహం యొక్క ఉద్దేశం భీష్ముడి ప్రతిజ్ఞను గెలిపించడం కాదనీ, **'ప్రతిజ్ఞను అధర్మానికి దాస్యం చేయవలసి వచ్చేంత బంధం చేసుకోకూడదనే పాఠాన్ని భీష్ముడికి నేర్పించడం'** అనీ అనుకోవడం బాగుంటుంది. కనుక భీష్ముడు కేవలం మురిపెం కోసం అన్నా (నిజంగా అందుకోసం కాదని ఆయనకీ తెలిసిన) **"నా ప్రతిజ్ఞను నిలబెట్టడం కోసం ఆయుధం పట్టావా"** అన్న భావాన్ని తప్పించి, కృష్ణుడు ఆయుధం పట్టడానికి అసలు కారణమైన అర్జునుడిపై వాత్సల్యాన్ని పద్యంలోకి తీసుకురావడం ద్వారా పోతనగారు భీష్ముని పాత్రను కూడా మెరుగు పరిచారని అర్థమవుతుంది. భీష్ముని బలహీనతను స్ఫురింపజేసే భావాన్ని తప్పించి, అర్జునునిపై కృష్ణునికి ఉన్న కరుణని చూసి పరవశించిపోయే భీష్ముడిని చిత్రించడం ద్వారా ఆ పాత్రకు మరింత వన్నె తెచ్చారని అనిపిస్తుంది.

ఈ విధంగా పోతన గారు చేసిన మార్పులు మూడు పాత్రలనీ మరింత భక్తిరసానుకూలంగా చిత్రించాయనీ, తద్వారా మొత్తం సన్నివేశాన్ని మరింత భక్తిరసాత్మకంగా మార్చాయనీ అర్థమవుతుంది.

ఇంకా ఈ పద్యాన్ని ఛందస్సు వంటి ఇతర అంశాలను ఆధారం చేసుకుని కూడా పరిశీలించే అవకాశం ఉన్నప్పటికీ వ్యాసం నిడివిని దృష్టిలో పెట్టుకుని ఈ వ్యాసాన్ని భావానికి సంబంధించిన వివేచన వరకే పరిమితం చేసుకున్నాను. భావానికి సంబంధించిన చిన్న చిన్న మార్పుల వలన పోతన భాగవతంలోని ఈ పద్యం సంతరించు కున్న భక్తిరస పరిపుష్టిని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాను.

**పరిశీలించిన గ్రంథాలు**


1. పోతన భాగవతము – మొదటి సంపుటము, 2015,తి.తి.దే. ప్రచురణలు
2. వ్యాసభాగవతము, 2016, గీతాప్రెస్, గోరఖ్‌పూర్
3. శ్రీకృష్ణభాగవతము, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, 1997, తి.తి.దే. ప్రచురణలు
4. శ్రీకృష్ణభాగవతము – వ్యాస పోతన భాగవతములతో తులనాత్మక పరిశీలన, శనగవరపు రవిశంకర హృషీకేశ శర్మ, 1995, నరసాపురం.
5. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము సంపుటము–8, 2013, తి.తి.దే. ప్రచురణలు
6. కావ్యానందము, విశ్వనాథ సత్యనారాయణ, 2007, శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  UGC Care List Approved Journals
హైదరాబాద్ మార్చి : 2022

# పల్లె పదానికి పట్టాభిషేకం

**నాగభూషణం పరికె,** DSP, TRANSCO VIGILANCE, ఫోన్ : 949 231 2233

**- గోరటి వెంకన్న వల్లంకి తాళం కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు 2021**

**- గోరటికి దక్కిన ఈ అరుదైన అవకాశం యావత్ తెలుగు వారికి దక్కిన గొప్ప గౌరవం**



ఆయనొక సాధారణ పక్కా పల్లెటూరు మనిషి. కల్మషం లేని ప్రజాకవి. ప్రకృతి ప్రేమికుడు. పల్లె - గల్లీ - పట్నం, చెట్టు - పుట్ట, వాగు-వంక- వాన, పిట్ట - కాకి- కొంగ ఇలా దేనిమీదనైనా అలవోకగా ఆశువుగా కైగట్టి పాడే ప్రజాకవి వాగ్గేయకారుడు. ఆయన పాటలలో ఎంతో అర్థం, ఆర్ద్రత ఉంటాయి. వేదిక మీద మైకు పట్టిండంటే ఆట పాటలతో దద్దరిల్లాల్సిందే. ఆయనే మన కవి గాయకులు తెలంగాణా శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న.

పాలమూరు జిల్లాగా ప్రసిద్ధి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గౌరారం గ్రామం తెల్కపల్లి మండలంలోని ఆదర్శ మాతృమూర్తులు గోరటి నర్సింహ్మ - ఈరమ్మ ల నలుగురు సంతానం వెంకన్న, వెంకటమ్మ, శ్రీరాములు మరియు అరుణ. నలుగురిలో పెద్దవాడు మన కవిగాయకుడు వెంకన్న. తండ్రి నర్సింహ్మ విద్యావంతుడు, యక్షగాన కళానిపుణుడు. వెంకన్న చిన్నప్పటి నుండే అభ్యుదయ భావాలు కలిగిన విద్యార్థి నాయకుడు. సాహిత్యంపై ఉన్న మక్కువతో చిన్నప్పటి నుండే పాటలు పాడటం, నాటికలు వేసి ప్రజాచైతన్యంలో పాల్గొన్నారు.

**ఆయనో జానపద బ్రహ్మ**

పెదవి విప్పితే పల్లె రాగం జీరగొంతులో పాటపాడితే యావత్ తెలుగు ప్రజానీకం ఫిదా అవ్వాల్సిందే..

**కాలు కదిపితే చెతన్య సారథి**

అలవోకగా గంటల తరబడి ఆట-పాటలతో ఆకట్టుకునే జనం కవి. జనం కష్టాలు కన్నీళ్లను పాటలుగా మార్చి, పాలకుల దృష్టికి తీసుకెళ్లే ప్రజాకవి.

ఆయన కలం కదిపితే పాటల ఊట ఉబికి వస్తుంది. సెలయేరులా పొంగిపొర్లుతూ నిత్యం జనంలో మారుమ్రోగుతూనే ఉంటాయి. 2020, నవంబరులో శాసనమండలి సభ్యుడిగా (గవర్నర్ కోటా) ప్రమాణ స్వీకారం చేశారు.

ముగ్గురు తెలంగాణ బిడ్డలు. ప్రముఖ కవి వాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రముఖ రచయితలు దేవరాజు మహారాజు, తగుళ్ల గోపాల్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు ప్రకటించడం తెలుగు సాహిత్యానికి తగిన గుర్తింపుగా యావత్తు తెలుగు ప్రజలు ముఖ్యంగా తెలంగాణా బిడ్డలు సంబరపడుతున్నరు. అనేక సినిమాలకూ ఆయన పాటలు రాశారు

**'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల.. నా తల్లి కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల'....**

**'జై బోలో జై బోలో అమరవీరులకు జై బోలో'** వంటి ఎన్నో పాటలు ఇప్పటికీ ప్రజల నాలుకలపై మెదులుతుంటాయి.

వెంకన్న రాసిన **'పల్లె కన్నీరు పెడుతుందో...'** పాట ఆంగ్లంలోకి అనువదించబడి, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రచురణలలో స్థానం పొందదంతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ బిఏ విద్యార్థులకు, 5వ తరగతి తెలుగు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సిలబస్‌లో పాఠ్యాంశంగా చేర్చబడింది.

అరమరికలు లేని గ్రామ స్వరాజ్య స్వాప్నికుడు మన గోరటి.

**గల్లి సిన్నదీ గరీబోల్ల కథ పెద్దది..**
**వాల్లున్న ఇల్లు కిల్లు కొట్లకన్న సిన్నగున్నయో..**
**అని పేదల బతుకుల జీవన చిత్రాన్ని**
**కండ్లకు కట్టినట్లు కైగట్టిన పేదల పక్షపాతి**

అంతరాలు లేని సమాజాన్ని ఆశించిన సామ్యవాది, ప్రగతిశీలి గోరటి వెంకన్న.

**సంత మాఊరి సంత....** అంటూ వారాంతపు సంతలో సేదదీరే చితికిన బతుకుల బీదలు ఎదురుచూసే జాతరను ఆవిష్కరించిన







బీదల ప్రీతిపాత్రుడు మన గోరటి...

**నను గన్న నా తల్లీ రాయలసీమ**

**పూసిన పున్నమి వెన్నెల వీణ..**

**వాసనా సబ్బులాకు.., వానొచ్చెనమ్మా.., రేలాదులా.., దేవతమ్మా** లాంటి పాటలు వినని తెలుగోడు లేడు అంటె అతిశయోక్తి కాదు.

గోరటి వెంకన్న మట్టిలో మాణిక్యం

తెలుగువారి ఆత్మీయ అన్నయ్య

పక్కా పల్లెటూరులో మొలకెత్తి

పట్నం దాకా విస్తరించిన సాహిత్య దిగ్గజ మాను.

బైరాగి తత్త్వము వంటబట్టించుకొని

నాలుగు రోజుల నాటకరంగంలో నరుని మాయల్నీ ఎత్తిచూపిన గొప్ప సామాజిక తత్త్వవేత్త. శాశ్వతం కాని జీవితం కోసం అడ్డదారులు తొక్కొద్దని బోధించిన సామాజిక తాత్వికుడు

అంబేద్కర్ – మహాత్మా జ్యోతిరావ్ పూలే

శ్రీశ్రీ – దాశరథి, కారల్ మార్క్స్ – లెనిన్

గౌతమ బుద్ధుడు – వీరబ్రహ్మేంద్రస్వామి

ఎందరో మహానుభావుల జీవితాలను వారి రచనలు బోధనలు ఆవపోసనపట్టి, వారి తత్త్వాలను సమాజానికి తన రచనల ద్వారా అందిస్తున్న పల్లె పండితుడు...రాతల మాంత్రికుడు మన గోరటి.

తెలంగాణా ప్రజల ఆకాంక్షను తనదైన శైలిలో తెలంగాణా గోడును తన రాత–గాత్రం ద్వారా విశ్వవ్యాప్తం చేసిన తెలంగాణా ఉద్యమ కవిబిడ్డ మన గోరటి.

**పిట్టబతుకే ఎంతో హాయి...** అంటూ.. చీకు చింత, స్వార్థం దోపిడి లేని బ్రతుకులను ఆశించిన సహజకవి మన గోరటి

**ఓ నల్ల తుమ్మా....**

అంటూ సొసైటీకీ ఎంతో ఉపయోగపడుతున్న వృక్ష సంపదకు సలాం కొట్టమన్న ప్రకృతి ప్రేమికుడు మన గోరటి.

కొంగ జపమంటరే కొంగమా

అంటూ కపటం లేని మకుటాన్ని కాంక్షించిన నిస్వార్థ కవి మన గోరటి.

**పరికిపిట్ట పాచినీ కడిగింది**

**నోరెండిన బీళ్లను తడిపింది** అంటూ వానమ్మను ఘనంగా కీర్తించిన రైతుబిడ్డన గోరటి.

ఆయన నిరంతరం పల్లెపదాలను సాగుచేసి నూతన సామాజిక అభ్యుదయ గీతాలను పండించే సాహితీ క్షేత్రమాలి.

**ఆయన గొంతెత్తితే విప్లవ శంఖారావం**

**నినదిస్తే విప్లవ వీరుడు**

**ఓదార్చితే మానవతామూర్తీ**

**నిత్యం నూతన ఆవిష్కరణల కోసం**

**అన్నపానీయాలను మాని**

**కొండకోనల చుట్టు ప్రదక్షిణలు చేసే నిత్యాన్వేషి**

**వల్లంకితాళం.. ప్రకృతి ప్రేమ కరుణ జాలిల**

**సమైక్య సజీవ నాదం**

దానికి కేంద్ర సాహిత్య అకాడెమి చప్పట్లు కొట్టి శభాష్ అని అందలం ఎక్కించటం.. యావత్ తెలుగువారికి దక్కిన గొప్ప వరం.

**నిజంగా తెలంగాణా భాషకు యాసకు నిలువుటద్దం వల్లంకితాళం.** కమ్మనైన ప్రకృతి వర్ణనలతో కూడిన (32) గేయ వచన కవితలతో కూడిన సంపుటికి 2021 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం నిజంగా శ్లాఘనీయం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  UGC Care List Approved Journals
హైదరాబాద్ మార్చి : 2022













అత్యున్నమైన ఈ సాహిత్య పురస్కారం మన ఈ ప్రజాకవి వాగ్గేయకారుడు గోరటికి యేనాడో లభించాల్సింది ఆలస్యం అయినా తగిన గుర్తింపు రావటం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ గర్వకారణం.

తెలుగు సాహితీ ప్రపంచంలో నిత్య విద్యార్థి గోరటి, నిత్యపఠనమే ఆయనకు ఊపిరి. పస్తులైన ఉంటాడు కాని పుస్తకం చదవనిది ఉండలేడు ఆయన.

కుట్రలు కుతంత్రాలు తెలియని స్వేచ్ఛాజీవుడు

సొల్లుకబుర్లతో కాలం వెలిబుచ్చడు

అవకాశం దొరికితే అదృశ్యమై ప్రకృతి ఒడిలో సేదదీరుతూ ప్రకృతితోనే మమేకమై నూతన సాహితీ కుసుమాలను సాగుచేసి ఆవిష్కరిస్తాడు.

**నిత్యం జాలువారే జీవనది మన గోరటి కలం. కొత్త ఆలోచనలతో మండే అగ్నిగోళం....**

ఆయన మస్తిష్కం సముద్రంలా ప్రశాంతంగా కనిపించినా.. ఆయనలో సామాజిక అభ్యుదయ ఆవిష్కరణల కోసం అలజడులే ఎక్కువ. గోరటి వెంకన్న ప్రముఖ ప్రజాకవి, గాయకుడు. పల్లె ప్రజలు, ప్రకృతి ఆయన పాటలకు మూలాధారాలు. మా టీవీలో ప్రసారమైన రేలా రె రేలా కార్యక్రమానికి సుద్దాల అశోక్‌తేజతో కలిసి న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు.

2016లో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నుండి కాళోజీ సాహిత్య పురస్కారంతో పాటు ఆయన సాహిత్యానికి చాలా పురస్కారాలు లభించాయి.

**గోరటి ఇతర రచనలు :**

ఏకనాధం మోత, రేలపూతలు, అల చంద్రవంక, పూసిన పున్నమి, వల్లంకితాళం, రవినీడ, సోయగం, పాతకథే నా కథ, పల్లాడి మొదలైనవి. లెక్కకు మించి జానపదాలు, కీర్తనలు మరియు ప్రతి సందర్భం మీద ఆయన కలం పాట రూపంలో స్పందిస్తది.

గోరటి వెంకన్న కలం నుండి గళం నుండి మరెన్నో ప్రజారంజక రచనలు రావాలనీ, వారే ఏలిక అయ్యి పేదల పక్షాన కారుణ్య రాజవ్వలని మనసా వాచా ఆశిద్దాం.



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు-**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

**(ప్రపంచ పదులు**
**- డా. సి. నారాయణ రెడ్డి)**

# పద్యమనోహరం - 28

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448



**"రాతిరియున్ బవల్ తమదు రక్తము నోడ్చి శ్రమించి మేనిపై
చేతెడు గుడ్డయున్, తినగ చేరెడు గింజలు లేక ఎన్నియో
యాతనలోర్చుచున్ ప్రజకు హాయిని గూర్చెడు దేశభక్తులౌ
రైతుల గోడు నీవయిన వ్రక్కలు సేయవె బాలభూపతీ!"**

అవి తెలంగాణమునకు **"భీకరాశుభదినాలు"** – యావత్తు తెలంగాణ ప్రజలు ఒక నిరంకుశ ప్రభువు పాదఘట్టనల క్రింద నలిగిపోఉన్న రోజులు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలన్నీ నవాబు భోషాణం నింపి తమ శ్రమఫలాన్ని అనుభవించలేని దీనత్వమనుభవిస్తున్న కాలం. ఆ సందర్భంలో రైతుల పక్షాన చేసిన పోరాటాలకు తామే నాయకత్వం వహించి నాటి గద్వాల ప్రభువుకు పద్యాలలో అర్జీనిచ్చిన కవి కీ.శే. గడియారం రామకృష్ణశర్మగారు.

1943లో గద్వాల ప్రభువునకు ఇచ్చిన వినతిపత్రంలో చెప్పిన ఈ పద్యంలో గడియారం వారి గుండెల్లో రైతుపట్ల, రైతుశ్రమ పట్ల ఎంతటి గౌరవమూ, వారి కృషికి తగిన ఫలితం అందకపోవడంపై ఎంతటి బాధ ఉందో వ్యక్తమౌతున్నది.

**"రేయింబవళ్ళు తమ రక్తం ధారపోసి, శ్రమచేసే కర్షకులకు సరియైన వస్త్రాలు కాని, వాళ్ళు తినడానికి సరియైన తిండిగాని లేకుండా అనేక కష్టాల పాలవుతున్నారు. అయినా అన్నింటినీ ఓర్చుకొని ప్రజలకు కడుపునింపి మేలు చెయ్యాలనీ వారికి సుఖజీవనం అందించాలన్న ఒకే ఒక లక్ష్యంతో శ్రమ చేసే రైతుల గోడును విని నీవైనా దాన్ని పోగొట్టవయ్యా!"**

అంటూ గద్వాల సంస్థానాధిపత్యాన్ని స్వీకరించిన యువరాజుకు పద్యాల్లో అందించిన ఈ అభ్యర్థనలో రైతుల యొక్క ఔదార్యం, వారి ప్రజోపయోగ దృష్టి, వారి నిస్వార్థ సేవాభావన ఎంతటితో తెలుస్తూ ఉంది. రైతు లేనిదే రాజ్యం లేదు. రైతు శ్రమ లేనిదే ఆ సమాజానికి తిండి లేదు. కాని రైతు కష్టాన్ని గుర్తించని పాలకులెంతటి దుర్మార్గులో.

నైజాం రాష్ట్ర పరిస్థితికి అద్దం పట్టిన ఈ పద్యంతోబాటు వారి వ్యథలను వివరించే మరిన్ని పద్యాలు ఈ ఖండికలో చోటు చేసుకున్నాయి. పద్యంలోని భావం నాటి సామాజిక స్థితికి అద్దం పడుతున్నది. రైతు శ్రమను దోచుకుంటున్న నాటి పాలకుల దుర్మార్గాన్ని ఈ పద్యం అన్ని కాలాల సాహితీ ప్రపంచానికి తెలియజేస్తూ ఉంది. నిజాం నిరంకుశ పాలనలో రైతులు కేవలం శ్రమచేసే శ్రామికులుగానే మిగిలిపోయి కష్టాలపాలైన సంగతి నాడు కలం పట్టిన కవులందరూ తమ కవితల ద్వారా చెప్పడం మనం చూడవచ్చు. దాశరథిగారు **"రైతుదే తెలంగాణము రైతుదే"** అనడం కాని, కాళోజీగారు ఈ ప్రపంచ సుఖాలనీ **"కర్షకా! నీ కళ్ళు కదిలినన్నాళ్ళే"** అనడం కాని నాటి సామాజిక వైపరీత్యాలను ఎండగట్టడానికే నన్నది మరువరాని సత్యం.

కవికి సమాజం పట్ల ఉన్న గురుతరమైన బాధ్యతను గుర్తుచేస్తున్నది శర్మగారి పద్యం. లోక క్షేమాన్ని కాంక్షించే శ్రమజీవికి న్యాయం జరగాలన్న ధ్యేయం ఈ పద్యంలో ద్యోతకమవుతున్నది. కలం పట్టిన కవికి లోకం కూడా పట్టాలి. లోకక్షేమం కూడా పట్టాలి. అంతేకాని ఏవేవో ఊహాలోకాల్లో విహరించరాదన్న భావనను కూడా ధ్వనింపజేసే ఈ పద్యం కవి బాధ్యతను గుర్తు చేస్తున్నది. ఏ సమాజమైతే నిన్ను కవిగా గుర్తించి గౌరవించిందో ఆ సమాజం పట్ల, వారి సంక్షేమం పట్ల నీ బాధ్యత ఉంటుందన్న సంగతిని చెప్పకనే చెప్పినట్లైంది. కూరతో మొదలుగ కూటి గింజల దాక, నాటి గ్రామాధికారుల కడుపు నింపి, నాటి చిల్లర ఉద్యోగులకు కూడా కానుకలిచ్చి, తమపై పెత్తనం చేసే పెత్తందార్ల పొట్టలు నింపి, అధికారులకు కట్నకానుకలిచ్చి సంతృప్తి పరచి వాళ్ళ కాళ్ళమీదబడి వేడుకునే దుస్థితి నాటి రైతులకున్నదని వేదన చెందిన శర్మగారు వాళ్ళ పక్షాన ఈ వినతి పత్రాన్ని సమర్పించడం కేవలం నాటికాలానికే ఈ పద్యం పరిమితం కాదు. ఎప్పుడైనా సరే, ఏ పాలకులైనా సరే ప్రజాక్షేమం గురించి ఆలోచించకుండా తమ యేలుబడిని కొనసాగిస్తారో వారందరినీ హెచ్చరించవలసిన బాధ్యత కవిదేనన్న భావనను బలంగా చెప్పిన పద్యం కవి అక్షరశక్తి. దాన్ని తనదైన ధోరణిలో ప్రజా చైతన్యానికే ఉపయోగించాలన్న కాంక్షతో కవితా "పాంచజన్యా"న్ని పూరించి నినదించిన గొప్ప వైతాళికుడు కీ.శే. గడియారం రామకృష్ణశర్మగారు.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5 29 హైదరాబాద్ మార్చి : 2022

కథ

# ప్రాచీన తెలుగు సాహిత్యంలో దేవదాసీలు

డా. శిరీష ఈడ్పుగంటి, చిత్తూరు. ఫోన్ : 81215 23835

ప్రాచీన తెలుగుసాహిత్యంలో కనిపించే దేవదాసీలను గూర్చి తెలుసుకోవాలంటే ముందుగా దేవదాసీవ్యవస్థను గూర్చి, దేవదాసీలను గూర్చి తెలుసుకోవాలి. దేవదాసీలు అంటే ఎవరు? ఈ వ్యవస్థ ఎలా ఏర్పడింది? ఎప్పట్నించి ఈ వ్యవస్థ ఉంది... మొదలైన విషయాలను అధ్యయనం చేయాలి. తెలుగుసాహిత్యం ప్రారంభం కావడానికి ముందు ఈ వ్యవస్థ ఎలా ఉంది అనే అంశాలను కూడా చర్చించుకోవాలి.

ఈ వ్యాసంలో దేవదాసీవ్యవస్థను రెండు దశలలో వివరించడ మైనది. మొదటిదశ తెలుగుసాహిత్యం ప్రారంభానికి ముందుదశ (11వ శతాబ్దానికి ముందు). రెండవదశ తెలుగుసాహిత్యం ప్రారంభమైన తర్వాత దశ (11వ శతాబ్దానికి తరువాత). ఈ రెండు దశలలోను దేవదాసీవ్యవస్థలో వచ్చిన మార్పులను చర్చించడం, అలాగే ప్రాచీన తెలుగుసాహిత్యంలో దేవదాసీల ప్రస్తావనను పరిశీలించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

**బౌద్ధమతం**

మొట్టమొదట ఈ వ్యవస్థకు బీజం బౌద్ధమతంలో కనిపిస్తుంది. బౌద్ధసాహిత్యం పరిశీలిస్తే ప్రాచీన కాలంలో బానిసత్వం కనిపిస్తుంది. బానిసను తెలియజేయడానికి ఆ కాలంలో దాసి అనేపదం ఉపయోగించేవారు. యజమానుల అవసరాలన్నింటికి ఉపయోగపడేవారు దాసులు, దాసీలు. అల్లూరుశాసనంలో బౌద్ధగుహాలయాలకు దానం చేయబడిన వస్తువులలో దాసదాసీల ప్రసక్తి ఉంది. బౌద్ధసన్యాసులకు దానం చేయబడిన వాటిల్లో రాగిపాత్రలు, పశువులు, మరికొన్ని వస్తువులతో పాటుగా, కొంతమంది స్త్రీలు కూడా ఉండేవారు. ముగ్గురు లేదా నలుగురు స్త్రీలను దాసీలుగా దానం పొందేవారు. దానం పొందినవారికి సమస్త పనులు ఈ దాసీలు చేసేవారు. కాలక్రమేణా కొంతమంది బౌద్ధసన్యాసులు ఈ దాసీలను లైంగిక సంబంధ విషయాలలో కూడా వాడుకోదగిన స్త్రీలుగా వీరిని చూడడం జరిగింది. బౌద్ధసన్యాసులు చనిపోయిన తర్వాత వారికి కట్టించిన స్థూపం ఒకగదిలోఉంటే మరొకగదిలో భజన, చనిపోయినవారిని తలచుకుని మౌనం పాటించడం మొదలైన కార్యక్రమాలు జరిగేవి. వీటన్నింటిని దాసీలు నిర్వహించేవారు. ఈ విధంగా బౌద్ధారామాలు ఉండేవి.

**వైదికమతం**

ఇదేవిధంగా వైదికమతంలో కూడా గుళ్ళుగోపురాలు నిర్మించి, అందులో విగ్రహాలను పూజించుట ప్రారంభించారు. వైదికమతంలో మొట్టమొదట విగ్రహారాధన లేదు. కాలక్రమేణా వైదికమతం కొన్ని విషయాలలో బౌద్ధమతాన్ని అనుసరించినట్లు తెలుస్తుంది. వాటిల్లో విగ్రహారాధన, దేవాలయ నిర్మాణం, ఆలయాల్లోని కార్యక్రమాలు నిర్వహించుటకు మనుషుల ఆవశ్యకత మొదలైనవి. ఆలయ కార్యక్రమాలు అనగా విగ్రహాలను అలంకరించడం, ప్రసాదాలు తయారుచేయించడం నైవేద్యాలు పెట్టడం, పూజా మంత్రాలు, శ్లోకాలు చదవడం,



అర్చనలు చేయడం, నాట్యం చేయడం, పాటలు పాడటం, భజన చేయడం, ఆలయ ప్రాంగణం శుభ్రంచేయడం మొదలైనవి. వీటిని స్త్రీ పురుషులు ఇద్దరూ చేసేవారు. పూజాకార్యక్రమాలు చేసేవారిని పూజారులు అని, ఆలయాల్ని శుభ్రంచేసే పురుషులను మానులు అని, స్త్రీలను దాసీలని పిలిచేవారు. వీరు దేవుళ్ళకు దాసీలు కాబట్టి వీరిని దేవదాసీలు అని పిలిచేవారు. ఋగ్వేదకాలంలో స్త్రీలు ఇళ్ళల్లో పూజాసమయంలో మంత్రాలు, శ్లోకాలు చదవడం, పాటలు పాడటం చేసేవారు. స్త్రీలు చిత్తశుద్ధితో చేస్తారు, కాలనియమాన్ని బాగా పాటిస్తారనే నమ్మకం ఆరోజుల్లోనే ఉండేది. అందుకనే ఇటువంటి పనులన్నీ కూడా స్త్రీలే చేసేవారు.

**ఉపనిషత్తులు**

భారతదేశంలో ఉపనిషత్తులకాలంలోనే దాసీత్వం అనేది కనబడుతుంది. ఇందుకు ఉదాహరణగా 'సత్యకామజాబాలి' కథను చెప్పుకోవచ్చు. జాబాలి అనే స్త్రీకి కొడుకు పుడతాడు. అతనికి సత్యకామ అనిపేరు పెడుతుంది. అతని విద్యాభ్యాస సమయంలో గురువు

అతని గోత్రం అడుగుతాడు. దానికి ఆమె తన పేరు, కొడుకు పేరు కలిపి సత్యకామజాబాలి అని గోత్రాన్ని చెబుతుంది. ఎందుకంటే ఆమెకు తన కొడుకు ఎవరి వలన పుట్టింది తెలియదు. ఆమె చాలామంది దగ్గర దాసీగా పనిచేసింది. వారందరు ఆమెను లైంగిక పరమైన విషయాలలో వాడుకున్నారు. అందుచే ఆమె గర్భవతి అయి పుత్రునికి జన్మనిచ్చింది.

క్రీ.శ. 8వ శతాబ్దం నుండి శాసనాలలో దేవదాసీలకు సంబంధించిన వివరాలున్నాయి. అంతేగాకుండా శాసనాలలో సానులు, మానులు అనేపదాలు కనిపిస్తాయి. దేవాలయాలకు దానం చేయబడిన ఆడదాసీలను సానులు అని, మగదాసీలను మానులు అని పిలిచేవారు. అంటే ఒకప్పుడు దేవాలయాలకు ఆడవాళ్ళతో పాటుగా మగవాళ్ళని కూడా దానం చేసేవారు. దీనినిబట్టి ఆ రోజులలో మగదాసీలు కూడా ఉండేవారని తెలుస్తుంది. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో దేవదాసీలను గణికలు, వేశ్యలు అని పేర్కొన్నాడు. మధ్యయుగానికి ముందునుంచి దేవదాసీలు ఉన్నప్పటికి ఒక వ్యవస్థగా ఏర్పడింది మాత్రం ఈయుగంలోనే. ఎందుకంటే ఈయుగం లోనే దేవాలయాల అభివృద్ధి విస్తృతంగా జరిగింది. అంతేగాకుండా ఆరోజులలో దేవదాసీలు లేని ఆలయం ఉండేది కాదు. ఆ సమయంలోనే దేవదాసీలంతా కలిసి ఒక కులంగాను లేదా వ్యవస్థగా రూపొందించబడ్డారు. దేవదాసీ విధానం ఒక వ్యవస్థగా రూపొందిన తర్వాత దీనికి మరింత ప్రాధాన్యం పెరిగింది. ఒక అమ్మాయి దేవదాసీ కావాలంటే కొన్ని అర్హతలు కలిగిఉండాలి. నేటికాలంలో యువతీయువకులు ఉద్యోగాలకోసం అప్లై చేస్తున్నట్లుగా ఆరోజులలో అమ్మాయిలు దేవదాసీలుగా మారడానికి దరఖాస్తు పెట్టుకునేవారు. తదనంతరం సంగీతం, నాట్యం మొదలైన కళలలో ఆరు నెలలపాటు శిక్షణ తీసుకునేవారు. రాజ్యాధికారులచే రికమెండేషన్ చేయించుకునే వారు. ఈవిధంగా ఆరోజులలో అమ్మాయిలు ఎన్నో ప్రయత్నాలు చేసి దేవదాసీలుగా మారేవారు. దీనినిబట్టి మొదట్లో దేవదాసీ వ్యవస్థకు ఎంతటి ప్రాధాన్యముండేదో తెలుస్తుంది. ఇదంతా తెలుగు సాహిత్యం ప్రారంభానికి ముందు దశ.

**తెలుగు సాహిత్యం ప్రారంభమైన తరువాత దశ**

తెలుగుసాహిత్యం ప్రారంభమయ్యే నాటికి (11వ శతాబ్దానికి) దేవదాసీలలో చాలామార్పులు వచ్చాయి. దేవదాసీలు ధనికులతోనూ, రాజులతోనూ సంబంధాలు పెట్టుకోవడం మొదలుపెట్టారు. ఆరోజులలో ధనికులు, రాజులు దేవాలయాలలో పవిత్రంగా ఉండే దేవదాసీలతో సంబంధం పెట్టుకోవడం ఒక హెూదాగా భావించేవారు. అదే రానురాను ఒక సాంఘిక హెూదాగా పరిణమించింది. దేవదాసీలు సంగీతం నృత్యంలో ప్రవీణులు కనుక ఇటువంటి వారిని ఆధీనంలో ఉంచుకోవడం ఆనాటి సంపన్నులకు అలవాటుగా మారింది. సంపన్నుల భార్యలకు మాత్రం ఈ విషయం తెలిసిన కొంతమంది భర్తలను ఎదిరించలేక, మరికొంతమంది భర్తల పురుష లక్షణానికి గుర్తు అని ఊరుకుండిపోయేవారు. క్రీ.శ. 13వ శతాబ్ది నాటికి ఇది విపరీతమైంది. దీంతో సంగీతం నృత్యం మొదలైన కళలు తెలిసినవారు చెడిపోతారనే అభిప్రాయం సంఘంలో ఏర్పడింది.

తెలుగు సాహిత్యంలో దేవదాసీల పేరుతో ప్రస్తావన చాలా తక్కువగా కనబడుతుంది. ముఖ్యంగా ప్రాచీన సాహిత్యంలో దేవదాసీ అనేపదం కనబడదు. కానీ దేవదాసీ విధులు నిర్వర్తించిన దాసీజనం మాత్రం కనిపిస్తారు. ఈ దాసీజనమే ప్రాచీనకావ్యాలలో వేశ్య, సాని, వారకాంత, ఆటవెలది, భోగంవాళ్ళుగా పిలువబడుతున్నారు. అయితే వీరంతా దేవదాసీలేనా? దేవదాసీల కుటుంబాల నుంచి వచ్చినవారా? లేదా దేవదాసీలు, వేశ్యలు ఇద్దరు ఒక్కటేనా వేర్వేరా? అనే అంశాలను పరిశీలించాలి. అలాగే ప్రాచీనసాహిత్యంలో వేశ్య, సాని ఈ పదాలు ఏవిధంగా ఉపయోగించబడ్డాయో తెలుసుకోవాలి.

**సాని**

శాసనాలలో సానులను గూర్చిన వివరాలు గమనిస్తే **'జాయప నాయకుని చేబ్రోలు శాసనంలో చిన్నవయసులోనే అమ్మాయిలను దేవాలయాలకు దానం చేసి వారికి నట్టువుల చేత సంగీత నృత్యకళలో శిక్షణ ఇప్పించినట్లు'** , అలాగే 'పన్నెండవ శతాబ్దానికి చెందిన ఒక శాసనంలో మండరాజు సేనాని అయిన కాపయనాయకుడు దూంబరుత భీమేశ్వరునికి వంద పుట్ల భూమిని దానం చేశాడు. అందులో మసనాసాని, కాపసాని, బ్రహ్మసాని, బల్లసాని, ఎరియసాని మొదలైన సానులకు భూమిని పంచాడు. మధ్యయుగంలో మాదాలచి అనే సానికి జలసింగదేవుని సన్నిధిలో మెట్టధాన్యం పండే భూమిని దానం చేసినట్లుగా **'ఎన్. రామగోపాలరెడ్డిగారి *ఆంధ్రశాసనాలు - సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ*'** అనే సిద్ధాంత వ్యాసం ద్వారా తెలుస్తుంది.

'సాని శబ్దం సాహిణి, స్వామినీ అనే రెండు శబ్దాల నుండి వచ్చింది. ఎక్కువ ఇళ్లపేర్లలో కనిపించే సాని శబ్దం 'సాహిణి' – శబ్దం నుండి వచ్చింది. అల్లసాని వంటి పేర్లలో కనిపించేది ఇదే. పెద్దనగారి పూర్వులు సాహిణీ మారమంత్రులుగా పనిచేశారు. అందుకే ఇంటిపేరులోని సాని (సాహిణి శబ్దభవం) చేరింది. ఇక లక్కమసాని, దొరసాని వంటి స్త్రీవాచక శబ్దాలలో కనిపించే సానిశబ్దం స్వామినీ – శబ్దభవం. ఇది యజమానురాలనే అర్థంలో వచ్చింది. దొరభార్యను దొరసాని అనో, దొరసానమ్మ అనో పనిపాటలు చేసుకునే వాళ్ళు పిలవడం మనం చూసేదే. కాలక్రమంలో ఆ స్వామిని ఆధీనంతో పెట్టుకున్న వేశ్యకు సాని–శబ్దం పర్యాయపదమైంది. ఇది కాలంలో జరిగిన అర్థవిపరిణామం' అని ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లుగారు ***ప్రాచీన సాహిత్య సమాలోచన*** అనే రచన ముందుమాట (అభినందన) లో ప్రస్తావించారు. మధ్యయుగంలో సాని అనేపదం అన్ని కులాల స్త్రీలకు ఉపయోగించేవారు. తదనంతరం కూడా చాలా కులాలలో

సాని అనే పదం చేరింది. ఉదా. రెడ్డిసాని, కాపుసాని. సాని అంటే స్వామిని అని గౌరవప్రదంగా గుర్తించారు.

అయితే దేవాలయ శాసనాలలో పవిత్రంగా కనిపించిన సాని అనే పదం తెలుగుసాహిత్యంలో అంత పవిత్రంగా చూపబడలేదు. దీనికి గలకారణం శాసనాలలో దేవదాసీ వ్యవస్థ ఎనిమిది, తొమ్మిది శతాబ్దాల నుండి ఉన్నది. ఆలయాల్లో దీపధూపాది సేవలతో, పాలనా వ్యవహారాల నిర్వహణలో దాతల దాన వివరాల కొనసాగింపుతో ఆలయంలోని దేవుని తరువాత దేవత వలె కనిపించారు దేవదాసీలు. క్రీ.శ.12,13 శతాబ్దాల నాటికి దేవాలయాలలోని దేవదాసీలు దేవాలయం వెలుపల వ్యక్తులతో లైంగిక సంబంధాలు పెట్టుకున్నారు. వీరి వృత్తిలో అపశ్రుతి కనిపించింది. వీరికి సంపాదన పెరిగింది. సంతానవతులు అయ్యారు. ఈ మార్పులు దేవదాసీ వ్యవస్థలో రాకూడనివి. కాలాన్ని అనుసరించి ఇలాంటి మార్పులు దేవదాసీ వ్యవస్థలో వచ్చాయి. ఈ సందర్భంలోనే సాని అనే పదానికి ఉన్న గౌరవం తగ్గుతూ వచ్చింది. దేవదాసీ వ్యవస్థలో ఇలాంటి మార్పులు వస్తున్న సమయంలో తెలుగుసాహిత్యం ప్రారంభమైంది. తెలుగు సాహిత్యం ప్రారంభ సమయానికే వీళ్ళు నీతిమాలినవాళ్ళుగా భావించబడ్డారు. ఈ అర్థంలోనే సాని అనేపదాన్ని తెలుగుసాహిత్యంలో ఉపయోగించారు. దీనినిబట్టి మధ్యయుగంలోని సాని అనే మాటకు ఉన్న ప్రాముఖ్యత తెలుగు కావ్యాలలో ఉపయోగించిన సాని అనే మాటకు లేదని తెలుస్తుంది. దీనికి కారణం దేవదాసీ వ్యవస్థలో వచ్చిన మార్పులు అని చెప్పవచ్చు.

**వేశ్య**

వేశ్య అనేపదాన్ని మొదట్లో **'దేవాలయానికి సమర్పించబడిన అమ్మాయి'** అనే అర్థంలో వాడేవారు. వేశ్య అంటే సమర్పించబడిన అమ్మాయి అని అర్థం. దేవాలయానికి సమర్పించబడిన అమ్మాయిని దేవవేశ్య లేదా దేవదాసీ అని పిలిచేవారు. అంతటి పవిత్రార్థం వేశ్య అనేపదానికి మొదట్లో ఉండేది. కాలక్రమేణా దేవదాసీలలో వచ్చిన మార్పుల ఫలితమే వేశ్య పదాన్ని నిందార్థంలో వాడుతున్నారు. అంతేగాకుండా ప్రాచీనకావ్యాలలోనూ, ప్రబంధాలలోనూ వేశ్యావర్ణనలు అనేకం ఉన్నాయి శైవసాహిత్యంలో వేశ్యలు కనిపిస్తారు. ఈ వేశ్యలలో మొదట దేవదాసీలుగా ఉండి ఆ తర్వాత వేశ్యలు లేదా వారకాంతలుగా మారినవారు ఉండవచ్చు.

*బసవపురాణం*లో ముగ్ధసంగయ్య కథలో బసవేశ్వరుడు ఎవరు ఏదీ కోరితే అది ఇస్తాడు కామసుఖాపేక్షితులైన శివభక్తులు స్త్రీలను కోరినా వారికిచ్చేవారు పైగా వారికి..

**"ముప్పూట నోగిరంబులు బదార్థములు**
**దప్పక కావళ్ళ నెప్పుడు బంప**
**వెండి వేశ్యల యిండ్ల నుండి భోగించు**
**మిండ జంగములు పండ్రెండు వేలనిన"**



వీరశైవంలో మద్యసేవనం, మాంసభక్షణం, వారవనితా సంగమం తప్పులేని అలవాట్లుగా ఉండేవి. బసవేశ్వరుడు **"కావళ్ళలో ముప్పూట ఓగిరములు పంపుతుండగా"** పన్నెండు వేలమంది మిండజంగములు వేశ్యల ఇళ్ళల్లో ఉండి భోగించేవారని బసవపురాణంలో ఉంది. జంగాలలో మిండజంగాలు వేశ్యాలోలురై వారి ఇళ్ళల్లోనే విహరించిన కారణంగా వీరిని మిండజంగములని పిలిచేవారు. **'బసవపురాణంలో పేర్కొనబడిన ఈ వేశ్యలు శైవదేవాలయాలలోని దేవదాసీలు. అప్పటికే శైవపూజారులకు శైవదేవాలయాల దేవదాసీలకు లైంగిక సంబంధం ఏర్పడి ఉండవచ్చు.'** (రామగోపాల్ రెడ్డి, యన్. ఆంధ్రశాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ. 55)

***బసవపురాణం***లో మరొక కథ చూస్తే బసవేశ్వరుడు తనభార్య చీరను శివభక్తునికి ఇవ్వటం జరుగుతుంది. 'ఒక విటుడు వేశ్య ఇంటిలో ఉండి **"బసవేశ్వరుని యొద్దకేగి నిత్యము పడిని దెమ్ము"** అని తన సేవకుణ్ని పంపిస్తాడు.

బసవేశ్వరుని ఇంటికి వెళ్ళినపుడు బసవేశ్వరుని భార్య కట్టిన చీర చాలా మనోహరముగా ఉందని సేవకుడు వేశ్యతో అంటాడు. దాంతో ఆ చీర తనకు కావాలని విటుణ్ని వేశ్య కోరుతుంది. వేశ్య కోరిక తీర్చడానికి విటుడు బసవేశ్వరుణ్ని అడుగుతాడు. బసవేశ్వరుడు భక్తుని కోరిక తీర్చడానికి తన భార్యను చీర తీసి ఇవ్వమని అడుగుతాడు. భర్త ఆజ్ఞ మేరకు ఆమె ఆ చీర తీసివేయగానే మరొక చీర ఆమె ఒంటిమీదకు వస్తుంది. అదీ తీయగానే వేరొక చీర....అలా చీరలు ఒకదాని తర్వాత మరొకటి వస్తూనే ఉంటాయి. (ద్రౌపదీ వస్త్రాపహరణం లాగా) వాటిలో మోయగలిగినన్ని చీరలు తీసుకుని వెళ్ళి విటుడు వేశ్యకు ఇవ్వటం జరుగుతుంది'. (వేంకటరావు, నిడదవోలు. 1981: 12)

పండితారాధ్య చరిత్రలో వేశ్యాజీవనంలో భిన్నత్వం కనిపిస్తుంది. **"ప్రౌఢవతి అనే వేశ్య గురుభక్తాందారిని తిరస్కరించి, వేశ్యల పొందు వల్ల శీలభంగము, కళ్ళు కనిపించకపోవడం, వ్రతభంగం,**

**నవ్వులపాలు కావడం, మనసు తాపము, ధనహాని, ముక్తికి దూరం కావడం అనే ఏడువిధాల నష్టాలున్నాయని చెప్పింది."** (జ్యోతి, పి. 2006:1) ఈ విధమైన భిన్న మనస్తత్వం కలిగిన వేశ్యలు కూడా కనిపిస్తారు.

శైవయుగానంతరం సాహిత్యంలో శ్రీనాథుని వరకు దేవదాసీలు లేదా వేశ్యలు అంతగా కనబడరు. అక్కడక్కడ సానుల గూర్చి ప్రస్తావన వస్తుంది. 'శ్రీనాథుడు సానివాడను వర్ణిస్తూ రాసిన పద్యంలో

**"పదునాల్గు మహాయుగముల**
**ముదకగు భీమేశ్వరునకు మొగచాటైయుం**
**దదు సానిపెండ్లి యెప్పుడు**
**నది దక్షారామ మహిమ మగునోకాదో"**

ద్రాక్షారామ భీమేశ్వరునికి సానులనిచ్చి పెళ్ళి చేయడం జరుగుతుంది.' (పైదే. 63) దాతలు, తల్లిదండ్రులు యువతులను దేవాలయానికి దానమిచ్చి, దేవునితో పెళ్ళి జరిపిస్తున్నారు. శ్రీనాథుని కాలం (15వ శతాబ్దం) నాటికి కూడా ఇంకా అమ్మాయిల్ని దేవాలయాలకు దానమిచ్చి దేవదాసీలుగా లేదా సానులుగా చేస్తున్న విషయం తెలుస్తుంది.

ధూర్జటి ***శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము*** చతుర్థాశ్వాసంలో వేశ్యలున్నారు. వీరు మామూలు వేశ్యలు కారు. కాళహస్తీశ్వరున్ని దర్శించి తరించాలనే భక్తితాత్పర్యాలు గలవారు. మధురాపురిలోని మాణిక్యవల్లి అనే వేశ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి వృత్తాంతం ఇందులో ఉంది. మాణిక్యవల్లికి డబ్బుసంపాదన అంటే మక్కువ ఎక్కువ. ధనముంటే శివునికి అఖిలోపచారములు చేయవచ్చునని ఆమె అభిప్రాయం. కాని ఈమె కుమార్తెలు మాత్రం దానికి విరుద్ధంగా కనిపిస్తారు. వీరికి శివభక్తి ఏర్పడడానికి కారణం **"జననాంతరవాసన"** అని ధూర్జటి పేర్కొనడం జరిగింది. ముందుజన్మలో వీరు తప్పక దేవదాసీలై ఉంటారు. ప్రస్తుత జన్మలో వేశ్య కడుపున పుట్టినా వీరికి గతజన్మ సంస్కారం వలన శైవభక్తి అబ్బి ఉంటుది. అలాగే శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము మొదటి ఆశ్వాసంలో శివుడు మాయా జంగముడై ఒక వేశ్య ఇంటికెళ్ళి ఆమెతో సుఖించే కథ ఒకటి ఉంది. ఈ దాసికి నారాయణవనం పాలకుడైన యాదవరాజు కొలువులో ఉద్యోగం ఉంది. ఆమెకు జంగములంటే సాక్షాత్తు శివుడు అన్నంత భక్తి ఉంది. శివుడు రాజభక్తిని పరీక్షించాలని మాయా జంగముడుగా వచ్చాడు. ఈ కథను బట్టి ఈ దాసి దేవదాసి అయివుండవచ్చు. దేవదాసీగా శివభక్తి, రాజభక్తి ఈమెలో ఉన్నాయి. దేవదాసీలు దేవాలయాలకే పరిమితం కాకుండా రాజాంత:పురాలలో కూడా పనిచేసే వారనడానికి ఈమె కథ నిదర్శనం. జంగముడు శివుడు అవతారమని నమ్మి ఆ దాసి అతనికి ఆతిథ్యమిచ్చింది. భక్తి పరవశమై తనను తాను సమర్పించుకున్నది. ఈ లక్షణం భక్తిలో పరాకాష్ట. ఒకప్పుడు దేవదాసీలు ఇలా కూడా ఉండేవారు.

అలాగే ధూర్జటి ***శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము*** లో వారవనిత అనేపదం కూడా కనిపిస్తుంది.

**'స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేలగల్గె నీ**
**యతులిత మాధురీ మహిమ....**

అని శ్రీకృష్ణదేవరాయల వారు ఇచ్చిన సమస్యను తెనాలి రామకృష్ణుడు పూరించిన విధానం చూస్తే ...

**... హా! తెలిసెన్ భువనైక మోహనో**
**ద్ధత సుకుమార వారవనితా జనతా ఘనతాపహార సం**
**తత మధురాధరోదిత సుధారసధారల గ్రోలుటం జుమీ!"**

అని సమాధానం కనబడుతుంది. ఈ సందర్భంలో ఒకచిన్నకథను చెప్పుకోవచ్చు. తెనాలి రామకృష్ణుడు పై సమస్యను పూరించడానికి పక్షం రోజులు సమయం తీసుకుంటాడు. ఆ పక్షం రోజులు తెనాలి రామకృష్ణుడు ధూర్జటి ఇంటిముందు మారువేషంలో తిరుగు తూంటాడు. ధూర్జటి దినచర్యను ప్రతిరోజు గమనిస్తుంటాడు. "ధూర్జటి ప్రతినిత్యం పంచపంచ ఉష:కాలాన లేచి, కాలకృత్యాలను ముగించుకొని శివదీక్షకు కూర్చొని ఒకటొకటిగా స్తోత్ర నివేదన, భస్మస్నానం, భస్మధారణం, రుద్రాక్షధారణం, సంధ్యావందనం, లింగార్చనం, ఇష్టదేవతారాధనం, నైవేద్యం పూర్తికాగానే కొద్దిసేపు విశ్రమించి ఆ తర్వాత భోజనభాజనాదులు ముగించుకొని, ఆస్థాన ప్రవేశానికి ఆవశ్యకమైన తీరున పండిత వేషాన్ని ధరించి కొలువుకు వెళ్లి వస్తుండటం, ఇంటికి రాగానే మరుసటినాడు సభలో వినిపించవలసిన గ్రంథ భాగానికి సమాయత్తమవుతుండటం మూలాన రామకృష్ణుడికి పెద్దగా పనికి వచ్చే ఆచూకీలేవీ పొడచూప లేదు. పక్షాంతం కావచ్చే సమయానికి అన్నాళ్ళుగా పడుతున్న శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరై, రాజుగారికిచ్చిన మాట తప్పేట్లున్నదని భయపడుతున్న తరుణంలో రామకృష్ణుడు ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ధూర్జటి కొలువు నుంచి తిరిగి రాగానే కొంతసేపు సేదతీరి, మునిమాపు వేళయేసరికి డాబు, దర్పం మీరిన భోగరాయ వేషాన్ని ధరించి, ఇంటినుంచి బైటపడి, పదేపదే అటూయిటూ చూసుకొంటూ – నాగవాసం దారి పట్టాడట. రామకృష్ణుడు ఆయనను అనుసరిస్తూ ఆయన ఇంటిలోకి వెళ్ళాక, బయట అరుగు మీద చేతిని తలక్రింద దిండుగా అమర్చుకొని రాత్రంతా అక్కడే తీరికగా విశ్రమించాడట. ధూర్జటి తెల్లవారుజామున తలుపు తెరుచుకొని బయటకి వచ్చి అరుగు మీదున్న రామకృష్ణుణ్ణి చూసి గుట్టు రట్టయిందని గ్రహించి, ఇక చేసేదేమీ లేక, దైవం మీద భారం వేసి ఇల్లు చేరుకొన్నాడట." (మురళీధరరావు, ఏల్చూరి. 2014:1) అదే రోజు రాయల సభకు వెళ్ళి రామకృష్ణుడు పైన చెప్పినవిధంగా సమస్యకు చమత్కార పూరణ చేశాడు. ఈ విషయం వలన ధూర్జటికవి వేశ్యాలోలుడు అని తెలుస్తుంది. అంతేగాకుండా ధూర్జటికవి మనుమడైన కుమార ధూర్జటి అభిప్రాయం ప్రకారం

"ధూర్జటి మహాకవి వేశ్యాలోలుడైనంత మాత్రమున అతని భక్తికిగాని, వాక్శుద్ధికి గాని, కీర్తికిగాని ఎట్టి భంగము కలుగదు. ఈ విషయమున మనము శ్రీనాథులను తార్కాణులుగా గ్రహింపవచ్చును. వేశ్యాస్నేహము సుకవులకు గుణాదాయకముగాని, దోషావహము కానేరదు. రక్తిపాకము పొందిన పిదపనే భక్తి. **'విషయాన నివర్తన్తే నిరాహారస్య దేహిన:'** అను భగవద్గీతోక్తి ననుసరించి 'కామిగాక మోక్ష కామి' యగుట యసంభవమనుట స్పష్టము" (రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ 1966: 5,6.) దీనినిబట్టి ఆరోజులలో వేశ్యలు లేదా వారకాంతలు రాజులకు, సంపన్నులకే కాక కవిపండితులకు కూడా లైంగికంగా ఉపయోగపడేవారని తెలుస్తుంది.

దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర ప్రథమభాగంలో విప్రనారాయణ చరిత్ర కలదు. ఇందులో కూడా వేశ్యల ప్రస్తావన కనిపిస్తుంది. శ్రీరంగ క్షేత్రమున విప్రనారాయణుడను వైష్ణవ బ్రహ్మచారి ఉండేవాడు. ఆ ఊరిలోనే దేవదేవి అనే వేశ్య కూడా కలదు. ఒకరోజు దేవదేవి విప్రనారాయణుని చూసి "ఈ వైష్ణవభక్తుని మత్పాదదాసునిగా జేసేదనని యామె ప్రతిన గైకొనెను. ఎట్లో వంచన చేసి, యా వీర వైష్ణవుని మనసు కరిగించి యాతని తన దాసునిగా దేవదేవి చేయగలిగెను. వలపు రెకెత్తినంతనే యా ఘోటక బ్రహ్మచారి, సానిదాని సొత్తు విడువలేక యామెతో గూడ సానివాడ కేగెను. దేవదేవి రాజగోపాలస్వామి సేవకురాలు. ఆమెయు నామె యక్కయు బూర్వ జన్మమున దివ్యాంగనలనియు 'ద్విజనందనునకు నిజనందన రసావేశంబు గల్పింప' శౌరియే వారిని వారాంగనలుగా పుడమిని సృజించెను" (రామనరసింహము, కాకర్ల. 1955: 115, 123, 124) దీనినిబట్టి దేవదేవి అనే వేశ్య రాజగోపాలస్వామి ఆలయము లోని దేవదాసీ అయిఉండవచ్చు. లేదా నాట్యరూపంలో ఆస్వామిని కొలుస్తుండవచ్చు. దేవదాసీల పని కూడా నాట్యరూపంలో దేవుణ్ణి ఆరాధించడమే.

ప్రాచీన కావ్యాలలో పురవర్ణనలలో ఎక్కువగా వేశ్యావర్ణన కనిపిస్తుంది. క్రీడాభిరామం సీసపద్యంలో ఒక వేశ్య దేవాలయంలో దీపారాధన... మొదలైన పనులు చేస్తుంది. ఈ విషయాల్ని బట్టి కావ్యాలలోని వేశ్యలే దేవాలయాలలోని ఒకప్పటి దేవదాసీలు అని తెలుస్తుంది. అయితే కావ్యాలలో కనిపించే వేశ్యలంతా దేవదాసీలు కానవసరం లేదు. ప్రబంధాల కాలం నాటికి వేశ్యలకు ఒక కులం ఏర్పడింది. అదే వేశ్యాకులం లేదా భోగం కులం. ప్రబంధాలలో వేశ్యలకు సంబంధించిన వర్ణనలు అనేకం కనిపిస్తాయి. విజయనగర యుగసాహిత్యంలో కనిపించే వేశ్యలు ప్రాచీనకాలం నాటి దేవదాసీల వారసులుగా కనబడతారు. కాలక్రమేణా వీరిలో భక్తిభావం తగ్గిపోయింది. రాయల యుగంలో దేవాలయాలు ఉన్నాయి. ఉత్సవాలు, పూజాకార్యక్రమాలు మొదలైనవన్నీ జరిగేవి. వీటన్నింటిని చూసుకోవడానికి దాసీలుండేవారు. అయితే దేవాలయ దాసీలు



అంత:పురాలకు, అంత:పుర దాసీలు దేవాలయాలకు మారుతుండే వారు. వీరి కాలంలో చాలామంది నర్తకీమణులు తిరుపతి దేవస్థానానికి పంపబడినట్లు దేవస్థానంవారు ప్రకటించిన శాసనాన్ని బట్టి తెలుస్తుంది.

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని నాలుగాళ్ళ మంటపాలలో ఒకప్పుడు దేవదాసీలు నాట్యం చేసేవారు. క్రీ.శ.13వ శతాబ్దం నుండి దేవదాసీలు తిరుమలలో 'విలాసినీ' అనే నృత్యాన్ని ప్రదర్శించేవారు. ఈ విధంగా నృత్యాన్ని ప్రదర్శించే దేవదాసీలను విజయనగర రాజులు 'ఎంపెరు మానదీయర్ ' అని పిలిచేవారు. వీరినే తిరువీధుల సానులు అని కూడా పిలిచేవారు. సెప్పసాని, శేష్పసాని, ఎక్కు, ఆమె కూతురు నాచ్చి, కుప్పసాని, తిప్పసాని, తిరువేంకట మాణిక్యం, లింగసాని మొదలైనవారంతా తిరుమల ఆలయంలో సేవలు చేశారు. మొదట దేవునిసేవకు మాత్రమే పరిమితమైన ఈ దేవదాసీలు తర్వాత దేవాలయాలపై పెత్తనం చేసే రాజుల సేవకు కూడా వినియోగింపబడ్డారు. రాజుల ముందు నాట్యం చేసి వారి మనసుకు ఆనందం కలిగించడం మాత్రమే కాకుండా శారీరకంగా కూడా దేవదాసీలు రాజులను సంతృప్తి పరచాల్సి వచ్చింది. తదనంతరం రాజు యొక్క పరివారానికి, అలాగే ఊరి పెద్దలకు, సంపన్నులకు అందరికీ... దేవదాసీలు సేవలు అందించాల్సి వచ్చింది. **'కళలకు, దేవుడి సేవకు మాత్రమే పరిమితమైన దేవదాసీలు పదమూడు, పద్నాలుగు శతాబ్దాల కాలానికి శరీరాన్ని అమ్ముకునే స్థాయికి వచ్చారు. ముస్లింల వల్ల రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. రాజ్యం, ప్రజల ఆర్థిక పరిస్థితి దిగజారింది. సమాజంలో విలువలు పడిపోయాయి. ముఖ్యంగా విజయనగర రాజుల పాలన మధ్యకాలం నుంచి వీరి సంప్రదాయ కళను పోషించే పాలకులు, ఆలయాలు, సమాజం లేకపోయింది. దేవదాసీలు పేదరికానికి బలై వీరి సంప్రదాయం దిగజారడంతో వీధిసానులుగా మారిపోయారు. వీరు గుడిసానులై, గుడిసేటిలై చిన్నచూపు చూడబడ్డారు. చివరకు వేశ్యలుగా పిలువబడుతున్నారు.'** (శ్రీనివాసులు రెడ్డి, పేట. 2014: 54)



**పాశ్చాత్యుల ప్రభావం**

పాశ్చాత్యుల రాకతో మనసంస్కృతిలో విపరీతంగా మార్పులు వచ్చాయి. ఆంగ్లేయుల రాకతో దక్షిణభారత దేశ సంస్కృతిలో చాలా మార్పులు వచ్చాయి. ప్రజలలో దైవభక్తి తగ్గి హేతువాద దృష్టి వచ్చింది. దేవాలయ సంస్కృతి విచ్ఛిన్నమవుతూ వచ్చింది. అందులో భాగంగా దేవదాసీవ్యవస్థలో కూడా మార్పులు వచ్చాయి. దేవాలయాలలో పనిచేసే దాసీల సంఖ్య అంటే దేవదాసీల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. దీనికి గలకారణం ఆంగ్లప్రభుత్వం దేవదాసీల ఆస్తులను స్వాధీన పరచుకోవడం. కాలక్రమేణా దేవదాసీలకు జీవనభృతి కరువైంది. దీంతో జీవనభృతికోసం వీరు వేశ్య వృత్తిని చేపట్టారు. దేవదాసీ వేశ్యగా మారే కాలానికి తెలుగు సాహిత్యం ప్రారంభమయింది. అందుకే ప్రాచీన కావ్యాలలో దేవదాసీ అనేపదం కనిపించదు. వేశ్య అనే పదమే కావ్యాలలో వాడబడింది. ఈ కావ్యాలలో కనిపించే కొంతమంది వేశ్యలలో మొట్టమొదట దేవదాసీలుగా ఉండి ఆ తరువాత వేశ్యలుగా మారినవారు ఉండవచ్చు లేదా దేవదాసీ సంతతివారైనా కావచ్చు. ఎందుకంటే ఈ వేశ్యలలో దేవదాసీల స్వభావాలు కనిపిస్తాయి. అలాగే దేవదాసీలు నిర్వర్తించే విధులను వీరు కూడా నిర్వర్తిస్తుంటారు. ఉదాహరణకు వేశ్యలు దేవాలయాలో చేసే పనులు **"మహనీయ దేవ గంధర్వాప్సరో వేశ్యాజాతి... చామర వ్యంజన వీటికా కరండ పాదుకాముకుర దీపికా సంగీత నాట్యాద్యుపచార సేవా విశేషంబుల ప్రతి సంధ్యంబును బల్యంకికా సేవా బహిర్విజయాది భోగావసర సమయంబున సేవించుచుండుదురు"** అని వచనఖండంలో వేశ్యలు భీమనాధుని వింజామరలతో విసరడం, దీపాలు పెట్టడం, సంగీతనాట్యాది సేవలు చేయడం, పల్లకి మోయడం మొదలైన పనులు చేసినట్లు కనిపిస్తుంది. ఇవన్నీ దేవుని భోగావసరాలు కూడా అని ఈ వచనం పేర్కొంటున్నది. దీనినిబట్టి వేశ్యలు, భోగంవారు దేవదాసీలేనని తెలుస్తుంది. (రామగోపాల్ రెడ్డి, యన్. *ఆంధ్రశాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ.* 61)

తెలుగు సాహిత్యంలోని వేశ్యలే ఒకప్పటి దేవదాసీలని అర్థమవుతుంది. అయితే కావ్యాలలో కనిపించే వేశ్యలంతా దేవదాసీలు కానవసరం లేదు. వేశ్యలకు వివాహ అర్హత రావడానికి గల కారణం ఆరోజులలో దేవదాసీలుగా సంఘంలో వారికుండిన గౌరవప్రదమైన గుర్తింపు. మధ్యయుగంలో దేవదాసీలను సంపన్నులు పెళ్ళి చేసుకునే పద్ధతి కూడా కనిపిస్తుంది. మధ్యయుగం వరకు ప్రధానంగా ఉన్న దేవదాసీ వ్యవస్థలో తదుపరి కొన్ని మార్పులు వచ్చి తెలుగు సాహిత్యం ప్రారంభం నాటికి దేవదాసీ వ్యవస్థ వేశ్యావ్యవస్థగా మారి రాను రాను చివరికి పతనస్థితికి చేరుకుంది.

**వ్యాస పరిమితి**

దేవదాసీలు ప్రాచీన తెలుగుసాహిత్యంలో చాలావరకు వేశ్యలు గాను, వారకాంతలుగాను, సానులుగాను పిలువబడుతున్నారు. ఈ వ్యాసానికిగానూ పాల్కురికి సోమన *బసవపురాణం, పండితారాధ్య చరిత్ర,* శ్రీనాథుని *క్రీడాభిరామం, భీమేశ్వర పురాణం,* ధూర్జటి *శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము (చతుర్థాశ్వాసం), దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర ప్రథమభాగం (విప్రనారాయణ చరిత్ర)* గ్రంథాలను మాత్రం అధ్యయనం చేసి అందులోని వేశ్యల, సానుల, వారకాంతల ప్రస్తావన వచ్చిన కొన్ని సందర్భాలను చర్చించడం జరిగింది.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. జ్యోతి, పి. సెప్టెంబర్, 2006. *పాల్కురికి సోమనాథుని సాహిత్యంలో వేశ్యావ్యవస్థ(వ్యాసం).* ఈమాట వెబ్‌మ్యాగజైన్.
2. మురళీధరరావు, ఏల్చూరి. జనవరి1, 2014. *స్తుతమతియైన యాంధ్రకవి వ్యాసం.* మాలిక పత్రిక.
3. రామగోపాల్ రెడ్డి, యన్. *ఆంధ్రశాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ.* (సిద్ధాంతగ్రంథం)
4. రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, వి. 1966. ధూర్జటి *శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము (ప్రథమాశ్వాసం లఘుటీకా).* వావిళ్ళ ప్రెస్. మద్రాసు.
5. వెంకటరామ నరసింహము, కాకర్ల. 1955. *దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర (ప్రథమభాగం).* యమ్. ఎస్. ఆర్. మూర్తి అండ్ కో. విశాఖపట్టణం.
6. వేంకటరావు, నిడదవోలు. 1981. *బసవపురాణం.* భ్రమరాంబా మల్లికార్జున దేవస్థానము. శ్రీశైలం.
7. శ్రీనివాసులు రెడ్డి, పేట. సెప్టెంబర్ 24, 2014. *తిరుపతి కథలు వ్యాసం (తిరుమల దేవదాసీలు).* నవ్యపత్రిక.
8. పాల్కురికి సోమనాథుడు – *బసవపురాణం, పండితారాధ్య చరిత్ర*
9. శ్రీనాథుడు – *క్రీడాభిరామం, భీమేశ్వరపురాణం*
10. ధూర్జటి – *శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము (చతుర్థాశ్వాసం).*

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2022

గ్రంథాంతరంగం 10

# స్వారోచిష మనుచరిత్ర టీకా తాత్పర్య వ్యాఖ్య

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

సి.పి. బ్రౌన్ మహాభాగుడు (1798–1884) నిజంగా 'తెలుగు సూర్యుడే' (ఇది నా ప్రియ మిత్రుడు కీ. శే. బంగోరె అన్న బంగారు మాట). కాకపోతే ఏండ్లుపూండ్లుగా చీకటి గుయ్యారాల్లోనూ, పూజామందిరాల్లోనూ, కరణీకుల ఇళ్లల్లోని అటకల మీదనూ, రైతుల ఇండ్ల దొంతికుండల్లోనూ, జమీందారుల దేవిడీల గ్రంథాలయాల్లోనూ ఎండకన్నెరుగకుండా పడివున్న తాళపత్ర, కాగితపు ప్రతులు బ్రౌను దొర భగీరథ ప్రయత్నం లేకుండా వెలుగుచూడగలిగేవా? తెలుగు కావ్యాల్ని చదవాలని తహతహలాడే సాహిత్యప్రియుల జ్ఞానదాహం తీరగలిగేదా? వందలాది మంది దరిద్రనారాయణులకు అక్షరభాగ్యం లభ్యమయ్యేదా? ఏదేమైనా కానివ్వండి, ఆయన పూనిక వల్ల, దీక్షా తత్పరత కారణంగా, నిస్వార్థ ఫలితంగా ఆబాలగోపాలానికి ఎన్నో తెలుగు కావ్యాలు, పురాణాలు, శతకాలు వగైరా చేరగలిగాయి. పుస్తక ప్రియులు చదువుకొనడానికీ, కొని చదవడానికీ వీలు కాగలిగింది.

సి.పి. బ్రౌను మార్గదర్శకత్వంలో బ్రౌను కాలేజి పండితుల సరస పాండిత్యాల సత్ఫలంగా ఎన్నో కావ్య పురాణ శతకాలు పరిష్కృతమై, టీకలతో సహా లభించడం మన తెలుగుజాతి అదృష్టమూ పుణ్యఫలమూనూ.

ఎన్నో తెలుగు కావ్యాల్ని సముద్ధరించిన మహనీయుడు సి.పి. బ్రౌన్. ఆయన ప్రాచీన తెలుగు కావ్యాల్ని సేకరించి పండిత ప్రవరులతో పాఠపరిష్కరణ చేయింపచేసి, టీక రాయింపచేశాడు. అల్లసాని పెద్దన రచించిన **'స్వారోచిష మనుచరిత్ర'**కు బ్రౌన్ కాలేజి పండితులు కొంతమంది పాఠ పరిష్కరణలో తోడ్పడగా, మరికొంతమంది సాఫు ప్రతులు సిద్ధంచేయగా జూలూరి అప్పయ్య గారు టీక వ్రాశారు. ఈ రసవంత కావ్యాన్ని 1851 లో భువనగిరి చిన్న రంగయ్య శెట్టిగారు ప్రచురించారు. సి.పి.బ్రౌన్ గారు భగీరథ ప్రయత్నం చేసి మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, కవికర్ణరసాయనం, విజయవిలాసం – వీటికి టీకలు, వ్యాఖ్యానాలు జూలూరి అప్పయ్యగారితో రాయించారు. వీరి పాండిత్యప్రకర్ష, కఠినమైన పద్యాలకు సులభంగా అర్థాలు, టీక, వ్యాఖ్యానం చెప్పే తీరుతెన్నులు బ్రౌన్ దొరగారిని బాగా ఆకర్షించాయి. అందువల్లే 1824లో అప్పయ్య పంతులుగారిని తమ కాలేజీలోకి చేర్పించుకొని, గురుతర బాధ్యతను ఆయనకు అప్పగించారు ఛార్లెసు ఫిలిప్పు బ్రౌను దొరగారు.

ప్రాచీన తెలుగు కావ్యాలు పండితులకు మాత్రమే అర్థమయ్యే విధంగా వుండటం బ్రౌన్ దొరగారికి ఇంపితం కాలేదు. అందువల్లే ఆయన వాటికి సరళమైన భాషలో, సులభంగా సామాన్య పాఠకులకు



అర్థమయ్యేలా వుండటానికి సుబోధక రీతిలో టీకను వ్రాయించాలని నిశ్చయించారు. మూలకావ్యంలోని పద్యాలకు వ్యావహారిక భాషలో ప్రతిపదార్థం రాయించారు. తాత్పర్యం అనవసరమనుకున్నారు కాబోలు, దాని నివ్వలేదు. టీకలో అరసున్నలు, శకటరేఫలు వదిలివేశారు. పాండిత్యప్రకర్షనూ, పటాటోపాన్నీ పరిహరించారు. మొత్తంమీద బ్రౌన్ గారు వేసిన ఈ బాట ఆ కాలంనాటి పండిత పామరులకూ నల్లేరుపై బండి నడకలా తోచింది.

సి.పి. బ్రౌను దొర ప్రాచీన తెలుగు కావ్యాల మర్మం తెలిసిన గుణగ్రహణ పారీణుడు. మొదట్లో కాలేజీ పండితుడైన ములుపాక బుచ్చయ్యశాస్త్రి గారికి 'వసుచరిత్ర' టీక రాయమని చెప్పారు ఆయన మూడు ఆశ్వాసాల దాకా రాసిన టీకను చదివి, తృప్తి కలగక పోవడంతో ఆ పని నిలుపుదల చేసి, జూలూరి అప్పయ్యగారి భుజస్కంధాలపై ఆ బరువు మోపారు. ఆ మహానుభావుడు తన బాధ్యతను చక్కగా నిర్వహించి దొరగారి మెప్పు పొందారు. జూలూరి అప్పయ్యగారి 'వసుచరిత్ర' టీకను తెలుగు కావ్యప్రియులు కళ్లకద్దుకున్నారు. జూలూరివారి టీకాసారళ్యం, స్పష్టత, విశదతలు తరతరాల తెలుగు విద్వాంసులు, విద్యార్థుల మన్ననల్ని మూట కట్టుకొన్నాయి. అందుకే పండితాగ్రణి, పరిశోధనా ప్రవీణులైన ఆరుద్రగారు జూలూరి అప్పయ్య పంతులు గారి టీకాచార్యత్వాన్ని ఇలా ప్రశంసించారు – **"అప్పయ్యగారి పద్ధతి యింత సరళమైనది కనుకనే బ్రౌను దొరగారు ఒకటి కాదు, రెండు కాదు, పది కావ్యాలకు అప్పయ్యగారి చేత తీర్పు, టీక చెప్పించారు. వీటిలో కొన్ని ఇతరులు చెప్పిన వాటికి సవరణలు, కుదింపులు. అప్పయ్యగారి శంఖంలో పోస్తేనే గాని బ్రౌను దొరగారికి ఏ తీర్పూ తీర్థంకాదు."** (సమగ్ర ఆంధ్ర సాహిత్యం – 9 వ సంపుటం, కుంఫిణీ యుగం –1 పేజి: 251, ప్రజాశక్తి బుక్ హౌస్, (1990)

జూలూరు అప్పయ్యగారు 'స్వారోచిష మనుచరిత్ర' కు రాసిన టీక 1851లో వెలుగు చూసింది – వెలుగు విరజిమ్మింది కూడా. ఈ 'టీకా సహిత మనుచరిత్ర' ప్రబంధకావ్యం కాలక్రమంలో వావిళ్ళ వారి టీకతో వెంపరాల సూర్యనారాయణశాస్త్రి గారి టీకా తాత్పర్య వ్యాఖ్యాన విశేషాలతో తెలుగు పాఠక ప్రపంచాన్ని అలరించింది. మొత్తంమీద జూలూరి అప్పయ్యగారి 'స్వారోచిష మనుచరిత్ర' టీక (1851) తరతరాల్ని ప్రభావితం చేస్తూనే వుంది. ఆ కవితా పరిమళం సహృదయుల్ని అలరిస్తూనే వుంది. ఆ కావ్యసౌరభాన్ని ఆఘ్రాణించిన పుణ్యశ్లోకుల్లో శిశువైద్య నిపుణులైన డా. కోడూరు ప్రభాకరరెడ్డిగారు ఉల్లేఖింపదగ్గ విద్వాంసులు.

డా. రెడ్డిగారికి సుమారు 45 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరు సిండికేట్ బ్యాంక్ ఉద్యోగి చక్రవర్తి గారు ఈ 'స్వారోచిష మనుచరిత్ర' (1851) కానుకగా ఇచ్చారు. పండిత ప్రభాకరులు 171 ఏళ్ల క్రితం అచ్చయిన ఈ అమూల్య గ్రంథాన్ని 2022 జనవరిలో ప్రచురించారు. ప్రసిద్ధ విద్వాంసులు డా. ఏల్చూరి మురళీధరరావు గారు ఈ గ్రంథానికి రాసిన పీఠికలో జూలూరి అప్పయ్య గారి జీవితం, రచనల వైశిష్ట్యాన్ని వివరిస్తూ డా. కోడూరు ప్రభాకర రెడ్డి గారి 'స్వారోచిష మనుచరిత్ర టీక' అందించిన సామగ్రి సంపదను ఇలా ఉగ్గడించారు – "శ్రీ ప్రభాకరరెడ్డి గారు నూత్నపాఠకుల సౌలభ్యార్థమై జూలూరి అప్పయ్యగారి ముద్రణలో లేని తాత్పర్యాలను సరిక్రొత్తగా వ్రాశారు. పూర్వవ్యాఖ్యానాలను సాకల్యంగా అనుశీలించి, తత్తద్రచనలలోని ముఖ్యాంశాలన్నింటినీ సమీకరించి, సరిక్రొత్త వివృతులను రాశారు. అలంకార, కవిసమయ, కవితా చమత్కారాది విశేష వివరణలను చేర్చారు. ఆవశ్యకములైన చోట్లలో ఉదాహరణలతో తమ వ్యాఖ్యలకు కొత్త మెరుగులను అలవరించారు. ఆ నూత్న రచిత భాగాల విశదిమ కోసం అందుకు ఇటాలిక్స్ అక్షరాలను వాడారు. తొలిసారి ఈ మహాప్రబంధాన్ని అధ్యయనిస్తున్న విద్యార్థుల కోసం మనుచరిత్ర కథాసంగ్రహాన్ని కూర్చారు. మనుచరిత్రకు మూలమైన సంస్కృత మార్కండేయ పురాణంలో నుంచి మారన మహాకవి రచించిన తెలుగు మార్కండేయ పురాణములో నుంచి తత్కథాభాగాలున్న ఖండాలను అనుబంధాలుగా ఇచ్చారు. శ్రీకృష్ణదేవరాయుల ఆస్థానంలో గండపెండేర సత్కారాన్ని పొందినపుడు అల్లసాని పెద్దనగారు చెప్పినదిగా సుప్రసిద్ధమైన ఉత్పలమాలికకు ప్రసిద్ధ విద్వాంసులు డా. తాడేపల్లి పతంజలి గారు విరచించిన అర్థతాత్పర్యాలతో మరొక అనుబంధాన్ని కూర్చారు. రచితరోచితమైన ఈ కృతి ముద్రణతో జూలూరి అప్పయ్యగారి యశస్సు అతీత కాలయవనిక వెనుక అంతర్హితం కాకుండా పండిత పామరులకు ఆ రమ్యాక్షరశ్రేణిలోనికి పునః ప్రవేశాన్ని ప్రకల్పించారు" (పేజి: XXX).

అల్లసాని పెద్దన రచించిన 'స్వారోచిష మనుచరిత్ర'కు జూలూరి అప్పయ్య పంతులుగారు రాసిన టీక తర్వాతి వాళ్లకు చేదివ్వె అయింది. 'మనుచరిత్ర' రెండో ఆశ్వాసంలోని ఎంతో పేరుపెంపులు పొందిన "అటజని కాంచె భూమిసురు డంబర చుంబి"...... పద్యానికి జూలూరువారు రాసిన టీక చూడండి :

"భూసురుడు = పుడమి వేల్పయిన ప్రవరాఖ్యుడు, అటజని = ఆ దిక్కుకై పోయి, అంబర చుంబి.....జాలమున్. అంబర చుంబి = ఆకాశము యొక్క స్పర్శ గలిగినటువంటి, శిరః = శిఖరముల యందలి, సరిత్ = నదుల యొక్క, ఝురీపటల = ప్రవాహ సమూహముల యందు, ముహుర్ముహుర్లుఠత్ = మాటిమాటికిన్ని పొర్లుతున్నటువంటిన్ని, అభంగ = ఎడబాటు లేనటువంటి, తరంగ = కరుళ్లనే, మృదంగ = మద్దెలల యొక్క, నిస్వన = ధ్వనుల చేతను, స్ఫుట = ప్రకట మవుతున్నటువంటి, నటనానురూప నాట్యమునకు తగునట్టుగాను, పరిఫుల్ల = విప్పబడినటువంటి, కలాప = పింఛములు గల, కలాపిజాలమున్ = నెమళ్ల యొక్క గుంపులు గలిగినటువంటిన్ని, కటక...... సాలము, కటక = పర్వతము యొక్క, కర = తొండముల చేతను, కంపిత = కదల్చబడ్డటువంటి, సాలము = ఏపె మ్రాకులు గలిగిన, శీతశైలమున్ = హిమవత్పర్వతమును, కాంచె = చూచిన వాడాయెను. శిరస్సరజ్ఝరీ యనిన్ని పాఠము. ఆడయేనుగుల యందున్ను, మగయేనుగుల యందున్ను వర్తించును.

ఈ పద్యానికి డా. కోడూరు ప్రభాకర రెడ్డి గారు రాసిన తాత్పర్యం, ఇతర విశేషాలు ఇలా వున్నాయి :

"తా. ప్రవరుడు హిమాలయానికి వెళ్లి, అక్కడ ఆకాశాన్నంటే శిఖరాల నుండి ప్రవహిస్తున్న సెలయేళ్ల చప్పుళ్లు మద్దెల మ్రోతకాగా, దానికి అనుకూలంగా పురులు విప్పి ఆడునెమళ్లు నాట్యంచేస్తుండగా, ఏనుగులు చెట్లను విరచటానికి తొండాలతో పట్టి కదిలిస్తున్న, మనోహరమైన శీతల పర్వతశ్రేణిని తన్మయత్వంతో చూసినాడు.

లలిత లలితంగా చెప్పగలిగిన విషయాన్ని ఎందుకింత గంభీరంగా, పటాటోపంగా, అలంకార శోభితంగా వర్ణించినాడు పెద్దనామాత్యుడు? హిమాలయ పర్వతం అసామాన్యమైనది, మహోన్నతమైనది. భారతీయౌన్నత్యాన్ని, ఆధ్యాత్మికతను. చాటిచెప్పేది. అంత మహిమాన్వితము, మనోహరము, మహాద్భుతము అయిన దృశ్యాన్ని మన కళ్లకు కట్టినట్లు చూపించటానికి అంత సంస్కృత భాష ప్రయోగం అవసరమైనదే! పద్యంలో మూడు మాటలు తప్ప (అట,చని,కాంచె) తక్కినవన్నీ సంస్కృతం నుండి దిగుమతి అయిన తత్సమాలే! కేవలం శబ్దం ద్వారానే అర్థాన్ని తెలియ జెప్పటమే ఈ పద్యంలో గొప్పదనం. 'అంబరచుంబి' శిరస్సరత్ ఝురీపటల, మన్నప్పుడు ఆకాశాన్ని అంటినట్లుగా కనబడే పర్వత శ్రేణుల నుండి జాలువారే సెలయేళ్ల నిరంతర ప్రవాహం మనకు స్పష్టంగా దృగ్గోచరమవుతుంది. ఆ సెలయేళ్ల వంపుసొంపులతో నాట్యమాడుతూ, మృదంగ ధ్వనులు చేస్తూ, ప్రవహించే దృశ్యాన్ని కళ్లకు కట్టినట్లు

చెప్పిన పెద్దన కవితా వైభవం గురించి ఎంతైనా చెప్పవచ్చు. మృదంగ శబ్దాలకు, మేఘనాదాలకు నెమళ్లు ఆనందంతో నృత్యం చేస్తాయని లోకప్రసిద్ధి. ఆ సెలయేటి అలలు రాళ్లకు కొట్టుకొని మృదంగ నాదాలు వెలువరిస్తున్నాయి.

అభంగ, తరంగ, మృదంగ అనే పదప్రయోగాలతో ఆ మృదంగ ధ్వనులను స్ఫురింపజేశాడు ఆంధ్ర కవితా పితామహుడు పెద్దన. 'స్ఫుటనటనానుకూల' అనేచోట నాట్యమాడుతున్నట్లుగా భావన కలుగజేశాడు కవి. అక్షరాల చేత నాట్యమాడిస్తూ ఆ అర్థాలను 'పదధ్వనుల' ద్వారానే తెలియజేసే పద్యమిది. 'అల్లసాని వాని అల్లిక జిగిబిగి' కి నిలువుటద్దమే ఈ పద్యం. 'అల్లిక' అంటే పద్యమల్లటమే! 'జిగి' అంటే తళుకు, 'బిగి' అంటే బిగువు. అతి మధురమైన పదప్రయోగాలు గల, అనవసరమైన పదాలేవీ లేని పద్యరాజమిది.

'అంబర చుంబి శిరస్సు' లనే చోట అతిశయోక్తి అలంకారం. తరంగధ్వనులలో మృదంగ ధ్వని ఆరోపించబడటం వలన రూపకాలంకారం. అందులో దీర్ఘ సమాసాలతో సాంద్రంగా ఉంది కాబట్టి 'ఓజస్సు' అనే కవితాగుణం కూడ ఉంది. "తం ఝరీ = జరీ అనేదీ వ్యాకరణ సమ్మతం" (పేజి: 54,55).

జూలూరి అప్పయ్యగారు తరంగ అనే పదానికి 'కరుళ్లనే' అర్థమిచ్చారు. ఇక్కడ చాలా సులభమైన 'అలలు' అనే పదాన్ని పంతులుగా రెందుకు వాడలేదో?

తాత్పర్యంతోపాటు విశేషాలు చెప్పిన డా. కోడూరు ప్రభాకరరెడ్డి గారి ప్రయత్నం ప్రశంసనీయం. పూర్వసూరుల **"రచనల మార్గ దర్శకత్వంలో పయనించాను. అసలు ఇందులో నాదనేది ఆవగింజంత."** (పేజి:xi) అన్న డా. కోడూరు ప్రభాకర రెడ్డిగారు వినయమోహనులే!

జూలూరి వారి టీక సరళమైన భాషలో రాయబడింది. వీరి టీకా ప్రావీణ్యం గురించి ఏల్చూరి మురళీధరరావు గారన్న ఈ మాటలు అక్షర సత్యాలు : **"వైదుష్య ప్రకర్షను కలిగిన మార్గాన్ని అవలంబింపక, భాషలో ఒకపాటి ప్రవేశం మాత్రమే ఉన్న సామాన్య పాఠకునికి సైతం అర్థమయ్యే తీరున వ్యాఖ్యలను నిర్మింపజేశారు"** (పేజి: XXV).

జూలూరి అప్పయ్యగారు సామాన్యపాఠకులకు బోధపడే విధంగానే టీక వ్రాశారు. కాని కొన్నిచోట్ల మాత్రమే సులభమైన కవి ప్రయోగాలకు కఠినమైన అర్థాలు ఇచ్చారు వీటిని దోషాలు అనలేం. నెరసులంటే తప్పు కాదేమో! రెండో ఆశ్వాసంలోని "తరుణీ రేపును మాపు హవ్యముల చేతం...... చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్." (పేజి: 86)

'మీసాలపై తేనియల్' అన్న పదానికి జూలూరి వారు 'శ్మశ్రువుల మీది మధువులు' వంటివి అన్నారు. కుప్పుస్వామి అయ్యర్




మేడ్ డిఫికల్ట్ అంటే ఇదె కామోసు! మూడో ఆశ్వాసంలోని "అక్కట వాడు నా తగుల మారడి చేసి" అనే పద్యం (5-పేజి-97) లోని 'ఎక్కడ నీదుదానను' అనే మాటకు "ఎంతని సంప్లవింతును" అన్న భావాన్ని వ్యక్తంచేశారు. కవి ప్రయోగమే ఎంతో సులభంగా వుంది కదా. మరి ఈ ద్రావిడ ప్రాణాయామ మెందుకో?

"గూనివీపు లదర గొణిగి తిట్టుచు..." (నాలుగో ఆశ్వాసం: 36వ పద్యం. పేజి:203). ఇక్కడ "బోయ ముదుసళ్ళు - ముసలి బెస్తవాండ్లు" అని చెప్పబడింది. ఇది ముద్రారాక్షసమా? జూలూరి అప్పయ్య గారి కృతమని చెప్పే సాహసానికి వొడికట్టలేను.

నాలుగో ఆశ్వాసంలోని స్వరోచి వేట వృత్తాంతాన్ని అభూత పూర్వంగా చిత్రించిన అల్లసాని వారి ప్రతిభకు మెరుగులు దిద్దేలా అప్పయ్య శాస్త్రిగారు ఈ ఘట్టానికి ఎంతో సమర్థవంతమైన టీకను అందించారు. మహాపండితులైన జూలూరి అప్పయ్యగారి టీకకు తాత్పర్యం, అలంకారాల పేర్లను, అక్కడక్కడ అవసరమైన స్థలాల్లో విశదీకరణ చేసిన డా. కోడూరు ప్రభాకరరెడ్డిగారు అభినందనీయులు.

# వ్యాస రచయితగా 'కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి'

**ఆర్. గోపాల్**, తెలుగుశాఖ పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9328558526

**పరిచయం :** ఆంధ్రబిల్హణ, బ్రాహ్మీభూషణ, సుధీంద్రమౌళి, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు కీ.శే. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారు పద్మావతి శ్రీనివాసశాస్త్రి అనే పుణ్యదంపతులకు తేది : 2.7.1911న జన్మించారు. వీరిది వనపర్తి పట్టణం. ఇది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముఖ్య పట్టణం. నూతన తెలంగాణ రాష్ట్రంలో ఒక జిల్లాగా కొనసాగుతున్నది. ఇతను వనపర్తి సంస్థానంలో ఆస్థానకవిగా ఉన్నాడు. వీరి ఇంటిపేరు కప్పగంతులవారు. కౌశిక గోత్రం. వెలనాటిశాఖ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి కవి, నాటకకర్త, అనువాదకుడు, పరిశోధకుడు, వ్యాసకర్త, గొప్ప ఉపన్యాసకుడు, సాహితీవేత్త ఇలా ఎంత చెప్పినా తక్కువనే. ఇతను తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృతకళాశాలలో సంస్కృతం, అలంకారం, వ్యాకరణ శాస్త్రాలను అభ్యసించి సాహిత్య శిరోమణి పట్టపొందిన తర్వాత మద్రాసు మైలాపూరు సంస్కృత కళాశాలలో అద్వైతం అభ్యసించాడు. అన్నామలై విశ్వవిద్యాలయంలో వ్యాకరణశాస్త్రం చదివాడు. శ్రీపులిసి కృష్ణమాచార్యులు, లక్ష్మీనరసింహశాస్త్రి, సేతు మాధవరావు, గిరిధాచార్యులు మొదలైనవారు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి విద్యాగురువులు. ఇతను ఆంధ్ర, ఆంగ్లం, ఉర్దూ, హిందీ, సంస్కృత, కన్నడ, తమిళ, మరాఠి అను అష్టభాషా ప్రవీణుడు. శాస్త్రిగారు 1981వ సంవత్సరంలో పరమపదించారు.

**కప్పగంతుల లక్ష్మణశాస్త్రి రచనలు :** విక్రమాంకదేవచరితం (అనువాదం), కర్ణసుందరినాటిక (అనువాదం), వ్యాసమహాభారతం (గద్యానువాదం), బౌద్ధదర్శనం (అనువాదం), సూర్యోపరాగదర్పణం (తెలుగు తాత్పర్యం), శ్రీబదరీశ స్తోత్రం (అనువాదం), లక్ష్మణరేఖలు (అనువాదం), శాస్త్రీయ విజ్ఞానం – సంపాదకత్వం (1948), ఆంధ్రసంస్కృతకోశం – సంపాదకత్వం (పుల్లెల శ్రీరామచంద్రునితో కలిసి), ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక – సంపాదకత్వం (కొంతకాలం), స్తోత్రలహరి (1969), ఆంధ్ర వ్యాకరణ వివరణం (1950), సంస్కృత పాఠమాల (1953), మణిమంజూష కథలు (1952), తెలుగులిపి సంస్కరణ మొదలైనవి.

**కప్పగంతుల లక్ష్మణశాస్త్రి స్వీయ పద్య రచనలు :** శృంగార మంజరీ, పంచరత్నోపహారం, సంక్షేమ రాజ్యం, నివాపాంజలి:, దీపావళి, లాలా లజపతిరాయ్ శతవార్షిక జయంతి, వసంతఋతువు మొదలైనవి వివిధ సాహిత్యమాసపత్రికలలో ప్రచురించబడినది.

**కప్పగంతుల లక్ష్మణశాస్త్రి వ్యాసములు – విశ్లేషణ :**

**అమర సాహిత్యం :** ఈ వ్యాసం సుజాత మాసపత్రిక 1953 మే సంచిక (ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ మహాసభ అలంపురం సంచిక)లో ప్రచురించారు. లక్ష్మణశాస్త్రి ఈ వ్యాసంలో అమరభాష అనగా సంస్కృతభాష. ఈ సంస్కృతభాష, సాహిత్యముల ప్రాశస్త్యం తెలియచేసే ప్రయత్నం చేశాడు. అమరులనగా దేవతలని, వారు మాట్లాడు భాష అమరభాష అని జనవ్యవహారంలో ఉంది. ఈ ప్రచారాన్ని ఖండించి అమరభాష అనగా మరణించనిది, శాశ్వత మైనది, సంస్కరించబడినది అని శాస్త్రి వివరించాడు. **"సంస్కృతము అమరభాష, అమరభాష అనగా అమరుల భాష అని నా అభిప్రాయం కాదు. మరణించని భాష అని నా అభిప్రాయము"** (లక్ష్మణశాస్త్రి. అమర సాహిత్యం. సుజాత. పుట: 82.1953) ఈ భాష భారతదేశంలో రెండుగా చీలిపోయింది. అది ఒకటి సంస్కృతభాష. రెండు ఉత్తరభారతదేశంలోని భాషలైన పంజాబ్, బెంగాలీ, అవధి, రాజస్థాని, గుజరాతీ, మరాఠీ మొదలైన భాషలు. ఈ భాషలకు సంస్కృతభాష మూలమని శాస్త్రి పేర్కొన్నాడు.

ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, చారిత్రక, తాత్త్వికాంశాలు మనకు వారధిగా అందించునది ఏదైన ఒక భాష మాత్రమే. అట్లాంటి భాష అమరభాష (సంస్కృతం). ఇది పూర్వం నుండి ఎన్నో పెద్దపెద్ద సామ్రాజ్యాలలో రాజభాషగా, అధికారభాష, పండితులభాషగా, ప్రజలభాషగా ఉంటూ నాటి నుండి నేటి వరకు ఎలాంటి మార్పునకు లోనుకాకుండ వచ్చింది. ఈ వ్యాసంలో శాస్త్రిగారు అమరభాష ప్రాశస్త్యం, విస్తృతి, పరిణామం తెలియచేశాడు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం ప్రాంతమును సంస్కృతభాషను పోషించిన ప్రాంతంగా శాస్త్రి అభివర్ణించాడు. సంస్కృత సాహిత్యంలోని ఆదికవి వాల్మీకి, వ్యాసమహర్షి, మహాకవి కాళిదాసు, బాణుడు, హర్షవర్ధనుడు, తెలుగుప్రాంతంలో ఆచార్య నాగార్జునుడు, నిత్యానాథుడు, కుమారిలుడు, మల్లినాథుడు మొదలైన కవుల కావ్యాలలోని భావుకత కలదని కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ఈ వ్యాసంలో తెలిపియున్నాడు.

**వసంత సేన :** ఈ వ్యాసం జయంతి మాసపత్రిక 1960 ఫిబ్రవరి సంచికలో ప్రచురించబడినది. వసంత సేన అనే పాత్ర శూద్రకుడు సంస్కృతభాషలో రచించిన మృచ్ఛకటికం నాటకంలోనిది. ఈమె వేశ్యకుటుంబానికి చెందిన స్త్రీ అయినా శీలవంతురాలిగా తీర్చిదిద్దినాడు. నాటకంలో ఈ పాత్ర ప్రత్యేకతను ప్రస్తావిస్తూ సరళమైన పదజాలంతో అద్భుతంగా వ్రాశాడు. ఈ నాటకం శృంగారరస ప్రధానమైనది. ఇందులో నాయకుడు ధీరశాంతుడు. ఇది సంస్కృతనాటక సంప్రదాయానికి భిన్నంగా ఉందని శాస్త్రిగారు పేర్కొన్నారు. ఇది దశరూపకాలలో రెండవదైన ప్రకరణమునకు

చెందింది. మృచ్ఛకటికం అనగా 'మట్టిబండి' ఈ విషయం నాటకం మధ్యలో వస్తుందని లక్ష్మణశాస్త్రి వ్రాశాడు. ఈ వ్యాసంలో వసంత సేనకు, గురజాడవారి కన్యాశుల్కంలోని మధురవాణికి, చింతామణి నాటకంలోని చింతామణి పాత్రలతో పోలుస్తూ ఈమె వేశ్య కుటుంబంలో పుట్టిన శీలవంతురాలుగా చిత్రీకరించాడని శాస్త్రి అభిప్రాయపడాడు.

మృచ్ఛకటికం సాంఘిక నాటకం. రచయితకాలం నాటి సమాజాన్ని చక్కగా చిత్రీకరించాడని, పాత్రపోషణ, రసపోషణ చాలా చక్కగా ఉందని శాస్త్రిగారు వివరించారు. ఇందులో దొంగలు, జూదమాడేవారు, విటులు, పోకిరీల ప్రవర్తనను కనులకు కట్టినట్లుగా వర్ణించాడు. ఈ వ్యాసమును కప్పగంతులవారు చిన్నచిన్న వాక్యములతో సరళ గ్రాంథికంలో వ్రాశారు.

**అష్టభాషా బహిరీ గోపాలరాయకవి :** ఈ వ్యాసం భారతి మాసపత్రిక 1979 జులై సంచికలో ప్రచురించారు. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి సంస్థానమును పాలించిన ఆరవ రాజు గోపాలరావు. ఇతడు క్రీ.శ. 1648 ప్రాంతంలో పాలన చేశాడని, ఇతడు సాహిత్య, కవిత్వ, పరిపాలనలో సమర్థుడని శాస్త్రి వ్యాసంలో వ్రాశాడు. ఈ రాజకవి సంస్కృత, ప్రాకృతాది ఎనిమిది భాషలలో పాండిత్యం ఉండటం వలన **అష్టభాషా** అనే బిరుదు లభించిందని, శత్రువుల పైన **బహిరీ (డేగ) పక్షివలె** పడి వారిని హతమార్చువాడు కావున కుతుబ్ షాహీ నవాబు **బహిరీ** అనే బిరుదు ఇచ్చాడని వ్యాసంలో కప్పగంతులవారు తెలిపారు.

గోపాలరావు సంస్కృతభాషలో రామచంద్రోదయం అనే యమకకావ్యం, శృంగారమంజరీ భాణం రచించాడని, వీటిని వ్రాయడానికి గల కారణాలను తెలిపి, ఈ రచనల ప్రత్యేకతను, ఈ రాజుకు ఆరు శాస్త్రాలలో రచనవ్యాసంగా చేయగల పాండిత్యం ఉందని అంతేకాదు గోపాలరాయకవియే తన గూర్చి తెలిపే శ్లోకం కూడా వ్రాసున్నాడని లక్ష్మణశాస్త్రి చెలిపాడు.

**శ్రీమాన్ గోపాలరాయక్షితి రమణమణి: జన్మతీ వంశ చంద్ర న్యోక్త శ్రీరామచంద్రోదయ యమక మహాకావ్య మత్యర్థభవ్యం వ్యాఖ్యాతి ఖ్యాతిమిచ్చు: స్వయమయ మధునా సత్రుభూతానుభావ: మందాత్మానుగ్రహార్థీ సతత వితరణన్య కృతామర్త్యభూబు:"**

(లక్ష్మణశాస్త్రి. భారతి పత్రిక.పుట:05.1979)

అలాగే శాస్త్రిగారు ఈ వ్యాసంలో గోపాలరాయకవి వ్రాసిన రామచంద్రోదయం, శృంగారమంజరీ భాణం అను రెండు రచనలను క్లుప్తంగా విశ్లేషించారు. 1895-1896 సంవత్సరాలలో ద్వితీయ రామేశ్వరరావుగారు వనపర్తిపట్టణంలో బ్రహ్మవిద్యావిలాస ముద్రాక్షరశాలను స్థాపించి, అందులో ఈ గ్రంథాలను ప్రచురించారు. ఈ పుస్తకాలు శిథిలావస్థలో ఉండటం వలన మూడవ రామేశ్వరరావు కప్పగంతుల లక్ష్మణశాస్త్రిచేత పరిష్కరించి ముద్రించారు. దీనికి ఉ



పోద్ఘాతం కూడా శాస్త్రిగారు వ్రాశారు. ఇవి 1977వ సంవత్సరంలో రెండవసారి ప్రచురించారు.

**తెలంగాణ నాటకములు :** ఈ వ్యాసం కిన్నెర మాసపత్రిక 1955 జనవరి సంచికలో ప్రచురించారు. కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు తెలంగాణా ప్రాంతంలోని సంస్కృత, తెలుగు నాటకాలను, అనువాద నాటకాలు, నాటకరచయితలను, నాటక ప్రదర్శన సంస్థలను, తెలంగాణా రేడియో నాటకాలను పరిచయం చేస్తూ **"తెలంగాణ నాటకములు"** అనే పేరుతో వ్యాసం వ్రాశారు.

తెలంగాణలో ప్రముఖనాటకకర్తలు అష్టభాషాబహిరీ గోపాలరావు, మాదిరాజు విశ్వనాథరావు, సురవరం ప్రతాపరెడ్డి, బాగి నారాయణ మూర్తి, సి.నారాయణరెడ్డి, మొదలైనవారిని పేర్కొని వారి నాటకాల పేర్లు కూడా ఉదహరించాడు. ఇండియ నేషనల్ థియేటర్, విజయ కళాసమితి, నవ్యకళాసమితి, సన్మిత్రనాట్యమండలి, కాకతీయ కళాసమితి మొదలైన నాటక సంస్థలను పేర్కొన్నాడు. మరియు రేడియో నాటకాలు రాసిన వారిని ఆ నాటకాల పేర్లు ఉదహరించాడు.

**భద్రగిరి చరితం :** భద్రాచలం దక్షిణ భారతదేశంలో తెలంగాణ రాష్ట్రంలో గోదావరీ తీరాన వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం. ఈ క్షేత్ర చరిత్రను శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు శ్రీరామనవమినాడు శ్రీరామకల్యాణ మహోత్సవంలో, ఆకాశవాణి ద్వారా చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానమును, సంపాదకులు డి.సుదర్శన్ గారు వ్యాసరూపంలో శ్రీ భద్రాచల క్షేత్ర మహిమ అను సంకలన గ్రంథంలో "భద్రగిరి చరితము" పేరుతో ప్రచురించాడు.

ఈ వ్యాసంలో శ్రీరామచంద్రుడి పరమ భక్తవరేణ్యుడ భద్రుడు. భద్రాచల సమీపంలోని భద్రిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పోకల

దమ్మక్క అనే భక్తురాలు మరియు కంచెర్ల గోపన్న (భక్త రామదాసు) అనే రామభక్తుల గురించి చక్కగా వర్ణించాడు. శ్రీ సీతారామలక్ష్మణ సమేతంగా వెలిసిన భద్రాచల క్షేత్రమాహాత్మ్యం, గోదావరినది, గోదావరీ నదిపైన వంతెన నిర్మాణం గురించి తెలిపాడు. అలాగే మహాకవి భవభూతి గోదావరిని వర్ణించు శ్లోకాలు, శ్రీరామచంద్రుని కీర్తించిన ఆది శంకరాచార్యులుగారి శ్రీరామ కర్ణామృతంలోని శ్లోకం, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి కిన్నెరసాని గేయాలు ప్రసిద్ధ వాగ్గేయకారుడు త్యాగరాజుగారి కీర్తలను ప్రస్తావించాడు.

**శాంతరస విమర్శ :** శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు 'శాంతరస విమర్శ' అను వ్యాసాన్ని సవిమర్శనాత్మకంగా వ్రాశారు. ఈ వ్యాసం భారతి మాస పత్రికలో 1978 నవంబరు సంచికలో ప్రచురించారు. ఈ వ్యాసంలో రసమును వేదవాక్యమునకు సమానమైనదని శాస్త్రిగారు తెలియచేశారు. అలాగే శాంతరసమును సమర్థించినవారు వ్యతిరేకించినవారి గురించి తెలిపారు. ఇంకా మహాభారతంలో శాంతరసం గూర్చి చర్చించాడు.

**సంస్కృత సాహిత్యం, ముస్లిములసేవ :** ఈ వ్యాసం భారతి మాసపత్రిక 1959 సెప్టెంబరు సంచికలో ప్రచురించారు. లక్ష్మణశాస్త్రిగారు ఈ వ్యాసంలో భారతదేశంలో భిన్నత్వంలోని ఏకత్వాన్ని సాహిత్యరంగంలో కూడా ప్రతిపాదించిన విధానం కన్నులకు కట్టినట్లుగా కన్పిస్తుంది. ఈ వ్యాసం ముస్లిం రాజులు భారతదేశ మూలాలను తెలుసుకోవడం కోసం అనేక సంస్కృత రచనలను పార్సీకాది ముస్లిం భాషలలోనికి అనువదింపచేశారని మరియు సంస్కృత కవి పండితులను రాజాస్థానాలలో పోషించిన అంశాలను తెలుపుతూ వ్రాయబడినది. అంతేకాని నేటి తెలుగు సాహిత్యంలోని ముస్లిం (మైనార్టీ) వాదాన్ని తెలిపేది కాదు. భారతదేశంలో హిందూ, ముస్లిం మతాల మధ్య సహనం మొదలైన అనేకాంశాలు ఈ వ్యాసంలో కలవు. ముస్లిములు అంటే ఉగ్రవాదులు మరియు దేశ ద్రోహులనే భావనను తుడిచి వేసే వ్యాసమిది. విదేశీ ముస్లిం రాజులు భారతదేశం పై దాడులు చేసి దేశ పాలన చేసినవారే. భారత దేశంలోని ఇతర మతాలయందు సహనం వహించారు. ఆ మత సహనమే సంస్కృత సాహిత్యసేవకు కారణమయ్యింది. లక్ష్మణ శాస్త్రి గారు ఈ వ్యాసంలో ముస్లింరాజుల ఆస్థానంలో ముగ్గురు ముఖ్యమైన సంస్కృత కవులు ఉన్నారని, వారిని గురించి ప్రత్యేకంగా వివరించారు. ఆ కవులు భానుకరుడు, అక్బరీయ కాళిదాసుడు, జగన్నాథ పండితరాజు.

**కప్పగంతుల లక్ష్మణశాస్త్రి - మహాభారత వ్యాసాలు :** తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి అనేది మన తెలుగు వారి జాతీయం. తెలుగువారు పండుగలు ఉత్సవాలలో గారెలు తింటారు. అలాగే ప్రతి మాసం భారత కథ చదవాలని శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారు మహాభారత వ్యాసాలు వ్రాసి, ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ప్రచురించారు. ఆ వ్యాసాలు ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో 1966 సెప్టెంబరు నుండి సుమారు డిసెంబర్ 1977 వరకు 10 సంవత్సరాల్లో సుమారు 100కు పైగా వ్యాసాలను ప్రతి నెల ఒకవ్యాసంగా తెలుగువారికి అమృత భాండంగా మహాభారత కథను అందించారు. **"ఈ నెల (సెప్టెంబరు, 1966) నుండి వ్యాస భారతమును యథాతథంగా అనువదించి ధారావాహికముగా ప్రచురిస్తున్నాము"** (లక్ష్మణ శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, సెప్టెంబర్ 1966) ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక 1966, సెప్టెంబరు సంచికలో విషయసూచిక దగ్గరనే ఈ అంశం ప్రచురించారు. ప్రతి నెల సీరియల్ (ధారావాహిని)గా భారతకథను వ్యాసాలుగా వ్రాసి కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారు తెలుగువారికి అందించి ధన్యులైనారు. భారతవ్యాసాలను లక్ష్మణశాస్త్రి గారు సులభ శైలిలో వ్రాశారు.

ఈ విధంగా కప్పగంతులవారు రాసిన వ్యాసాలు వివిధ మాసపత్రికలలో ప్రచురించబడినవి. ఈ వ్యాసాలను కొన్నింటిని ఇక్కడ పరిచయం చేశాను. ఇతను కొన్ని గ్రంథాలకు పీఠికల రూపంలో వ్రాసిన వ్యాసాలు కూడా అనేకం కలవు. ఆచార్య ఎస్వీ రామారావు, డా. సంబరాజు రవిప్రకాశరావు మొదలైన వ్యాసకర్తలు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారిని పరిచయం చేస్తూ వ్రాసిన వ్యాసాలు కూడా ప్రచురించబడినవి.

**ఆధార గ్రంథాలు :**

1. లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల – అష్టభాషాబహిరీ గోపాల రాయకవి : భారతి మాసపత్రిక:జులై 1979.
2. లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల – తెలంగాణా నాటకాలు: కిన్నెర మాసపత్రిక : జనవరి 1955.
3. లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల – మహాభారతము (సీరియల్) ఆంధ్రప్రదేశ్. సెప్టెంబరు 1966.
4. లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల – వసంతసేన: జయంతి మాసపత్రిక : ఫిబ్రవరి 1960.
5. లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల – శాంతరస విమర్శము; భారతి మాసపత్రిక: 1978.
6. లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల – సంస్కృత సాహిత్యము ముస్లిముల సేవ: భారతి మాసపత్రిక: సెప్టెంబరు 1959.
7. లక్ష్మణశాస్త్రి, కప్పగంతుల – అమరసాహిత్యం: సుజాత మాసపత్రిక : మే 1953.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5 41 హైదరాబాద్ మార్చి : 2022

నివాళి

# నడిచే పద్యంతో అంతేవాసం

(పద్మశ్రీ పురస్కార గ్రహీత, అవధానాచార్య, కీర్తిశేషులు డా. ఆశావాది ప్రకాశరావుగారి స్మృతివ్యాసం)

**ఏ. మారుతి**, తెలుగు ఉపాధ్యాయులు, వేములవాడ. ఫోన్ : 8142141008

పదికిపైగా బిరుదులు, సుమారు వంద గ్రంథాలు, గండపెండేరం, కనకాభిషేకం వంటి శతాధిక సన్మానాలు, 171 అష్టావధానాలు, వేలాదిమంది అభిమానులు, మకుటాయమానంగా "పద్మశ్రీ", వెరసి ఐదున్నర అడుగుల అనంత పద్యం ఆశావాదిప్రకాశరావు గారు. ఫిబ్రవరి17న, ఆయన మరణవార్త విని చాలాబాధపడ్డాను. నిన్నటికి నిన్న ఆయనతో మాట్లాడినప్పటి కంఠస్వరం ఇంకాచెవుల్లో మ్రోగుతూనే ఉంది.

ఆయన ఏది మాట్లాడినా పద్యగానం లాగే అనిపిస్తుంది. డిగ్రీ విద్యార్థిగా అప్పటి రాష్ట్రపతి రాధాకృష్ణన్ గారిచే 'బాలకవి' బిరుదుతో ప్రారంభమై ఇప్పటి రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకోవడంతో ముగిసిన అనంతపద్యం ఆశావాది. నా సాహితీ గురువు ఆశావాదిగారితో నాకున్న అనుబంధాన్ని మీతో కొంత పంచుకుంటాను.

**పరిచయం**

సుమారు, దశాబ్దం క్రితం తెలుగు అకాడమీ వారు నిర్వహించిన **"జాషువా జయంతి - పద్యకవితా పోటీలకు"** ముందు ఆయనను పరిచయం చేసుకుని ఆయననుండి కొన్ని సూచనలు పొందాను. అనుకోకుండా జరిగిన పరిచయం క్రమేణ నన్ను ఆయన శిష్యుడిగా మలిచింది.

ఆయన రాసిన కొన్నిపుస్తకాలకు, ఆయన కనకాభిషేకం మొదలైన వాటికి, ముఖచిత్రాన్ని నేనే తయారు చేసి ఇచ్చాను. ఈ క్రమంలో తరచూ నా ఇంటికి ఆయన రావడం, ఆయనతో స్నేహం ఏర్పడడానికి కారణమైంది. సహజంగా సాహిత్య విద్యార్థిని అయిన నేను, ఓరియంటల్ స్థాయినుంచి నేను చదువుకున్న రకరకాల పద్యాలు సాహిత్య విషయాలు ఆయనతో మాట్లాడడం, చర్చించడం జరిగేది. ఈ పరిణామం ఆయనపట్ల నాకు భక్తి, గౌరవం పెంచింది.

**భోజనం - రసభాజనం**

మా ఇద్దరి సాహిత్య ప్రస్థానంలో వంటకూ ఒకస్థానం ఉన్నది. అప్పుడప్పుడు హైదరాబాద్‌కు వచ్చే ఆయన మా ఇంటిలో నా చేతివంట తినడం ఆయన ఇష్టపడేవారు. సహజంగా సాత్వికుడు కాబట్టి, సాత్విక ఆహారాన్ని ఎక్కువగా తినేవారు. నేను వండినవంట, ఒక పుంభావ సరస్వతికి పీటవేసి పెట్టే అదృష్టం నాకు లభించిందని అప్పుడప్పుడు మురిసిపోతాను. వంట చేస్తున్న సమయంలో, ఆయన ఒకపద్యం, నేను ఒకపద్యం సరదాగా పాడుకునేవాళ్ళం. లోకంలో రకరకాల వ్యక్తులను, కుత్సిత మనస్తత్వాల గురించి మాట్లాడటం ఆయన



పరనిందగా భావించేవాడు. అందుకని భోజనం చేసే సమయంలో కూడా మంచి సాహిత్య అంశాలు మాట్లాడేవారు. నేను గమనించని అంశాలను ఎన్నో, ఆయన పద్యంలో ఎలా పరిశీలించాలి నేర్పేవారు. 'రసోవైసః' అన్న వేదోక్తిని మేము ఇలా సార్థకం చేసాం.

**సాహిత్యం - సాచివ్యం**

నేను రాసిన మొదటి గ్రంథానికి ఆయన రాసిన ఆశీఃపూర్వకమైన కందమాలిక నాకు ఒక గొప్ప సన్మానపత్రం వంటిది. నాకు **సన్నిధిశ్రీ** అనే కలంపేరు ఆయనే పెట్టారు. నా పద్య ధారణ పట్ల, నాకున్న జిజ్ఞాస పట్ల ఆయనకు అమిత విశ్వాసం. ఆయన నన్ను అవధానిని చేయాలనుకున్నారు. పద్యం రాయాలనే నా ఆసక్తికి ఆయన అనుభవాన్ని జోడించి కొన్ని రోజులపాటు, ఉస్మానియా విశ్వవిద్యాలయం చెట్ల నీడల్లో తాను సరస్వతీ స్వరూపుడై, 'అవధానం ఎలా చేస్తారు? దానికి ఎలా సంసిద్ధం అవ్వాలి?' అనే విషయాల్ని నేర్పారు.

పెద్దవిషయాన్ని మనసుకి శిక్షణ ఇవ్వాలంటే చిన్న విషయాలను, తొందరగా మరిచిపోవలసిన విషయాలను కాగితాల మీద రాసుకోవాలి. దానివల్ల మనసును ఎప్పుడూ సాధనామార్గంలో నిరంతరం కొనసాగిస్తే కళ్ళముందు ఒక తెరలాగా మనం అల్లుతున్న





**(ఆశావాదితో వ్యాసరచయిత మారుతి)**

పద్యం తప్పు-ఒప్పు అనేది స్పష్టంగా కనబడుతుంది. దానికి పదజాలం, పద్యసాధనతో పాటు, ఆధునికసమాజానికి అందుబాటులో ఉండేలాగా పద్యాన్ని ఎప్పటికప్పుడు మార్చాలి అన్నారు. వస్తువు శిల్పం పదాలలోని కాఠిన్యం సందర్భోచితంగా వినియోగించకపోతే, విఫలం అయినట్లు లెక్క అనేవారు. శంకర సాహిత్యం సంస్కృత సాహిత్యంవంటి వాటిలో నేను నేర్చుకున్న అంశాలను కానీ, కొత్తపుస్తకం గురించి నావంటి చిన్నవారి దగ్గర అడిగి తెలుసుకోవడానికి ఆయన ఏమాత్రం వెనుకాడేవారు కాదు. గబ్బిలానికి వ్యాఖ్యానం రాయాలనేది నా కోరిక. ఆయన రాసిన వచనగబ్బిలం, ఆయనతో జరిగినసంభాషణలు నా ప్రయత్నానికి మరింత సహకరించాయి.

**వ్యక్తిగత జీవితం**

**ఏ కితాబులో దొరుకుతుంది ? ఈ ప్రశ్నకు జవాబు.**

**ఏ రబ్బరుతో చెరుగుతుంది ? మృతనష్టపు నసీబు** అని ఆరుద్ర గారు అన్నారు.

కొన్ని ప్రశ్నలు జవాబులు లేకుండానే ఉండిపోతాయి. ప్రకాశరావు గారి వ్యక్తిగత జీవితాన్ని, సాహిత్య ప్రస్థానాన్ని సుమారు నాలుగు సంవత్సరాలక్రితం నా ఇంట్లో (ముఖాముఖి) ఇంటర్వ్యూ చేయడం జరిగింది. అది సెల్ ఫోన్లో తీయడంవలన, కొన్ని సాంకేతిక కారణాలవల్ల, పోగొట్టుకున్నాను. ఆ ఇంటర్వ్యూలో ఎన్నోవిషయాలను నాతో పంచుకున్నారు. ఆయన కుటుంబీకులను నుండి కావలసినంత సహకారం రాకపోవడం, కొందరు సన్నిహితులు ఆయన పట్ల అవిధేయతతో నడుచుకోవడం ఆయనను కొంత కలచివేసింది. వర్ణవివక్ష తానుకూడా అనుభవించానన్నారు. కానీ తనను అవమానించిన వారి పేర్లు చెప్పడానికి అంతగా ఇష్టపడలేదు.

మిత్రులపట్ల అభిమానము, ప్రత్యేకంగా శిష్యవాత్సల్యము ఆయనలో చెప్పుకోదగ్గ అంశాలు. ఎంతోమందిని కవులుగా మలచి అవధానులను చేసి అవధాన ఆచార్యుడయ్యాడు. సాహిత్య సభలకు భేషజం లేకుండా, ఫలానా వారిని తీసుకోమని సూచించేవారు. నావంటి ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. యువభారతి నిర్వాహకులకు, సాహితీసభల కార్యకర్తలకు పరిచయంచేసి సభలకు ఆహ్వానించి ప్రోత్సహించారు. అలా, కొన్నిసభలకు నేను హాజరయ్యాను. ఒకసారి వేదికపైన నా ఉపన్యాసం విని **"నీ రాత కంటే, కూత బాగుంది"** అన్నారు. ఒక వ్యాసం రాయడం కంటే ప్రతిభావంతంగా ఉపన్యాసాన్ని అలవోకగా ఇస్తున్నావు. కాబట్టి నీవు ఆ మార్గాన్ని అనుసరించమన్నారు. పద్యాలపట్ల ఆసక్తి ఉన్నప్పటికీ, పద్యరచన కంటే భావావేశం ఎక్కువ ఉన్నందున గేయం/పాట నాకు నప్పుతుందన్నారు.

ఆయన రాసిన పుస్తకాలలో ఎన్నో పద్యాలు, ప్రత్యేకంగా వచన కవితా గ్రంథమైన అంతరంగ తరంగాలు మొదలైన వాటి గురించి ఎంతైనా చెప్పవచ్చు. అవి కాగితాన్ని పట్టుకొని ఉన్నాయి. కానీ నా ఆలోచనలను ఆశ్రయించిన కొన్ని భావాలను ఆశావాదివారితో ఉండే అనుబంధాన్ని మీతోపంచుకునే అవకాశం మూసీద్వారా లభించినందుకు ధన్యుణ్ణి.

**గట్టియత్నము సల్పుచు గట్టునెక్కు**
**నట్టిసత్పథము మనముపట్టినపుడు**
**గుట్టలెదురైన ప్రక్కకునెట్టగలము**
**వట్టికోర్కెలచే ఫలముట్టిపడునే**

– ఆశావాది ప్రకాశరావు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2022

# నల్గొండ జిల్లా – తెలంగాణ సాయుధ పోరాటం – సాహిత్యం

**కొండ విజయకుమార్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఫోన్ : 8333992097

1946 – 1951 సంవత్సరాల మధ్య కాలంలో భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో అపూర్వమైన ప్రజా పోరాటం. ఆ పోరాటంలో లక్షలాది ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఆ దీర్ఘకాల పోరాటం అవిశ్రాంతంగా సాగింది. ఆ పోరాట కాలంలో ప్రజలు అనేక విజయాల్ని చవిచూశారు. భూస్వాములను గ్రామాల నుండి తరిమి కొట్టారు. మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు స్థాపించుకుని, పది లక్షల ఎకరాల భూమిని పంచుకున్నారు. రైతుకూలీలు ఏకమై భూస్వాములకు, నైజాం పోలీసులకు, రజాకార్లకు, యూనియన్ మిలటరీకి వ్యతిరేకంగా సాయుధులై పోరాడారు. భారతదేశ చరిత్రలో ఆ పోరాటానికున్న అనేక ప్రత్యేకతల దృష్ట్యా ఆ పోరాట విషయాలు ప్రత్యేకించి అధ్యయనం చేయవలసినవిగా ఉన్నాయి.



తెలంగాణ పోరాట పరిస్థితులను చిత్రిస్తూ పోరాట కాలంలోనూ ఆ తర్వాత వెలువడిన సాహిత్యం కూడా తెలుగు సాహిత్యంలో అపూర్వమైనదిగానూ ప్రత్యేక లక్షణాలతోనూ ఉంది. ఆ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ద్వారా, పరిశీలించడం ద్వారా తెలుగు సాహిత్య పరిశోధనా రంగం మరింత విస్తృతమౌతుంది, సంపన్న మౌతుంది. నల్లగొండ జిల్లా తెలంగాణ చిత్రపటం మీద పూస్తున్న ఎర్రటి పూల మోదుగుచెట్ల వనం ఆరాట పోరాటాలు, ఆశానిరాశలు, సందేహాలూ, సమాధానాలూ – భౌతిక బౌద్ధిక సంఘర్షణలకు మూలకేంద్రం, సృజనాత్మక ప్రక్రియలకూ, సైద్ధాంతిక చర్చోపచర్చలకు చాలాకాలంగా నల్గొండ జిల్లా ప్రధాన క్షేత్రమైంది. పీడిత ప్రజలు గుండెకు గొంతుకనిచ్చిన గూడ అంజయ్య పాట 'ఊరుమనదిరో...' పుట్టింది నల్లగొండ నడిబొడ్డులోనే. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవితాన్ని త్యాగం చేసిన చెరబండరాజు నల్లగొండవాడే. ఆరుగురు దిగంబర కవుల్లో ఇద్దరు నల్లగొండ జిల్లావారే. ఇదంతా యాదృచ్ఛికమే కావచ్చు గానీ నల్లగొండ జిల్లా మేధావుల, ప్రజల నిరంతర చింతనకు, కొత్త తొవ్వ కోసం దేవులాటకు ఇది అద్దం పడుతుంది. తెలంగాణ సాయుధ పోరాటకాలంలోనూ, తదనంతర కాలంలోనూ ప్రజా రాజకీయాలకు నల్లగొండ ప్రధానక్షేత్రంగానే వుంది.

రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బి.యన్.రెడ్డి, నల్లా నర్సింహులు, యాదగిరి, తిరునగిరి ఒక్కరేమిటి – ఊరూరా ఒకవీరుడు పుట్టి తెలంగాణను రణభూమిగా మార్చారు. తెలంగాణ సాయుధ పోరాటవీరుల త్యాగాల ఫలితంగా ఇక్కడి ఫ్యూడల్ వ్యవస్థ కీళ్లు కదిలినై. తర్వాత ఆ కీళ్లు విరిచే పని ప్రధానంగా ఉత్తర తెలంగాణాలో కరీంనగర్ జిల్లాలో జరిగింది. నల్లగొండ జిల్లా భౌగోళిక స్వరూపమే విచిత్రంగా ఉంటుంది. ఒకవైపు కృష్ణానది గుంటూరును వేరుచేస్తూ కలుపుతూ వుంటుంది. మరోవైపు కృష్ణాజిల్లా సరిహద్దు. ఈ విధంగా బ్రిటీషాంధ్ర సమాజసాంగత్యం ఉంది. ఒకవైపు చుక్క నీటి కోసం నోరు తెరిచే కుష్కీ నేల, మరోవైపు కాస్తో కూస్తో కాల్వ నీళ్లు పారి పంటలు పండేనేల.

తెలంగాణాలోనే కాదు, యావత్ తెలుగు సమాజంలో ఆలోచనా పరంగా నల్లగొండ జిల్లా ముందుంది. మొత్తం, తెలుగు సృజనాత్మక సాహిత్యం సారాన్ని మార్చిన ఘనత నల్లగొండ జిల్లాకు దక్కుతుంది. వివిధ సిద్ధాంతాలు, ఆలోచనలు నిరంతరం ఇక్కడ సంఘర్షించు కుంటాయి, కొట్లాడతయి. వాటి నుంచి సాహిత్యం నిప్పుల గుండాలను రాజేసింది. ఆ నిప్పులోంచే వర్తమాన సాహిత్య, సామాజిక సిద్ధాంతాలకు చేర్పులు, మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితిని నల్లగొండ జిల్లా కవులు, రచయితలు, విమర్శకులు కల్పించగలిగారు. తెంపులేకుండా రగలడం ఈ నేల స్వభావం. అందువల్లనే "తోవ ఎక్కడ?" అనే చింతనా ప్రపంచం విస్తరిల్లింది. ప్రజా రాజకీయాలు గమ్యం చేర్చలేవనే సంఘర్షణ మొదలైన ప్రతిసారీ ఆ అన్వేషణ ప్రతిఫలనాలు సాహిత్యంలోసామాజిక రంగంలో వ్యక్తమవుతూ వస్తున్నై. అవి తల్లిని పిల్లలు వేసే ప్రశ్నలుగా ముందుకొచ్చినై. ఈ సంఘర్షణలో మంచిదనే భావించే వైపు ఉండడానికి కూడా ఈ జిల్లా బుద్ధిజీవులు వెనకాడలేదు. తెలంగాణ ఆంధ్ర మహాసభకు దిశను, దశను నిర్దేశించడంలో గానీ, దిగంబర కవుల్లోని ఇద్దరు తర్వాత విప్లవోద్యంలో భాగం కావడం గానీ, ఆ తర్వాత దళిత బహుజన సాహిత్యానికి తొవ్వలు వేయడం

గానీ, తెలంగాణ రాజకీయ, సాహిత్య, సామాజిక అస్తిత్వ ఉద్యమానికి పునాదులు వేయడం గానీ ఇందులో భాగమే.

తెలంగాణా సాయుధ పోరాటం సామాజిక రాజకీయరంగాలలోనే గాక తెలుగు కళా సాహిత్యాలలోనూ చరిత్ర సృష్టించింది. తెలంగాణా జానపద సాహిత్యం ఈ పోరాట నేపథ్యంలో కొత్త పుంతలు తొక్కింది. ప్రజానాట్యమండలి కళాకారులు, అభ్యుదయ కవి రచయితల స్పందన దానికి తోడైంది. ఆ విధంగా తెలంగాణా పోరాట పాటలు ప్రాణం పోసుకున్నాయి. దొరలు పెట్టే బాధలు, నైజాం నిరంకుశాలు, ఆంధ్ర మహాసభ సంఘం ప్రారంభ పాత్ర, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వీరోచిత ప్రతిఘటన, ఈ క్రమంలో నేలకొరిగిన వీరుల ఆదర్శాలు అన్ని ఆ పాటలలో ప్రతిధ్వనించాయి.

1946 నుంచి ఇందుకు సంబంధించి పలు పాటల సంపుటాలు వెలువడ్డాయి. ప్రజా సాహిత్యకారులు ప్రగతిశీల పరిశోధకులు పలువురు దీనిపై విస్తృతమైన అధ్యయనం చేశారు. విరసం, విశాలాంధ్ర ప్రచురణాలయం పోరాట గీతాల సంపుటాలు ప్రచురించాయి. డా॥ జయధీర్ తిరుమలరావు పెద్ద సంకల్పంగా పెట్టుకుని వూరూరూ తిరిగి ఎన్నెన్నో పాటలు సేకరించి ప్రచురించారు. పరిశోధన కూడా చేశారు. కీ.శే. లక్ష్మీకాంత మోహన్ జానపద గేయాలనూ, డా॥గోపులింగారెడ్డి తెలంగాణా శ్రామిక గీతాలనూ సేకరించారు. ఆరుద్ర, డా॥ఎస్వీ సత్యనారాయణ, డా॥కాశీం వంటివారు ఈ పోరాట సాహిత్యంపై సవివరమైన విశ్లేషణలు చేశారు. సుద్దాల హనుమంతు, తిరునగరి రామాంజనేయులు, సుంకర, నాజర్ వంటి వారి పాటలు సంపుటాలలో వెలువడ్డాయి. దాశరథి, వట్టికొండ రామకోటయ్య, అయ్యపు వెంకట కృష్ణయ్య, కాళోజీ ప్రభృతుల సంపుటాలు వెలువడ్డాయి. వజ్రాయుధంతో మొదలుపెట్టి వెలువడిన అభ్యుదయ రచయితల సంపుటాలు, సంకలనాలు సుపరిచితాలే. ఈ పాటలపైన, వాటికి సంబంధించిన వివిధ అంశాలపైన లోతుగా తులనాత్మకంగా మరింత అధ్యయనం జరగాల్సిన వుంది.

దేశమంటే మనుషులు, ప్రజలు. ప్రజలే తమ చరిత్రను తాను సృష్టించుకొన్నట్లు ప్రజలే తమ సాహిత్యాలను సృష్టించుకొంటారు. ఆరాటం నుండి పోరాటం దాకా సాగిన విప్లవ తెలంగాణా తన చరిత్రను తాను సృష్టించుకుంటూ తన సాహిత్యాన్ని తాను వివచించుకొంది. అందులో వివిధ వర్గాల సాహిత్య సాజాత్య వైజాత్యాలు స్ఫుటంగా వెల్లడయినాయి. పామరులు పాడుకున్న నోటిపాటలు, కల్పనాశక్తిగల గ్రామీణ కవులు కైగట్టి కాగితాల కెక్కించిన గేయాలు, ప్రజల కష్టసుఖాలకు స్పందించి అభ్యుదయ దృక్పథంతో రచనలు చేసినవారి కావ్యాలూ విప్లవ తెలంగాణా విరచించుకొన్న వీర గీతాలకు సజీవ స్వరూపాలు. ఆ సాహిత్యాన్ని నెమరు వేసుకొనడం పుష్టికీ, సంతుష్టికీ అవసరం. దేశంలో ఎక్కడైనా సరే రైతులు నేలను నమ్ముకొంటారు. రైతులకు భూములున్నట్టే, అప్పులు తీర్చడానికి గిట్టుబాటు ధర రాకపోయినా అమ్ముకోక తప్పదు. సొంత చేనుకాక కౌలుకు తీసుకున్నదయితే పెట్టుబడికి తెచ్చిన అప్పుతీర్చాలి. కౌలు కట్టాలి. వడ్డీలు చెల్లించాలి. పన్నులు కట్టాలి. కడుపులు కూడా కట్టుకోవాలి.

తెలంగాణాలో ప్రతి హరిజన కుటుంబంలో వెట్టిచాకిరీ చేయడానికి యెవరో ఒకరిని కేటాయించక తప్పదు. ఊర్లో ఉన్న దొరలకే కాదు. ఊరికొచ్చే అధికార్లకు కూడా తేరగా అన్నీ తెచ్చివ్వాలి. సుద్దాల హనుమంతు ఒకపాటలో అన్నట్టు వెట్టిచాకిరి విధానం ఎంత చెప్పినా తీరదు.

**మాదిగన్న మంగలన్న మాలన్న చాకలన్న**
**వడ్రంగి వడ్డెరన్న వీసిమాలిన చేశారన్న**
**కమ్మరన్న కుమ్మరన్న కూలన్న రైతన్న**
**అన్ని పనులు వాళ్ళతో –** దొరలందరు చేయించుకొనెడి వెట్టి.

ఇది ఒక యెత్తు. గడి చుట్టూ కాపలా కాయటం – కచ్చడాల ముందు ఉరకడం – దొరకు నిద్రపట్టేదాక కాళ్ళుపట్టడం మొదలైనవి మరొక ఎత్తు. చుక్కపొద్దు నుంచి అద్దమరేతిరి దాకా చెయ్యాలి. డాక్టర్ గోపు లింగారెడ్డి చెప్పినట్టు పాలేర్లు, జీతగాండ్రు, పనివాళ్ళు, గాయిదోళ్ళు ఏ పేరు పెట్టి పిలిచినా ఈ శ్రామికులకు రాత్రికూడా విశ్రాంతి ఉండదు. చేలూ, పొలాలు, కంచెల దగ్గరికి కాపలా పోవాలంటారు. రాత్రి మూడుగంటల ప్రాంతంలో మోటగట్టి, పదిగంటల దాకా కీళ్ళు గట్టి, నాలుగు ముద్దలు సద్దితిని, కాసేపు కూడా విశ్రాంతి తీసుకోకుండా నాగలికట్టి సాయంత్రందాకా పొలంలో పనిచేసి, చీకటి పడుతున్నప్పుడు పశువుల్ని తోలుకొని పోయి వాటికి మేతవేసి ఇంటికి వచ్చి, ఉంటే కాస్తతిని, లేకుంటే కాలుతున్న కడుపుతో కావలికి వెళతాడు. ఇది పాలేర్ల సగటు దినచర్య, శ్రామిక స్త్రీలకు తెరపిలేని పనులే. పోరాటం ఏదో ఒక్క ఊళ్ళోనే మొదలవుతుందని చెప్పలేం. మొత్తం అన్ని జిల్లాలలోనూ ఒకే విధమైన దోపిడీ సాగుతున్నప్పుడు అంతటా అసంతృప్తి, ఆవేదనా పోరాడాలనే తహతహ ఉండక తప్పదు. తెలంగాణాలోని వివిధ జిల్లాలలో దోపిడి దొరల ఆస్తి వివరాలు చూస్తే వాళ్ళపై కోపం కూడా అంత విస్తీర్ణమైనదని తెలుస్తుంది. నల్గొండ జిల్లా సూర్యాపేట తాలూకాలోని జన్నారెడ్డి ప్రతాపరెడ్డికి ఒక లక్షా ఏభైవేల ఎకరాల భూమి ఉండేది. 750 ఎకరాల భూమిలో అతనికి మామిడితోటే ఉంది.

బందగీ తర్వాత ఎందరెందరో జిందగీలను అర్పించారు. వీర, కరుణ రసాలలో వారి గాథలు కట్టుకొని జనం అమరవీరులను నిత్యం తలుస్తూ ఉంటారు. భూమికోసం పోరాడి విజయాలు సాధించిన వాళ్ళ జీవితాలు ఆదర్శాలవుతాయి. విసునూరు దేశ్‌ముఖ్ పాలకుర్తి గ్రామంలో చిట్యాల అయిలమ్మ అనే చాకలి స్త్రీకి చెందిన వ్యక్తి పొలాన్ని స్వాధీనం చేసుకోవాలని చూశాడు. ఇది ఆమె సంగపోళ్ళకు చెప్పింది. ఆంధ్ర మహాసభ చాటున పనిచేసే కమ్యూనిస్టులను సంగపోళ్ళు

అంటారు. వాళ్ళు ఆమెకు బాసటయ్యారు. దొర కోసుకుపోదామని చూస్తున్న పంటను అయిలమ్మ సంగపోళ్ళ సాయంతో కోసుకొచ్చింది. "దొరోడు ఏం బీకుతాడో జూస్త" అనగల్గింది. ఆ రాత్రి విసునూరు నుండి పోలీసులు దిగారు గాని అయిలమ్మ ఇంట్లో ఉన్న ఆ ధాన్యాన్ని ముట్టుకొనడానికి సాహసించలేదు. సంగపోళ్ళను, అయిలమ్మ భర్తను పట్టుకుపోయారు. ఆ తరువాత ఏం జరిగిందో శ్రీమతి మల్లు స్వరాజ్యం ఇలా చెప్పారు.



పట్టుకొని... జనగాం జైళ్ళ పెట్టి ఆసనాల్లో కారంబోసి కొట్టి, మూత్రం తాపి, బాగా కొట్టి బాధలు పెట్టిన్రు. వెంటనే ఆమె సద్ది కట్టుకొని హైదరాబాద్‌కు వచ్చి రావి నారాయణరెడ్డిని కల్సుకొని, పెద్దవాళ్ళందరికీ తెలియజేసి, పేపర్‌లో పడేసి, రెప్రజెంటేషన్ యిచ్చి మనోల్లంతా స్టేషన్ దగ్గర జేరి హరాస్మెంటు గురించి విచారించి జమానతు గటించి విడుదల జేసేందుకు ఇవన్నీ జేసిందన్నమాట. ఆ రోజుల్లో స్త్రీలు అంత ఇదిగా ఉన్నారంటే మాటలా? మనవాళ్ళందరితో జెప్పి ఈ పనులన్నీ జేయించింది. అట్లే భూమి, దక్కేసరికి నిలబడ్డది. తర్వాత వచ్చే మంచిచెడ్డలకు కూడా నిలబడి భూమి దక్కించుకున్నది. అయిలమ్మ అచంచల విశ్వాసం అందరికీ ఆదర్శప్రాయమైంది. ఆమె వీరోచిత పోరాటాన్ని కథలుగా చెప్పుకొంటూ ప్రజలు ముందుకు సాగారు. దేశ్‌ముఖ్ రెచ్చి పోయాడు. తన జీవితంలో ఎన్నడూ ఎరుగనంతటి ఘోరమైన ఓటమికి ప్రతీకారం చేయాలను కొన్నాడు, కడివెండి గ్రామంలో ఉన్న సంఘం నాయకుల్ని హత్య చేయించాలని గుండాలను పంపాడు. ప్రజలచేత వాళ్ళు మానేసిన వెట్టి బలవంతంగా చేయించాలని చూశాడు. భయంకర వాతావరణాన్ని సృష్టించాడు. అయినా ప్రజలు భయపడలేదు. నినాదాలు ఇచ్చుకుంటూ ఊరేగింపు మొదలెట్టారు. గూండాలు దాన్ని ఆపుమన్నారు. ప్రజలు ఆపమన్నారు. గుండాలు తుపాకీ పేల్చారు. ముందు వరసన నడుస్తున్న దొడ్డి కొమరయ్య నినాదాలు ఇస్తూనే వాలిపోయాడు. భూమికోసం, భుక్తి కోసం, లేమి నుండి విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో నేలకొరిగిన తొలివీరుడు కొమరయ్య. అతని మరణం ప్రజలను మరింత దీక్షాపరులను చేసింది.



**ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు** అన్న కవి వాక్యం అక్షరాల నిలమైంది. 1946 జూలై 4వ తేదీనాడు మొదలైన ఈ పోరాటం నుండి వేలాది కొలదీ వీరు ప్రభవించారు. ప్రళయాగ్నులు ప్రజరిల్లాయి.

**అమరజీవివి నీవు కొమరయ్యా**
**అందుకో జోహర్లు కొమరయ్యా**

చేసిన శపథం చెల్లించుకోవడానికి ఎందరెందరో అహోరాత్రులు పోరాటాలు సల్పారు. వెట్టి బెడద తీరింది కనుక భూమి మీదికి తిరిగింది పోరాటం. ఉద్యమంలోకి వచ్చిన చైతన్యవంతులైన స్త్రీలు ఉయ్యాల పాటలేసుకుంటూ ఊర్లు తిరిగారు. అంతకుముందు. రాముడిపాటో,





దేవుడి పాటో పాడేవాళ్ళు ఇప్పుడు రాజకీయాల పాటలు పాడసాగారు. ఈ భూస్వాములు ఎట్ల దౌర్జన్యం చేస్తున్నారో, దాని వల్ల స్త్రీలు, పురుషులూ ఎలా బాధపడుతున్నారో, భూములెట్లా పోయాయి. తిండెట్లా లేకున్నది. దీనికంతా కారణమేమిటి ? అసలు ఎవరు పుట్టి పెట్టారు. భూమి ఎవరిది ? అనే విషయాలు ఈ పాటల్లో పాడేవారు. జనం ఉత్సాహ పూరితులయ్యారు. సంఘంలో చేరారు. ఎర్రజెండా పట్టారు.

**"కట్టూ కట్టూ కాదెడ్లబండీ ఓ లచ్చుమయ్యా**
**బండీగట్టూ బండెల్లొ గట్టు**
**బండిమీదా ఎర్రజెండ పెట్టూ**

ఇప్పటికీ బండ్లు కట్టుకొని ఎర్రజెండాలు పెట్టుకొని తెలంగాణాలో అమరవీరుల నగరాలకు జనం వెళుతున్నారు. ఆనాడే తమ దీక్షను దేశముఖులకు ధైర్యంగా చెప్ప గలగారు.

ఇప్పుడు ప్రభువులే బండెనక బండి కట్టుకొని పారిపోవాలి. ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి**
**ఏ బండ్లో పోతవు కొడుకో నా కొడుకా ప్రతాపరెడ్డి ॥బండెనక॥**

ప్రజలు అన్నంత పనీ చేసేవారే. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డొచ్చింది. యూనియన్ సైన్యాలు నైజాం సర్కారులో ప్రవేశించాయి. పల్లెలను చుట్టుముట్టాయి. కమ్యూనిస్టులను వేటాడసాగాయి. యూనియన్ సైన్యాల అండదండలతో భూస్వాములంతా మళ్ళీ వాళ్ళ స్వగ్రామాలకు వచ్చారు. ప్రాణాలకు తెగించి పోరాడి దక్కించుకున్న భూములను ప్రజలు వదులుకోలేదు. గెరిల్లా పోరు ప్రారంభమైంది. భువనగిరి ప్రాంతానికి చెందిన రేణిగుంట రామిరెడ్డి, సూర్యాపేట ప్రాంతంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన గోపాలరెడ్డి మొదలైన వీరులు ధైర్యసాహసాలతో పోరాడారు. వాళ్ళ వీరకృత్యాలను జనం పాటలుగా పాడుకొన్నారు.

రేణిగుంట రామిరెడ్డికి కూడా యాభై దెబ్బల మిడి రైఫోలు ఉంది. దానితో అతడు వీరవిహారం చేశాడు. వానమామలై వరదాచార్యులు గారు 'నిజాం రాష్ట్రపు బీదవెట్టి వాఁడు' అనే శీర్షికతో కొన్ని పద్యాలు రాశారు. పొట్టకేమీలేక తిట్టులే తింటూ, తన నెత్తురు బొట్లు తానే తాగుతూ దైవాన్ని కూడా దూరక దాస్యవిధిని బతికే నైజాం బీదవెట్టి వానిలో వీరత్వాన్ని ప్రశంసించాడు.

**పరసమృద్ధికి సంతోషపదుచునుందు**
**వీరుడా ! నైజాం బీదవెట్టివాఁడ !**

దాశరథి ప్రజల కష్టాలకు స్పందించాడు. నైజాము దౌష్ట్యాలకు ఎదురు తిరిగాడు. తన జన్మస్థానమైన 'తెలంగాణ కోటి రత్నాల వీణ' అని భావించాడు. ఆ వీణను నిజాం ఏం చేశాడో ఇలా చెప్పాడు.

**ఓ నిజాము పిశాచమా ! కానరాదు**
**నిన్ను బోలిన రాజు మాకెన్నడేని**

ఆ వీణనే తాను 'రుద్రవీణగా చేసుకొని 'అగ్నిధార' ను కురిపించాడు. నిజాము నిజస్వరూపాన్ని బయటపెట్టాడు.. రజాకారులు చేసే ఘాతుకాలకు ప్రతీకారం చేయాలి. ప్రజలను అందుకు సంసిద్ధులను చేయాలి. కాళోజీ నారాయణరావు సరైన సమయం రాగానే ఏం చేయాలో ఇలాగ ఉద్బోధించాడు.

**మన కొంపలార్చిన మన స్త్రీల చెరచిన**
**మన పిల్లలను చంపి మనల బంధించిన**
**మానవాధములను మండలాధీశులను**

చేరకుండా స్వతంత్రాన్ని ప్రకటించుకొందామని నిజాం ప్రయత్నాలు చేస్తున్నప్పుడు దాశరథి ఇలా అన్నాడు.

**తరతరాల స్వప్నాల సుందర ఫలమ్ము**
**స్వైర భారత భూమి చూపడెనోలేదో**

తెలంగాణాలో ప్రజలూ, స్థానికకవులూ ఈ వీరోచిత సమరాన్ని కొనసాగిస్తున్న అభ్యుదయ రచయితల ఉద్యమం చాలా ఉధృతంగానే సాగుతూంది. ఏటేటా మహాన్ జరుపుతూ 'అభ్యుదయ రచయితల సంఘం' తరపున 'అభ్యుదయ' అనే ఒక ఒక పత్రిక నడుపుతూ 1947 నాటికి అయిదు సంచికలను ప్రచురించారు. అయితే ఆ సంచికలలో, ఆ ఆరుమాసాల కాలంలో ఆంధ్ర ప్రజానీకాన్ని కుదిపివేసిన తెలంగాణా పోరాటాన్ని చిత్రించే రచనలేమి, గీతాలేమీ ఏమీ ప్రచురించలేదు. అలాంటి గేయాలు 'ప్రజాశక్తిలోను, ఇతర ప్రగతివాద పత్రికలలోను వచ్చాయి. పీడిత ప్రజల పక్షాన నిలబడే కవులు లేకపోలేదు. వారు గొంతెత్తి తెలంగాణా రణగీతాలు ఆలపించారు. తెలంగాణాలోని తమ్ములకు బాసటగా తమ కవితలు అంకితం చేశారు.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5 (47) హైదరాబాద్ మార్చి : 2022

# తెలంగాణ దళిత వాగ్గేయకారుడు గూడ అంజన్న – విప్లవ దృక్పథం

**సంగి సంజీవ్ కుమార్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 9247271765



సమాజంలో నిత్యం ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతూనే ఉంటాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యలను పారదోలడం, పరిష్కరించడం, ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం చేయడం అవసరం. అందుకోసమే ఎన్నోరకాల ఉద్యమాలు పుట్టాయి. ఇటువంటి ఉద్యమాలకోసం ప్రజాసంఘాలు పుట్టాయి. వీటికి తోడు సమాజాన్ని ప్రతిబింబించే సాహిత్యం వివిధ ప్రక్రియలతో ఉద్యమాలకు ఊపిరులూదాయి. అందులో ప్రధాన పాత్ర పోషించేదిగా పాట ఆవిర్భవించింది. ఇంతటి శక్తి కలిగిన పాటను వాగ్గేయకారులు జనంలోకి తీసుకెళ్ళి చైతన్యం చేయడంకోసం ప్రయత్నిస్తూనే ఉంటారు. వీరిలో తమవంతు పాత్రను దళితవాగ్గేయకారులు పోషించారు.

**“విప్లవం అనేమాట ఇంగ్లీషులో** revolution **అనే మాటకు సమానంగా తెలుగులో వాడుతున్నాం. బ్రౌన్ నిఘంటువులో ‘విప్లవం’ అనే మాటకు** ruin, national calamity, **దేశోపద్రవము అనే అర్థాలున్నై. శబ్ద రత్నాకరము, సూర్యరాయాంధ్ర నిఘంటువులలో కూడా ఈ రకమైన అర్థాలే ఉన్నై.”** (రంగనాథాచార్యులు, కె.కె (సంపా.). రామారావు, చేకూరి (రచయిత). ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు. మొత్తంగా మనం విప్లవం అంటే ప్రధానంగా అర్థం చేసుకోవాల్సింది ‘చైతన్యంతో కూడిన మార్పు’ అని. ఆ మార్పుకోసం సమాజంలో ఎన్నో ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. వీటిలో మొదటి వరుసలో నిలిచేది విప్లవోద్యమం. దళిత వాగ్గేయకారులు విప్లవోద్యమానికి అందించిన గేయాలను ఇక్కడ విశ్లేషించాను.

తెలంగాణ దళిత వాగ్గేయకారుడైన గూడ అంజయ్య రాసిన ‘ఊరు మనదిరా!’ పాటను ఇక్కడ మనం చూడవచ్చు.

**“ఉరుమనదిరా! ఈ వాడమనదిరా!**
**పల్లె మనదిరా! ప్రతి పనికి మనంరా!**
**సుత్తి మనది! కత్తి మనది**
**పలుగు మనది! పార మనది**
**బండి మనదిరా! బండెడ్లు మనయిరా!**
**దొర యెందుకురో! దొరతనమెందుకురో–నడుమ”** (అంజయ్య, గూడ. ఊరు మనదిరా. 1999: 1).

తెలంగాణ పల్లెల్లో దొరలు, వారి పెత్తనం ద్వారా నిత్యం శ్రమచేస్తూ జీవనం గడిపే ప్రజలు ఎన్నో బాధలను ఎదుర్కొనేవారు. పల్లెలు ముఖ్యంగా వ్యవసాయాధారిత కేంద్రాలు. కనుక అక్కడ వ్యవసాయాన్ని ఆసరాగా చేసుకొని అనేక వృత్తులవారు జీవనం సాగిస్తుంటారు. ఈ పనులు చేస్తూ ప్రజలు జీవనం గడుపుతుంటారు. ఇందులో పెద్ద దొరలది ఏమీ ఉండదు, అధికార అహంకారం, దోపిడీ, అరాచకాలు తప్ప. అందుకే గూడ అంజయ్యగారు ఈవిధమైన పాట రాసారు. ఊరుమనది, వాడమనది, పల్లెమనది, ప్రతిపనికి మనం. పార, పలుగు, బండి, బండెడ్లు మనవే. కానీ మధ్యలో ఈ దొర యెందుకు, దొరతనం ఎందుకు అని ప్రశ్నిస్తూ పాటందుకున్నాడు గూడ అంజయ్య. అరకలు పట్టి దున్నేది, కంచెకు కాపలాగా ఉండేది, పశువుల కాడ, దొడ్లకాడ మనమే. అన్ని పనులు చేసేది కూడా మనమే కదా. బరువులు మోసేది మనం, సాకిరేవు, సావు, సొన్నాయి ఇలా అనేకానేక పనుల్లో మనం లీనమై శ్రమ ఒడుస్తూ పంటలు పండిస్తున్నాం. ఆ పంటలపై మాత్రం మధ్యలో దొర, దొరతనం ఎందుకో అని దొరల అహంకారాన్ని ప్రశ్నిస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

**“గట్టుమీద దొరోడు! చెట్టులెక్క నిలుసుండి**
**ఆలినుండి తల్లిదాక! వాయి వరుస లేకుండ**
**తిట్టుదేందిరో! దొర కొట్టుదేందిరో–నడుమ**
**దోపిడేందిరో–దొరపీకుడేందిరో...**

**కూలి నాలి పేదోళ్ళం! కలిసిమెలిసి వుండాలే**
**సంఘపోల్ల జెండ కింద! సంఘమొకటి బెట్టాలే**
**మనల దోచే–ఈ దొరల మక్కెలిరుగదన్నాలే”** (అంజయ్య, గూడ. ఊరు మనదిరా. 1999: 2).

దుక్కి దున్ని, నారు పోసి, నీరుపెట్టి చివరికి పంట పండేవరకు ప్రజలు చేయిచేయి కలిపి పనిచేస్తూ రకరకాల ఆహార ఉత్పత్తులను సృష్టిస్తున్న ప్రజలు సృష్టిస్తున్నారు. అటువంటి కష్టజీవులపై దొరలు పెత్తనాన్ని చెలాయిస్తూ గట్టుమీద కూర్చోని వాయివరుస లేకుండా తిడుతుంటారు. చిన్నకారణాలకైనా, అకారణంగా కూడా ప్రజలను

హింసిస్తుంటారు దొరలు. వీటన్నింటిని ప్రశ్నిస్తూ తన పాటను దొరలపై ఎక్కుపెట్టాడు అంజయ్య. ప్రజలు ఏవిధంగా కలిసుండాలో కూడా చైతన్యపరుస్తున్నాడు రచయిత. ఈ దొరల ఆధిపత్యాన్ని అరికట్టడం కోసం నక్సలైట్లు నాడు ఏర్పాటు చేసుకున్నారు. వారి సంఘం నీడలో ఒక సంఘాన్ని ఏర్పర్చుకొని అందరం సంఘటితమై దొరలను తరిమికొట్టాలని గూడ అంజయ్యగారు ఈ పాట ద్వారా పిలుపునిచ్చారు. ఈ పాట నాటి సమాజంలో (70వ దశకంలో) ఉధ్రుతలూగించింది. ఎంతోమందిని చైతన్యం చేసి, మేల్కొల్పింది. ఈ పాట కేవలం తెలుగు భాషలోనే గాక ఇతర పొరుగు భాషల్లోకి కూడా అనువాదం పొంది దోపిడీదారులైన దొరల ఆధిపత్యాలను ఎండగట్టింది. ఈ పాట విస్తరించిన విధానాన్ని రవీందర్ 'ఊరుమనదిరా' పాటల పుస్తకానికి 'స్పందన' రాస్తూ కింది విధంగా అంటాడు.

**"ఉద్యమాలకు ఉపిరులనందించిన పాట ఊరు మనదిరా అనే పాటను గూడ అంజన్న రాసినా, అది అన్న పాటే అయినా దాన్ని తెలుగులోనే రాసినా... అది క్రమంగా తెలుగు నేలను దాటి తమిళ, కన్నడ, మరాఠి, మళయాల రాష్ట్రాలకు పాకింది. క్రమంగా దేశవ్యాప్తంగా ప్రచారం పొందింది. అలా అలా అదింత ప్రచారం పొందిందంటే...? ఆఫ్రికా విముక్తి ఉద్యమంలో ఉద్యమకారులందరు ఈ పాటను ఒక నినాదంగా, స్ఫూర్తిగా పాడుకొనేంతగా ప్రచారం పొందింది. బహుశ ప్రపంచ ఉద్యమాల చరిత్రల్లో ఏ పాట ఇంత ప్రచారం పొందిలేదేమో అన్పిస్తుంది. 'వందేమాతరం లాంటి ఒకటి రెండు ఉద్యమ గీతాలున్నా అవి పుట్టి ప్రచారంలోకి వచ్చిన తీరు వేరు. పైగా వాటిలో దేశభక్తి మిళితమై ఉంది కదా... కానీ ఈ పాటలో ఊరు, ఊరు బతుకులు మాత్రమే ఉన్నాయి. మీరు రైల్లో మద్రాసుకో, ఊరు మనదిరా పాటను తెలుగులో ఒక చరణం పాడి వదిలేస్తే ఆ డబ్బాలో ఏదో ఓ మూలనుండి ఆ పాట రెండో చరణాన్ని ఎవరో ఒకరు తమిళంలో అందుకుంటారు. బొంబాయికి వెళ్ళే రైల్ అయితే ఇంకొకరు మరాఠిలో అందుకోవచ్చు. ఇలా ఇంతలా ప్రచారం పొందిన పాట అది. ఆ పాటను రాసిన అంజన్నకు అభినందనలు."** (అంజయ్య, గూడ. రవీందర్, దుర్గం (స్పందన). 1999: ix).

పాలకులు పాలితులను ఎన్ని రకాలుగా మోసం చేస్తారో, ఎంతకాలం మోసం చేస్తారో 'మల్లొచ్చిండే లీడరోడు' అనే పాట ద్వారా రచయిత గూడ అంజయ్య తెలియజేస్తున్నాడు.

**"మల్లొచ్చిండే-ఓట్ల కొరకు లీడరోడు**
**కద్దరు బట్టలేసుకొని-గాంధీటోపీ పెట్టుకొని**
**ఓట్ల కాలమొచ్చిందని-నోట్లన్ని పంచుకుంట**
**మురికి పేటలాకొచ్చి-ముక్కిరుసుకున్నాడు**
**పడిపోయిన ఇండ్లజూసి అయ్యో పాపమన్నాడు**
**కంపు వాసనకు దొర-కసురుకొంటుండు"** (అంజయ్య, గూడ. ఊరుమనదిరా. 1999 : 8).

ప్రజాస్వామ్యం అనే ముసుగులో పాలకులు తమ స్వార్థంతో పాలితులను నిత్యం మోసం చేస్తూనే ఉంటారు. సీటుకోసం ఓటును కొనుక్కోవడం, ఎన్నికలొచ్చినప్పుడే సమస్యలు గుర్తుకు రావడం, మాయచేసి హామీలివ్వడం లాంటివి రాజకీయ నాయకులు చేస్తుంటారు. బీదలు ఉంటే నివాస ప్రాంతాలకు బలవంతంగా వచ్చి, మురికి వాసన భరించలేక ఓట్లను అడుక్కుంటారు. అభివృద్ధి చేస్తామని హామీలిస్తుంటారు. బడులు, దవాఖానాలు, భూములివ్వడం మొదలైన హామీలిస్తారు. ఓట్లేపించుకుంటారు. తర్వాత యథావిధిగానే కొనసాగుతుంది. ఎన్నికలొచ్చినప్పుడే బీద ప్రజలు గుర్తుకొస్తారు.

**"బతుకుదెరువు లేనోళ్ళు-సంఘమొకటి పెట్టుకుంటే**
**కూలి నాలి బెంచమని-కూలోల్లు సమ్మె జేస్తే**
**పోలీసుల పంపునాడు-జైళ్ళపాలు జేసినోడు**
**ఓట్లకచ్చినోన్ని బట్టి-కాళ్ళు జేతులు గట్టి**
**కీళ్ళు వేళ్ళు ఇరుగదన్ని-నడ్డిమీద వాత లెట్టి**
**ఓట్లని మల్లత్తేవాన్ని పల్లె దాటగొట్టాలె"** (అంజయ్య, గూడ. ఊరుమనదిరా. 1999: 9)

నాయకులు గెలిచేవరకు ఒకరకంగా, గెలిచిన తర్వాత ఒకరకంగా మారతారు. దొరలు అధిక పని చేయించుకొని కూలిమాత్రం తక్కువ ఇచ్చేవారు. దాన్ని ప్రజలు సంఘం అండతో వ్యతిరేకిస్తూ సమ్మె చేస్తే వీరి ఓట్లతోనే గెలిచి, సమ్మెచేసే బీదవారిని పోలీసులతో కేసు పెట్టించి జైలుకు పంపిస్తారు. దొరలకు అండగా నిలుస్తారు. సంఘం స్ఫూర్తితో కూలీలు చైతన్యవంతమై ఇక నాయకుల ఆగడాలను సాగనివ్వవద్దని నిర్ణయించుకుంటారు. ఓట్లకొచ్చినోన్ని పట్టుకొని కాళ్ళ చేతులు కట్టివేసి, ఇరుగదన్ని నడ్డిమీద వాతపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఓట్లని మళ్ళీ వస్తే వాళ్ళను పల్లెదాటేదాక తరిమి తరిమి కొట్టాలని, తెగించి పోరాడాలని నిశ్చయించుకుంటారు. వారిలో మార్పు రావాలని, వారి జీవితాలు మారాలని ఈ విప్లవ పాటను రాశాడు గూడ అంజయ్యగారు.

**"ఎన్నాళ్ళురో ఈ ఓపికలు ఓదార్పులు**
**ఇంకెన్నేండ్లురో ఈ బానిస బతుకులు**
**పూట గడవువనీ బతుకులు-పొట్టగంజి మన బతుకులు**
**నీ తాత జీతగాడు-నీ తండ్రి జీతగాడు**
**యెట్టీలు జేసినారు-దొర ఇల్లు నింపినారు**
**సావంగ జీవి గంజిలేక-వొర్రుకుంట సచ్చిండ్రు"**

(అంజయ్య, గూడ. ఊరుమనదిరా. 1999: 9).

దొరల ఆధిపత్యం నడుస్తున్న కాలంలో ప్రజలు బానిస బతుకులు బతికి, కూటికిలేక అల్లల్లాడిపోయారు. పంటలు పండించేవారు మాత్రం ప్రజలే. కానీ వీరికి కనీస అవసరాలైన తిండి కూడా దొరకడం కష్టంగా ఉండేది. సమాజంలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. కానీ ఈ బీదల బతుకుల్లో మాత్రం

ఏ మార్పు రాలేదు. రాచరికం పోయి, ప్రజాస్వామ్యం వచ్చినా దొరల ఆగడాలు ఆగలేదు. నేడు దొరలు కనిపించకపోయినా ప్రజాస్వామ్యం ముసుగులో దోపిడీ రూపం మార్చుకుంది. దొరల దగ్గర అధిక భూమి ఉండేది. అదేగాక బీదల దగ్గర ఉన్న ఎకరా, రెండు ఎకరాలు కూడా రకరకాల ఇబ్బందులకు గురిచేసి లాక్కునేవారు. వారిని దొరలు తమ దగ్గర వెట్టి చేయించుకునేవారు. బీద ప్రజలు తాతలు, తండ్రులు, కొడుకులు ఇలా తరతరాలుగా వెట్టి చేస్తూనే ఉంటారు. తమ రక్తాన్ని దొరల ఇళ్ళలో, పొలాల్లో ధారపోస్తూనే ఉంటారు. పంటలు దండిగా పండించి దొరల గడీలు నింపాలి. కానీ ఇంతచేసినా కనీసం తినడానికి తిండి కూడా ఉండదు. చివరకు చనిపోయేటపుడు జీవిగంజి పోయడానికి కూడా మెతుకు ఉండదు. ఆకలితో అలమటిస్తూ కనుమూయాల్సిందే.

అందుకే ఎన్నాళ్ళు ఈ ఓపికలు, ఓదార్పులు అంటున్నాడు రచయిత. ఇంకెన్నేండ్లు ఈ బానిస బతుకులు, పూటగడవని బతుకులు, ఎట్టి బతుకులు మనకు. మన పూర్వుల నుంచి దొరలకు ఊడిగం చేస్తున్నది చాలు ఇక పోరాడదాం అంటూ పిలుపునిస్తున్నారు.

తెలంగాణలోని ప్రజలు అగ్రవర్ణాలైన దొరలు, భూస్వాముల నుండి అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొంటూ బానిస బతుకులు బతుకుతున్నారు. అది చూసి తట్టుకోలేక నక్సలైట్లలో చేరి దొరల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రయత్నిస్తున్నారు యువకులు. ఈ విధానం అధికంగా 1970వ దశకంలో కనిపిస్తుంది. అలా నక్సలైట్లలో చేరిన కొడుకుల తల్లుల ఘోషను **'ఎక్కడున్నాడో కొడుకు?'** అనే పాట ద్వారా మనకు గూడ అంజయ్యగారు తెలుపుతున్నారు. వాళ్ళు విప్లవ మార్గం ఎంచుకొని ఎలా ముందుకు సాగిపోతున్నారో మనం ఈ పాటద్వారా గమనించవచ్చు.

**"ఎక్కడున్నాడో ఏమో! కొడుకు**
**ఏ వూరు తిరుగుతుండేమో**
**ఏ తల్లి బుక్కెడు గంజి బోసెనో లేదో"** (అంజయ్య, గూడ. ఊరుమనదిరా. 1999: 10)

దోపిడీని, అరాచకత్వాన్ని తట్టుకోలేని యువకులు నక్సలైట్లలో చేరి ఉద్యమానికి సై అంటున్నారు. అలాంటి వారి గురించి వారి తల్లులు ఓ వైపు తన కొడుకు తనకు దూరమయ్యాడనే బాధపడుతూనే, అందరిని విముక్తి చేయడం కోసం తన కొడుకు చేస్తున్న పనిని సమర్థిస్తున్నట్టు ఈ పాటలో మనం చూడవచ్చు. అజ్ఞాతంలో ఉన్నవారికి తినడానికి, ఉండటానికి ప్రత్యేకంగా ఒకచోటంటూ ఉండదు. ఎక్కడ పడితే అక్కడ, ఏది దొరికితే అది తిని, నిత్యం ప్రయాణిస్తూనే ఉండాలి. అందుకే తన తల్లి ఎక్కడున్నాడో ఎలా తింటున్నాడోనని బాధపడుతుంది. మనం పేదోల్లం బిడ్డ, ఈ పెద్దదొరలతోని మనం పోరాడలేము. వారితో గెలవలేము అని ఎన్ని మాటలు చెప్పినాగాని తల్లిమాట వినకుండా,



తన మార్గానికి అడ్డురాకంటూ ఆ యువకుడు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. ఊరు వేరైనా, వాడ వేరైనా బీదవాళ్ళంతా ఒక్కటే అంటూ ఉద్యమాన్ని నిర్మిస్తున్న సందర్భంలో పోలీసులు అతన్ని పట్టుకోవడానికి వెతుకుతున్నారని అతని తల్లి బాధపడుతుంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**

1. కాశీం, సి. 2011. 'తెలంగాణ ఉద్యమాలు – పాట, సాహిత్య వ్యాసాలు.' హైదరాబాదు: సహచర ప్రచురణలు.

2. రవీందర్, పసునూరి. 2012. "తెలంగాణ గేయ సాహిత్యం – ప్రాదేశిక విమర్శ." హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. పిహెచ్.డి. పరిశోధన.

3. అంజయ్య, గూడ. 2007. సినిమా పాటలు. హైదరాబాద్. హేమ సాహితి ప్రచురణలు.

4. అంజయ్య, గూడ. 1999. ఊరుమనదిరా. హైదరాబాద్. హేమ సాహితి ప్రచురణలు.



ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2022

# వాసిరెడ్డి సీతాదేవి నవలలు – జీవన చిత్రాలు

**ఎం. రాజ్‌కుమార్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఫోన్ : 9951334636



ఏ దేశ సాహిత్యంలోనైనా విశేషమైన పాఠకాదరణ పొందుతున్నవి నవలలే. తెలుగు నవలా సాహిత్యం ఈనాడు అనంతమైన వస్తువైవిధ్యంలో జీవించి కళామయం చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే తెలుగు నవలకి వస్తువు కానిదేదీలేదు. ఇంత వస్తువైవిధ్యం మరే ఇతర సాహిత్యానికి ఉన్నట్లు కానరాదు. వందేళ్ళ తెలుగు నవల సమాజంతోపాటు తాను మారుతూ సమస్త జీవన రంగాలకు ప్రతిబింబంగా నిలుస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదు. కథ, నాటకం, కవిత, విమర్శవంటి ప్రక్రియలతో పోల్చితే మిగితావన్నిటికంటే ఉన్నతంగా వుంటూ సమకాలీన సామాజిక రుగ్మతల యొక్క అన్ని పర్శ్వాలను స్పృశించింది ఈ నవల.

'నావెల్' అనే ఆంగ్ల పదానికి నూతనమైన లేదా కొత్త అనే అర్థం ఉంది. సాహితీ చరిత్రలో నూతనంగా, కొత్తగా కనపడిన ఈ ప్రక్రియను 'నావెల్' అన్నారు. ఆ మాటే తెలుగులో నవల అయింది. నవల అన్న పదానికి 'స్త్రీ' అని కూడా అర్థం ఉంది. ఆ కారణం వల్లనేమో తెలుగులో నవలలు రాసే వారిలో రచయిత్రులే ఎక్కువగా ఉన్నారు. చాలామంది రచయిత్రులకు భిన్నంగా నవలలు రాసిన ఖ్యాతి వాసిరెడ్డి సీతాదేవికి దక్కుతుంది. రచయిత్రులు ఎక్కువగా ప్రేమ వ్యవహారాలు, కుటుంబ గొడవల నేపథ్యంలో రచనలు సాగిస్తే – సీతాదేవి మాత్రం సామాజిక స్పృహతో తన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుంటూ అందులోని లోటుపాట్లను ఎత్తిచూపుతూ రచనలు చేశారు. సమాజంలోని హెచ్చుతగ్గులూ, సగటుజీవి ఎదుర్కొంటున్న సమస్యలనూ వివరిస్తూ అన్యాయాలను ఎదిరిస్తూ, ప్రశ్నిస్తూ సాగుతాయి ఆమె రచనలు. ముఖ్యంగా గ్రామీణ జీవితపు నేపథ్యాన్ని సృష్టించి, మానవ సంబంధాలు అల్లడంలో సిద్ధహస్తురాలు.

ఓ రైతు కుటుంబంలో పుట్టి తెలుగు సాహిత్య ప్రపంచంలో శిఖరాగ్రానికి చేరుకున్న రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి. తన ఊళ్లో కేవలం ఐదో తరగతిదాకా మాత్రమే చదువుకుని, ఆ తర్వాత చదువుకునే పరిస్థితులు లేకపోయినా, ఎదురీది పోరాడి పై చదువులు చదివి, రెండు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు దక్కించుకున్న ప్రతిభామూర్తి సీతాదేవి. అనుకోకుండా మొదలైన ఆమె సాహిత్యజీవితం ఎన్నో మలుపులు తిరిగింది, ఎన్నో విజయాలు సాధించింది. కథారచయిత్రిగా సాహిత్యయాత్ర ప్రారంభించిన సీతాదేవి నవలారచయిత్రిగా పాఠకుల హృదయాల్లో చెక్కుచెదరని స్థానాన్ని సంపాదించుకున్నారు.

అర్ధశతాబ్దికి పైగా తన రచనల ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వాసిరెడ్డి సీతాదేవి మొదటి నవల 'అడవి మల్లె', దాని రచనా కాలం 1962–63 కాగా, ఆఖరి నవల 'ఊర్మిళను 1989–1990లలో రాశారు. 1952లో రాసిన 'సాంబయ్య పెళ్ళి' సీతాదేవి మొదటి కథ కాగా, 2007లో రాసిన 'చీకటి తెరలు' ఆమె చివరి కథ. 13 ఏప్రిల్ 2007 సం॥రంలోనే వీరు స్వర్గస్తులైనారు.

పరిసరాలు వ్యక్తిని ప్రభావితం చేస్తాయని మనోవిశ్లేషకులు చెప్పిన దానికి నిదర్శనంగా సీతాదేవి తనచుట్టూ ఉన్న పరిస్థితులనే రచనలకు నేపథ్యంగా ఎంచుకున్నారు. ముఖ్యంగా ఆమె పుట్టి పెరిగింది గ్రామీణ నేపథ్యంలో కాబట్టి వీరి సాహిత్యంలో ఎక్కువ భాగం గ్రామీణ వాతావరణం కనిపిస్తుంది. కట్టుబాట్లు, మూఢనమ్మకాలు పల్లెల్లో అధికంగా కనిపించే వర్గ పోరాటాలూ, అగ్రకులస్థులు చేసే అక్రమాలు, అణచివేతలు మొదలయిన అంశాలను తన నవలలకు ప్రధాన వస్తువుగా ఎంచుకున్నారు. అటువంటి అణచివేతలు, దౌర్జన్యాల కారణంగా పీడితులు ఎలాంటి సంఘర్షణకు లోనయ్యారో తన రచనల ద్వారా తెలియజెప్పారు. ముఖ్యంగా అవిద్య వల్ల పల్లెల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్త్రీలపై జరిగే హింస ఆమెను కదిలించివేశాయి. ఇటువంటి ఉదాహరణలతో వెలువడ్డ నవలలు మట్టి మనిషి, మరీచిక, రాబందులూ – రామచిలుకలు, వైతరణి, ఉరిత్రాడు మొదలైనవి.

ఏ దేశచరిత్ర పుటలు తిప్పినా కనిపించేది, స్త్రీజాతి బానిసత్వమే! వినిపించేవి ఆమె కన్నీరు చెప్పిన కరుణకథలే! ఆమె త్యాగాలనూ సహనాన్నీ మమతల్నీ ఆత్మ సమర్పణనూ, ఆమె బలహీనతలుగా గుర్తించింది సమాజం. ప్రాచీనతను గౌరవించవలసిందే. కాని ఆ ప్రాచీనతనే అంటిపెట్టుకొని. ఆ ప్రమాణాలతోనే స్త్రీని ఇంకా రెండవ శ్రేణి వ్యక్తిగా కొలవడం పరమ దుర్మార్గం. స్త్రీల విముక్తి కొరకు ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా,

ఎన్ని రకాల ఉద్యమాలు నడిచినా, మహిళ ఆర్థిక పరిస్థితి పురుషుడితో సమానంగా లేనంతవరకు ఆమె సమాజంలో రెండవ శ్రేణి వ్యక్తిగా బ్రతకక తప్పదు. సమాజంలో స్త్రీల అణచివేత ఎన్నివిధాలుగా ఉందో, అన్ని కోణాలలోంచి సమాజాన్ని తన రచనలలో చూపారు రచయిత్రి.

నవలా ప్రక్రియలో విశేష కృషి చేసి, యువతరం నవలలకు మార్గదర్శిగా నిలిచిన రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి. ఇతివృత్తానికి అనుగుణంగా పాత్రలను మలచడంలో, సన్నివేశాలను చిత్రీకరించడంలో అందె వేసిన చేయి ఆమెది.

నిజమైన సాహిత్యం ఆనాటి సమాజాన్ని ప్రతిబింబిస్తూనే వుంటుంది. విభిన్నమైన వస్తువుల్ని తీసికొని ఆనాటి సమాజాన్ని తన రచనలలో ఆవిష్కరించిన రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి. వీరు గుంటూరు జిల్లాలోని చేబ్రోలులో 1932లో డిసెంబర్ 15న జన్మించారు. పరదా పద్ధతి పాటించే అతి సాంప్రదాయ కుటుంబంలో పుట్టి, బయటకు వచ్చి, స్వయంకృషితో ఉన్నత చదువులు చదివి, ప్రభుత్వ రంగంలో ఎన్నో ఉన్నతోద్యోగాలు చేశారు. సీతాదేవిగారు ఎన్ని రచనలు చేసినా, ఆమెకు ప్రధానంగా కీర్తి తెచ్చిపెట్టినవి నవలలే. ఈమె రచించిన మట్టిమనిషి 14 భాషల్లో అనువాదమైతే, మరీచిక నవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిషేధానికి గురైంది. తోటి రచయిత్రులు కుటుంబ వృత్తాంతాన్ని, ప్రేమకథల్ని ఇతివృత్తంగా తీసికొంటే సీతాదేవిగారు మాత్రం సంక్షుభితమైన సమస్యలతో అల్లకల్లోలమైన సంఘాన్ని, గ్రామీణ జీవితాన్ని, తన రచనలకు ఇతివృత్తంగా ఎన్నుకొన్నారు.

పితృస్వామ్య వ్యవస్థను, పెట్టుబడిదారీ సమాజంలోని లోపాలను తన కలంకత్తితో చీల్చి చెండాడుతూ, సజీవమైన పాత్రల్ని సృష్టించి, సంఘం వీపుపై చెర్నాకోల దెబ్బలవంటి నవలల్ని రాశారు. అలాంటి నవలే మరీచిక. 1970,1980 దశకాలలో యువతరాన్ని పట్టి పీడించిన హిప్పీయిజం, నక్సలిజం సమస్యల గురించి, విద్యార్థులపై వాటి దుష్ప్రభావం గురించీ, వీటన్నిటికీ కారణమైన అస్తవ్యస్తమైన సమాజంపై ఎక్కుపెట్టిన అస్త్రమే మరీచిక నవల.

సీతాదేవి 1952 నుంచీ కథారచన మొదలెట్టారు. 1954లో 'వాసిరెడ్డి సీతాదేవి కథలు' అనే పేరుతో పుస్తకం ప్రచురితమైంది. ఏ ఉద్యోగంలో ఉన్నా సీతాదేవి తన ఆలోచనలకు అడ్డుకట్టలు వేయలేదు. అక్షరబద్ధం చేయడం ఆపలేదు. సమాజాన్ని నిశితంగా పరిశీలించడం ఆమెకు అలవాటు. అందుకే ఆమె రచనలు వాస్తవాలను ప్రతిబింబించేవి. నవల బహుళ ప్రజాదరణ పొందిన సాహితీ ప్రక్రియగా ఉన్న సమయంలో ఆమె రచనలు మొదలు పెట్టారు. అయితే అప్పటి రచయితలకు భిన్నంగా విషయాన్ని ఎంచుకోవడంలో సీతాదేవి తనదైన మార్గాన్ని ఎంచుకున్నారు. తన చుట్టూ ఉన్న జీవితాన్ని తన గ్రామీణ జీవితపు నేపథ్యాన్ని నవలల్లోకి తీసుకున్నారు.







తొలిరోజుల్లో రాసిన నవలల్లో రచయిత్రి స్త్రీవాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. స్త్రీ పురుష వివక్షను తీవ్రంగా ఖండిస్తుంది కానీ ఆమె స్త్రీవాదినని ఎప్పుడూ చెప్పుకోలేదు. సాయుధ విప్లవ నేపథ్యంతో రాసిన 'మరీచిక'ను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. తర్వాత హైకోర్టు ఉత్తర్వుతో నిషేధాన్ని ఎత్తివేశారు. అందులో ఇద్దరు యువతుల్లో ఒకరు సాయుధ విప్లవం వైపు, మరొకరు ఆధునికత, స్వేచ్ఛ పేరుతో హిప్పీ సంస్కృతివైపు సాగుతారు. అవగాహన లేకుండా సాగే యువతరం గురించి రచయిత్రి పడిన ఆవేదన ఇందులో కనిపిస్తుంది. వ్యవసాయ రంగం నేపథ్యంగా, రైతు కథానాయకుడుగా సీతాదేవి రచించిన 'మట్టిమనిషి' నవల ఎందరినో కదిలించింది. రైతుకి భూమితో ఉండే అనుబంధాన్ని ఆమె హృద్యంగా ఆవిష్కరించారు. మరో నవల 'సమత'లోనూ స్త్రీవాదం బలంగా కన్పిస్తుంది.

గ్రామీణ సమాజం మారుతోంది. ఒకనాటి విలువలు ఈనాడు లేవు. నేటి గ్రామీణ సమాజంలో స్త్రీల పరిస్థితి ఎంతో మెరుగయ్యింది. స్త్రీలకు ఓటు హక్కు, ఆస్తిహక్కు ఏర్పడ్డాయి. స్త్రీలలో చాలావరకు విద్యావ్యాప్తి జరిగింది. అన్ని రంగాల్లో స్త్రీలకు ప్రాముఖ్యం పెరిగింది. స్త్రీ జాతికి సంపూర్ణమైన స్వేచ్ఛ లభించాలని వారిలో పరివర్తన కలగాలని ఈమె నవలలు రాసారు.

నవలా రచయిత తాను చెప్పదలచుకున్న విషయాన్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో చెప్పటాన్నే శిల్పం అంటారు. అయితే చెప్పదలచుకున్న విషయాన్ని అందంగా శక్తివంతంగా స్పష్టంగా, ఉత్కంఠను రేకెత్తించే విధంగా చెప్పటంలోనే ఒక రచయిత ప్రతిభ వ్యక్తమౌతుంది. విషయం ఎంత గొప్పదైనా, ఆ విషయానికి అక్షరరూపం ఇచ్చిన పద్ధతి పేలవంగా ఉంటే ఆ రచన విఫలమైపోతుంది. అందుకే ఏం చెబుతున్నాం అన్నదే కాకుండా, ఎలా చెబుతున్నాం అన్న అంశం పట్ల రచయిత తగినంత శ్రద్ధ తీసుకోవాలి. నవలా నిర్మాణం, నవలా దృక్పథం కూడ శిల్పంలోని భాగాలే. వాటిని సీతాదేవి తన నవలల్లో వైవిధ్యభరితంగా నిర్వహించారు.













మట్టిమనిషి, సమత, మరీచిక, నవలల్లో సమకాలీన గ్రామీణ సమాజ చిత్రణ, వర్గ వ్యవస్థ దుర్లక్షణాలు, స్త్రీల జీవితాలపై వాటి ప్రభావాలను సీతాదేవి చాలా వాస్తవికంగా చిత్రించారు. సామాజిక వాస్తవికతను మానవీయ విలువలను విశ్లేషణ చేశారు. సమత నవలలో సమకాలీన రాజకీయాల్లోని అధికార దాహాన్ని, పదవీవ్యామోహాన్ని చక్కగా చిత్రించారు. మానవీయ విలువలు లేకపోతే ఆదర్శాలు, విప్లవభావాలు కూడ ఎలా మట్టిగొట్టుకు పోతాయో చిత్రించారు. ఆర్థిక, సాంఘిక, రాజకీయ హోదాలు స్త్రీ పురుష సంబంధాల్ని ఎలా ప్రభావితం చేస్తాయో స్పష్టం చేశారు.

స్త్రీ, పురుషులు ఇరువురూ ఒకే తప్పు చేసినప్పటికి స్త్రీకి ఒకనీతి, పురుషునికి ఒక నీతి అంటూ స్త్రీ పురుష వివక్షతను చూపిస్తున్నారని స్త్రీని పతితగా ముద్ర వేస్తారని వాపోయారు. రాజకీయ హోదానో లేక డబ్బు పరపతి వున్న మగవానికి బ్రహ్మరథం పడుతున్నారు ఈ సమత నవలలో అంటూ అరుంధతి రాజారావు పాత్రల ద్వారా చిత్రించారు. ఆమె ప్రసిద్ధ నవల 'వైతరణి' ద్వారా స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎంత అవసరమో వివరించారు. ఆస్తి గాని, సంపాదన గాని లేని స్త్రీ ఎంత దిక్కు లేనిది అవుతుందో ఈ నవల ద్వారా నిరూపించారు. మరీచిక నవలలో యువతరం ఆలోచనలు, ఆవేశాలు ఎలా వుంటాయో, వారి చుట్టూ వున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు వారి ఆలోచనా ధోరణిని ఎలా ప్రభావితం చేస్తాయో విశ్లేషించారు.

సాహిత్యంలోనైనా, జీవితంలోనైనా తనకు నచ్చిందే చేశానని, నమ్మిందే రాశానని చెప్పారు సీతాదేవి. నలుగురూ నడిచే తోవలో కాక, తనదైన ప్రత్యేక మార్గంలో నడవాలని నిర్ణయించుకుని, దాన్ని ఆచరణలో చూపి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకలా నిలిచారు వాసిరెడ్డి సీతాదేవి. జీవితంపైనా, తాను జీవిస్తున్న సమాజ స్థితిగతులపైనా సమగ్రమైన అవగాహన కలిగి రచయిత్రిగా తన కలాన్ని పదునైన ఆయుధంగా మలచుకొని, అన్యాయాన్ని, అసమానతలనీ ఖండిస్తూ అనేక ప్రయోజనాత్మక రచనలు చేసారు వాసిరెడ్డి సీతాదేవి. ఆమె వాస్తవిక దృష్టితో సామాజిక, రాజకీయ స్పృహతో, శాస్త్రీయ దృక్పథంతో సాంఘిక ప్రయోజనమే తన ధ్యేయంగా రచనలు చేసి తెలుగు నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. అన్యాయాన్ని ఎదిరించే ఆత్మస్థైర్యమూ, గుండె బలమూ కావాలంటూ కర్తవ్యాన్ని చాటిచెప్పే సీతాదేవి- ప్రగతిశీల రచయితగా సుప్రసిద్ధులైనారు.

వాసిరెడ్డి సీతాదేవి రచనలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదితమయ్యాయి. సీతాదేవికి నాటకాలన్నా చాలా ఇష్టం. నాటకాల్లో నటించడమే కాక దర్శకత్వం వహించి ఉత్తమ దర్శకురాలిగా అవార్డు కూడా గెలుచుకున్నారు. థియేటర్ ఆర్ట్స్‌లో డిప్లొమా కూడా చేశారామె. 1971లో తొలిసారిగా 'సమత' నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు సీతాదేవి. ఆ తర్వాత 1980లో 'ఉరితాడు' నవలకు కూడా అకాడమీ అవార్డు లభించింది. అకాడమీ తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమయ్యాక మరో నాలుగు అవార్డులు లభించాయి. అయితే జగమెరిగిన ఈ రచయిత్రిని కేంద్రసాహిత్య అకాడమీ గుర్తించకపోవడం కొంతవరకు సాహిత్య ప్రేమికులకు నిరాశ కలిగించే అంశం.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5  UGC Care List Approved Journals
హైదరాబాద్ మార్చి : 2022

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 21

# ప్రెసిడెంటు పేరమ్మ

**టి. లక్ష్మీనారాయణ**, తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

భారతదేశానికి 1966–1977 మరియు 1980ల కాలంలో శ్రీమతి ఇందిరాగాంధీ గారు ప్రధానమంత్రిగా పనిచేశారు. దేశ పరిపాలనకు, అభివృద్ధికి, మహిళా శక్తి అత్యున్నత ప్రచోదకంగా పనిచేస్తుందని నిరూపించిన వ్యక్తి ఇందిరాగాంధి. మన దేశంలో సుమారు సగ భాగంగా ఉండే మహిళల శక్తి సామర్థ్యాలను వినియోగించుకోవడంవల్లనే దేశ అభివృద్ధి మరింత సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో గ్రామస్థాయిలో ప్రెసిడెంటులుగా, సర్పంచ్‌లుగా మహిళల ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరముంది. ఇలాంటి సందర్భాన్ని కథా నేపథ్యంగా ఎంచుకుని కె.విశ్వనాథ్ గారు 1979లో రూపొందించిన చిత్రం 'ప్రెసిడెంటు పేరమ్మ'.

**చిత్ర కథ:**

మల్లెదుగు అనే గ్రామ ప్రెసిడెంట్ రాయుడు. ఆ గ్రామంలో తప్పొప్పులతో నిమిత్తం లేకుండా ఆయన చేసే ప్రతీ పని చెల్లుబాటవుతూ ఉంటుంది. అంతేకాక ఆయన ఏం మాట్లాడినా ఆ మాటలకు వంతపాడే నలుగురు భిన్న కులాల మనుషులు ఆయనకు గులాములుగా ఉంటూ ఊర్లో పెద్దమనుషులుగా చెలామణి అవుతూ ఉంటారు. రాయుడు భార్య జానకి (రమాప్రభ) ఆమెకు పూజా పునస్కారాలు తప్ప మరో వ్యాపకం తెలియదు. రాయుడు రెండవ అనధికారిక భార్య బేబి (మంజుభార్గవి). రాయుడు గ్రామానికి సింహమే అయినా బేబి ముందు మాత్రం కట్టుబానిస. బేబి తమ్ముడు కోటేశ్వరరావు. అతడిది ఆత్మాభిమానం లేని చౌకబారు మనస్తత్వం.

పేరమ్మ (కవిత) తల్లి, తండ్రీ లేని పేద దిగువ తరగతి అనాథ యువతి కానీ ఊర్లోని ప్రజలందరికీ తలలో నాలుక వంటిది. ఆమె రాయుడు ఇంట్లో పని మనిషిగా పనిచేస్తూ ఉంటుంది. అందం, తెగువ, మాటకారితనం కలగలసిన అమ్మాయి పేరమ్మ. పేరమ్మ బావ పెద్దిరాజు (నూతనప్రసాద్). పెద్దిరాజు, పేరమ్మల మధ్య ఎప్పుడూ పిల్లీ ఎలుకల గొడవే కానీ ఒకరంటే ఒకరికి వల్లమాలిన ప్రేమాభిమానాలుంటాయి.

రామ్మూర్తి (జేవి.రమణమూర్తి) ఆ గ్రామంలో బడి పంతులుగా పని చేస్తూ ఉంటాడు. గర్భవతి అయిన తన భార్యతో పాటే ఆ గ్రామంలో ఉంటూ ప్రజల గౌరవాభిమానాలు పొందుతుంటాడు. గ్రామంలోని పిల్లలకు పాఠాలు చెప్తూ వాళ్ళిచ్చే అణా, పావలాతో కుటుంబాన్ని వెళ్ళదీస్తుంటాడు. అదే గ్రామంలో ప్రజలందరి సౌకర్యార్థం ఒక ఆసుపత్రి ఉంటుంది. అందులో పనిచేసే వైద్యుడు ఎలాంటి లాభాపేక్ష లేకుండా గ్రామ ప్రజలకు వైద్య సేవలు



అందిస్తుంటాడు.

ఒకసారి పెద్ద తుఫాను వచ్చి గ్రామంలో వరదలు సంభవిస్తాయి. ఆ సమయంలో గ్రామ ప్రజల సహాయార్థం ప్రభుత్వంనుండి పెద్దమొత్తంలో డబ్బులు ప్రెసిడెంటు రాయుడుకు అందుతాయి. రాయుడు ఆ డబ్బును ప్రజలకు పంచకుండా రెండవ భార్య అయిన బేబికి బహుమతిగా ఇస్తాడు. ఈ విషయం తెలిసి రాయుడు వెంట ఉండే గ్రామ పెద్దలు రాయుడును ప్రశ్నించకుండా అతనిచేత కొంత డబ్బును ముడుపులుగా పొంది గమ్మునుంటారు. రాయుడును బేబి తన అందచందాలతో మురిపిస్తూ తన సోదరుడి కోసమై రాయుడి దగ్గర ఒక మాట తీసుకుంటుంది. అదేంటంటే గ్రామంలోని ఆసుపత్రిని తన సోదరునికి వ్యాపార నిమిత్తం ఇచ్చేయమంటుంది. దానికి రాయుడు అంగీకరించడంతో కోటేశ్వరరావు ఆసుపత్రి స్థానంలో రంభావిలాస్ అనే హోటల్‌ను ప్రారంభిస్తాడు. ఆ విషయం తెలిసి ఆసుపత్రి వైద్యుడు మనోవేదనకు గురవుతాడు. పేరమ్మ రాయుడు ఇంట్లోనేగాక బడిపంతులు రామ్మూర్తి ఇంట్లో కూడా పని చేస్తూ ఉంటుంది. గర్భవతిగా ఉన్న రామ్మూర్తి భార్యకు పేరమ్మ సేవలు చేస్తూ ఆమె బాగోగులు చూస్తూ ఉంటుంది. ఒకరోజు రాయుడు కుమారుడిని బడిపంతులు రామ్మూర్తి చదువు చెప్పే విషయంలో దండించాడనే చిన్న కారణం చేత రాయుడు అతడిని ఉద్యోగం నుండి తొలగిస్తాడు. పాఠాలు చెప్తేనే ఇల్లు గడిచే రామ్మూర్తికి ఏ ఆదాయమూ లేక నిరాశ్రయుడు అవుతాడు. అలాంటి గడ్డు సమయంలోనే అతడి భార్యకు ప్రసవ గడియలు సంభిస్తాయి. ఇంట్లో చిల్లిగవ్వ లేక, గ్రామంలో ఆసుపత్రి లేక రామ్మూర్తి తన భార్యను కోల్పోతాడు. ఇందంతా చూస్తున్న పేరమ్మ ఆమె బావ

పెద్దిరాజులకు రాయుడుపైన ఆగ్రహం కలుగుతుంది. రాయుడును ప్రెసిడెంటు పదవినుండి తొలగించి రాబోయే ఎన్నికలలో కొత్తవారిని ఎన్నుకోవాలని నిర్ణయించకుంటారు.

ప్రెసిడెంటు ఎన్నికలు ఇంకొన్ని రోజుల్లో రాబోతున్నాయనగా ఎలాగైనా తనే ప్రెసిడెంటుగా గెలవడానికి రాయుడు పావులు కదుపుతుంటాడు. అతడి ఆలోచనకు తగ్గట్టే వెంట ఉండే అనుచర బృందం ఆయనకు మద్దతుగా ఉంటుంది. ఒకసారి రాయుడు బేబి కోసం ఊరి డబ్బును ఖర్చుచేసి ఆమె ఇంటి ప్రాంగణంలో ప్రత్యేకంగా మంచినీటి బావి తవ్విస్తాడు. మరోవైపు ఊరి చెరువులో రాయుడు పనిమనిషి ఒకడు రాయుడుకు చెందిన పశువులను కడగడంతో ఊర్లో ప్రజలకు మంచినీళ్ల విషయంలో ఇబ్బంది ఎదురవుతుంది. ఇది తెలిసి పేరమ్మ గ్రామంలోని మహిళలను తీసుకుని నేరుగా బేబి ఇంటిదగ్గరున్న మంచినీళ్ల బావి దగ్గరకు వెళ్తుంది. బేబి, రాయుడులు పేరమ్మతో వాగ్వివాదానికి దిగగా ఆమె వారిని ఎదురించి నీటిని తీసుకెళ్తుంది. ప్రజలకు రాయుడు కలిగించిన అసౌకర్యానికి అతన్ని ప్రెసిడెంట్‌గా తొలగించి పేరమ్మను ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవాలని గ్రామ ప్రజలు నిర్ణయించుకుంటారు. ఆ నిర్ణయాన్ని పేరమ్మ ముందు నిరాకరించినా పెద్దిరాజు ప్రోద్బలంతో ముందడుగేస్తుంది. రాయుడు వెంట ఉండే పెద్దమనుషులు సైతం తమ భార్యల నిర్ణయానికి తలొగ్గి పేరమ్మకు మద్దతిస్తారు. పేరమ్మ ప్రెసిడెంటుగా గెలుస్తుంది. ఆ తరువాత పేరమ్మ, పెద్దిరాజులు వివాహం చేసుకుంటారు.

ప్రెసిడెంట్ అవ్వడంతోనే పేరమ్మ ఆ గ్రామంలో ఆసుపత్రిని పున:ప్రారంభించి రామ్మూర్తిని బడిపంతులుగా తిరిగి నియామకం చేస్తుంది. గ్రామంలోని పెద్దలు, గ్రామ ప్రజలు రాయుడుకు భయపడడం మానేయడంతో అతడు ప్రతిష్ఠాహీనుడుగా మారిపోతాడు. ఆ పరిణామాలను తనకు అవమానాలుగా భావిస్తాడు. ఎలాగైనా ఇన్నాళ్ళు తనకు వత్తాసు పలికిన పెద్దమనుషులను పేరమ్మ వైపు నుండి తిరిగి తనవైపుకు తిప్పుకోవాలని భావిస్తాడు. దానిలో భాగంగా రాయుడు అధునాతన హంగులతో కూడిన ల్యాండ్రీ, హేయిర్ సెలూన్, కార్పెంటర్ వంటి వృత్తులకు చెందిన షాపుల సముదాయాన్ని గ్రామంలో ప్రారంభిస్తాడు. దానితో గ్రామ ప్రజలంతా ఆ షాపులలోకి వెళ్ళడం మొదలెడతారు. పర్యవసానంగా కులవృత్తి పెద్ద మనుషులంతా ఉపాధిలేక తల్లడిల్లిపోతారు. రాయుడు వద్దకు వెళ్ళి పేరమ్మకు మద్దతుగా ఉండి తప్పుచేసామని ఒప్పుకుని జీవతకాలం మీకు బంటుగా ఉంటామని మాట ఇచ్చి ఆదుకొమ్మని కోరుతారు. దానికిగాను రాయుడు వారితో పేరమ్మను ప్రెసిడెంట్ పదవి నుండి దింపివేయడం మన బాధ్యత అంటూ కుటిల వ్యూహాన్ని బోధిస్తాడు.

పేరమ్మ ప్రెసిడెంట్ అయిన తరువాత గ్రామ దేవాలయ పూజారి దేవుడి అలంకరణకు వాడే ఆభరణాల పెట్టెకు సంబంధించిన తాళాలను ఆమెకు ఇస్తాడు. కానీ ఆ పెట్టెలోని ఆభరణాలను రాయుడు ప్రెసిడెంటుగా ఉన్నప్పుడే దొంగిలించి బేబికి అందజేసి వాటి స్థానంలో నకిలీ నగలను పెట్టి ఉంటాడు. ఒకరోజు పేరమ్మ పెద్దిరాజుతో కలసి ప్రెసిడెంటు సమావేశాల నిమిత్తం పట్టణానికి బయలు దేరుతుంది. ఆ సమయంలో పూజారి రాయుడు వెంట ఉండే పెద్దమనుషులను తన వెంటపెట్టుకుని వచ్చి దేవుడి నగలు దొంగిలించబడ్డాయని ఆమెకు చెప్తాడు. ఆ సమయంలో పూజారితో వచ్చిన పెద్దమనుషుల్లో ఒకడు ఎప్పుడూ లేనిది పేరమ్మ కొత్తగా పట్టణం వెళ్తుందంటే నమ్మడానికి ఆశ్చర్యంగా ఉంది. నాకెందుకో ప్రెసిడెంటు గారి చేతులో ఉన్న పెట్టెలో నగలు ఉన్నాయేమో అనే సందేహాన్ని వ్యక్తంచేస్తాడు. ఆ మాటలకు గాను పేరమ్మ పెట్టె తెరవగా ఆభరణాలు కనిపిస్తాయి. ఆ సంఘటనల వల్ల ఊరందరి ముందు పేరమ్మ అవమానానికి గురవుతుంది. భర్త పెద్దిరాజు కూడా ఆమెను అసహ్యించుకుంటాడు. పేరమ్మను నమ్మి మోసపోయానని బాధపడుతూ పెద్దిరాజు రాయుడు వద్ద చేరుతాడు. ఈ క్రమంలో పెద్దిరాజు రాయుడు వద్ద నమ్మకస్తుడిగా ఉంటూనే అతడి మనుషుల వద్ద దేవుడు నగలకు సంబంధించిన నిజాలను తెలుసుకుంటాడు. దానిలో భాగంగా దేవుడి అసలు నగలు బేబి వద్ద ఉన్నాయని, పేరమ్మ వద్ద దొరికిన నగలు నకిలీవని అతను ధ్రువపరచుకుంటాడు. పేరమ్మ ఏ తప్పూ చేయలేదని గ్రామ ప్రజలందరి ముందు రుజువు చేస్తాడు. అంతేకాక రాయుడు చేసిన పాపాలన్నింటిని అందరిముందు ఒప్పుకునేలా చేస్తాడు. దానితో పేరమ్మ మళ్ళీ ప్రెసిడెంట్‌గా కొనసాగడమే కాక పెద్దిరాజుతో దాంపత్య జీవితం మొదలెట్టడంతో కథ సుఖాంతమవుతంది.

**చిత్ర విశేషాలు :**

పేరమ్మ పాత్రే చిత్రానికి ప్రధాన కథానాయకుడి పాత్ర. చిత్ర ఆఖరి అంకంలో పెద్దిరాజు పాత్ర బలంగా కనిపిస్తుంది. గడుసుదనం, మొరటుతనం, ధైర్యం, బలమైన వ్యక్తిత్వంతో కూడిన పేరమ్మ పాత్రలో కవిత నటన చక్కగా ఉంటుంది. పెద్దిరాజు పాత్ర పేరమ్మ పాత్రకు అండదండలుగా ఉంటూ ఒకవైపు బావగా సరస సల్లాపాలతో, మరోవైపు బాధ్యత గల భర్తగా నడుచుకునే రీతిలో ఉంటుంది. 1979నాటి చిత్రమే అయినా స్త్రీపురుష తారతమ్యాల ప్రస్తావన, ప్రభావాలు ఏ మాత్రం లేకుండా చిత్రాన్ని రూపొందించాడు దర్శకుడు. ప్రెసిడెంట్ రాయుడు పాత్ర మన గ్రామీణ సమాజంలో మనందరికీ ఎక్కడో ఒక చోట తారసపడిన పాత్రలాగే కనిపిస్తుంది. గ్రామ రాజకీయాలు నడపడంలో వారి స్వార్థ, కుటిల వ్యూహాలు, ఎత్తులకు పై ఎత్తులతో గ్రామాలని చెప్పుచేతుల్లో పెట్టుకునే తీరు వాళ్ళకు మాత్రమే తెలిసిన విద్య. పేరమ్మ ప్రెసిడెంట్ అవ్వడానికి ముందూ తరువాత గ్రామ ప్రజల వైఖరికి సంబంధించి కొన్ని విషయాలు గమనించవచ్చు. రాయుడు ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు

అతడి నిర్ణయాలను కేవలం కొందరు పెద్దమనుషులే సమర్థిస్తే ఊరంతా వ్యతిరేకిస్తుంది. కానీ పేరమ్మ ప్రెసిడెంటు అయిన తరువాత ఆమె చేసే ప్రతీపనికి ప్రజల అండదండలుంటాయి. దీనికి కారణం రాయుడుతో ఉండే పెద్దమనుషులు అతడిని సమర్థించడానికి ప్రధాన హేతువు వారి స్వార్థమే అయినా, అసంకల్పితంగా తరాలుగా రాయుడు లాంటి ప్రెసిడెంట్‌ల ముందు తలొగ్గి భయంభక్తులతో ఉండే స్వభావం వారిలో సహజగుణంగా మారిపోయి ఉంటుంది. కానీ పేరమ్మ ప్రెసిడెంటుగా ఉన్నప్పుడు ఆమె తమలోని మనిషవ్వడం, తమలాంటి కష్ట సుఖాలను అనుభించిన మనిషి అవ్వడం చేత ఆమె పాలనలో భాగస్వామ్యులుగా ఉండడానికి ప్రజలు, పెద్దమనుషులు ఆసక్తిచూపుతారు.

రాయుడు ప్రెసిడెంటుగా ఉన్నప్పుడు అతడితో ఉండే పెద్దమనుషులకు అతడి అవినీతి సొమ్ములో వాటా అతి తక్కువ మొత్తంలో లభించేది.రాయుడుపై ఉన్న భయంతో ఆ లెక్కలకు సంబంధించి ప్రశ్నించే ధైర్యంలేక మౌనంగా ఉండేవారు. కానీ పేరమ్మ ప్రెసిడెంటు అయితే వచ్చే సొమ్మంతా మనలాంటి గ్రామ పేద ప్రజలకు చెందుతుందనే సదాలోచనతో ఆమెకు సహకరిస్తారు.

పెద్దమనుషులను తనవైపు తిప్పుకోవాలనే రాయుడు దురాలోచనకు పర్యవసానంగా ఆధునిక హంగులతో కూడిన వృత్తి సౌలభ్యాలు గ్రామంలోకి ఆహ్వానింపబడుతాయి. తత్ఫలితంగా సాంప్రదాయక రీతిలో వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కుల పెద్దల జీవనవ అధోగతి పాలవుతుంది. ఈ సన్నివేశాల ద్వారా దర్శకుడు మారుతున్న కాలానుగునంగా వృత్తి పనుల వారు వృత్తుల్లో సంభవిస్తున్న ఆధునికతను అందుకోలేకపోతే వెనకబాటుతనానికి లోనవుతారని చెపుతూనే వృత్తి కులాల్లోకి పెట్టుబడీదారి వ్యవస్థలు ప్రవేశిస్తే జరిగే విధ్వంసాన్ని చెప్పకనే చెప్పారు.

చిత్రంలోని కొన్ని పాత్రల గురించి తరచి చూస్తే మగాడి బలహీనతలను సొమ్ముచేసుకునే స్త్రీ వైఖరి ఎలా ఉంటుందో బేబి పాత్ర తెలియజేస్తుంది. పర స్త్రీ వ్యామోహం మగాడి స్థాయిని ఏ స్థితికి దిగజార్చుతుందనే విషయం ప్రెసిడెంటు రాయుడు జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా అవగతమవుతుంది. రాయుడులాంటి వ్యక్తులకు తరాలుగా సామాన్య ప్రజలు భయపడినతంతకాలం బానిసలుగా దోపిడీకీ గురవుతామని చెపుతూనే సామాన్య ప్రజలు ఏకమైనప్పుడు ప్రెసిడెంట్ లాంటి వ్యక్తులను పదవీచ్యుతులను చేయడం పెద్దవిషయం కాదనే అంశాన్ని వ్యక్తంచేశారు.

ఇక ఈ చిత్రంలో ప్రధానంగా చెప్పుకోవాల్సిన పాత్రపేరు బైరాగి. ఈ పాత్రను పోషించింది రాజాబాబు. పూర్తిస్థాయి హాస్య పాత్రలను పోషించే రాజాబాబు దానికి విరుద్ధంగా బైరాగి పాత్ర ద్వారా వైవిధ్యమైన నటనను కనబరిచారు. ఈ పాత్ర పిచ్చివాడి మనస్తత్వాన్ని ప్రదర్శిస్తూనే అన్నీ కోల్పోయి సమాజంలోని లోపాలను గురించి




సార్వత్రిక సత్యాలను గురించి సందర్భానుసారంగా వివిధ సన్నివేశాల ద్వారా సంభాషణల రూపంలో చెప్తూ ఉంటుంది. ఆ సంభాషణలు అన్నీ కూడా గ్రామంలో రాయుడు తన స్వార్థం, లాభాపేక్షకోసం పన్నే వ్యూహాలను గురించి ముందుగానే ఊహించి చెప్పేలా ఉంటాయి. ప్రెసిడెంట్‌కు సెక్రటరీగా గోపన్న పాత్రలో సాక్షిరంగారావు నటించారు. ప్రెసిడెంటుకు ఉపాయాలను నూరిపోస్తూ ఆయన ప్రజలపై ఆధిపత్యాన్ని చలాయించడంలో ప్రధాన భూమిక పోషిస్తూ ఉంటాడు. ఈ చిత్రానికి సంగీతం చక్రవర్తి అందించగా వేటూరి, సినారెలు సాహిత్యాన్ని అందించారు.

దేశ పరిపాలనలలోనే కాకుండా స్థానిక స్వపరిపాలనా సంస్థల్లో సాంప్రదాయిక, పురుషాధిపత్య భావజాలాన్ని వీడి స్త్రీల శక్తి సామర్థ్యాలను, నాయకత్వాన్ని గుర్తించి ఆహ్వానించాలనే అభ్యుదయ దృక్పథం కలిగిన చిత్రంగా ఈ 'ప్రెసిడెంటు పేరమ్మ' చిత్రాన్ని పేర్కొనవచ్చు.

చిత్రం : ప్రెసిడెంటు పేరమ్మ

తారాగణం : కవిత, నూతన్ ప్రసాద్, రమాప్రభ, రాజాబాబు, సాక్షిరంగారావు, జేవి.రమణమూర్తి, మంజుభార్గవి, గోకిన రామారావు.

కథ–మాటలు : దాసం గోపాలకృష్ణ

సంగీతం : చక్రవర్తి

నిర్మాత : డి.వి.యస్. రాజు

కథానుసరణ–దర్శకత్వం : కె.విశ్వనాథ్

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5 (56) హైదరాబాద్ మార్చి : 2022

# గిరిజన కథా సాహిత్యంలో సమాజ ఆవిష్కరణ

**ధనావత్ పద్మ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 8008888283

కథాసాహిత్యం రెండు రూపాల్లో దర్శనమిస్తుంది. అవి మౌఖిక కథలు, లిఖిత కథలు. లిఖిత కథలు రామాయణ భారతాల్లో ఉదహరించిన ఉపకథలు మొదట ప్రాచుర్యం పొందగా, ఆంగ్ల సాహిత్యంలోని short story ప్రభావంతో వచ్చిన ఆధునిక కథలు తర్వాతి కాలంలో ప్రాచుర్యం పొందినాయి. అయితే వీటన్నింటి కంటే ముందే వేల సంవత్సరాలుగా మౌఖికరూపంలో అనేక కథలు ప్రసారమవుతూ వచ్చాయి. వాటినే మనం జానపద కథలు అంటున్నాం. జనపదాలలో నివసించే జనులు నిత్యం జానపద సాహిత్యాన్ని వల్లెవేస్తూనే ఉంటారు. అందులో కథలు, గేయాలు, సామెతలు, పొడుపు కథలు వంటివెన్నో జత చేరుతుంటాయి. జానపదులు భారతదేశమంతటా ఉన్నారు. వారిలో గిరిజనులు ఒక భాగమే. కాకపోతే గిరిజనేతరులు గ్రామాల్లో ఉంటూ పురజనులుగా ప్రసిద్ధికెక్కితే, గిరిజనులేమో కొండ కోనల్లో, అడవుల్లో, తండాల్లో ఉంటూ గిరుల వెంట (కొండల మధ్య) నివసించే వారుగా గిరిజనులుగా పేరుగాంచారు.

గిరిజనులది సంచార జీవనం. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచారం చేస్తూ వేట, పశుపోషణ, చిన్న చిన్న దినుసుల వర్తకాలు, పోడు వ్యవసాయాలు చేస్తూ జీవన సాగిస్తారు. ఆ క్రమంలో వారి రోజువారి జీవనంలో పనుల నుంచి, అలసట నుంచి విశ్రాంతి కొరకు జానపద సాహిత్యాన్ని ఆశ్రయిస్తారు. వాటిల్లో గేయాలు, కథలది ప్రధాన పాత్ర. అలా చెప్పుకున్న కథలు క్రమంగా లిఖిత రూపాన్ని ధరించడమూ కొంత స్థాయిలో జరుగుతుంది. అటువంటి గిరిజన కథల్లో సమాజంలో మనం నిత్యం చూసే అనేక విషయాలను చర్చ చేయడం జరిగింది. కథలోని సందర్భాన్ని బట్టి సగటు మానవుల భావావేశాలు, సమాజం పోకడ, చైతన్యం, నిస్తేజం, దోపిడీ, అణచివేత, తిరుగుబాటు మొదలైన అంశాలతో సమాజాన్ని అద్దంలో చూపినట్లు చేశారు రచయితలు. ఆ కథలను గిరిజన కోణంలోంచి పరిశీలించడం ద్వారా వారి సాధకబాధకాలు, వారు ఎదుర్కొనే సంఘర్షణలు, సమస్యలు గుర్తించే అవకాశం ఉంటుంది. ఫలితంగా వాటికి పరిష్కారాలు సూచిస్తూ నూతన పరిస్థితులను పాలకులు కల్పించే వీలుంటుంది.

**గిరిజన జీవితాల్ని ఆవిష్కరించిన కొన్ని కథాసంపుటాలు :**

1) ఇప్పపూలు (గిరిజన సంచార తెగల కథలు) – జయధీర్ తిరుమలరావు, జీవన్.

2) రేలా పూలు (తండావాసుల కథలు) – సమ్మెట ఉమాదేవి.

3) చప్పుడు (కోయ ఆదివాసీ కథలు) – పద్దం అనసూయ

4) దండకారణ్య కథలు – అల్లం రాజయ్య.

వీటిల్లోని కథలు, పాత్రల ద్వారా గిరిజన జీవితాల్ని, మహిళా జీవితాల్ని, సంస్కృతిని, భాషను, ఉనికి వ్యాప్తిని, ప్రకృతితో అనుబంధాన్ని మొదలైన విషయాల్ని మనముందుంచే ప్రయత్నం చేశారు ఈ గ్రంథాల కథల రచయితలు, రచయిత్రులు.

**ఆచారాల్లో వచ్చిన మార్పుని తెలిపే కాకమ్మ కథ :**

పద్దం అనసూయ రాసిన "చప్పుడు" కథాసంపుటిలోని 'కాకమ్మ కథ'. ఒక గిరిజన తెగలో కాలక్రమేణా వచ్చిన ఆచారాల్లోని మార్పులని తెలిపే కథ. 2019 లో వెలువడిన ఈ కథల సంపుటిలో కాకమ్మ, చప్పుడు, ముసిలి, మూగబోయిన శబ్దం అనే నాలుగు ఉత్తమ కథలున్నాయి. ఇవన్నీ గిరిజనుల జీవితాల్ని లోతుగా స్పృశించినవే.

కాకమ్మ కథలో కాకమ్మ అనే కోయ స్త్రీ మనోగతం, ఆలోచనా ధోరణి ఆధారంగా వారి జాతిలోని ఆచారాంశాలను రచయిత్రి చర్చించడం జరిగింది.

తమ కోయ తెగలోని కట్టుబాట్లని, నియమాల్ని, ఆచారాల్ని పాటిస్తూ అవి సమాజంలో నిలబడాలని తాపత్రయ పడే కాకమ్మకు అది అంత సులభమైంది కాదని అర్థమైతది. ముఖ్యంగా కొడుకు పెళ్లి అందరూ మెచ్చుకునే విధంగా ఆచారం ప్రకారం బత్తెం ఇచ్చి, పందిని కోసి విందు ఇవ్వాలి అనుకుంటుంది. కానీ చివరికి ఆమె కొడుకే దానిని హేళన చేస్తూ 'ఇప్పుడు ఇదంతా మోటు అయిందని' అనడంతో తీవ్ర మనస్థాపానికి గురవుతుంది కాకమ్మ. ఆ ఒక్క మాటతో చలించిపోయిన కాకమ్మ తన అంత్యక్రియలు కూడా కోయ ఆచారం ప్రకారం చేస్తారో లేదోనని అనుమానంతో అందుకు కావలసిన వస్తువులన్నింటినీ ముందుగానే సమకూర్చుకొని చూసే వారందరికీ ఆమెకి తన జాతి ఆచారాల మీద గల గౌరవాన్ని, మక్కువని తెలియజేస్తుంది.

ఇట్లా అనసూయగారి 'చప్పుడు' సంపుటి మొత్తం గిరిజన జీవితాల సహజ పరిమళాలే పరచుకొని ఉంటాయి.

**బంజారా బిడ్డల బతుకుపోరు ఇప్పపూలు :**

ఇప్పపూలు కథాసంకలనంలో ఇరవై తొమ్మిది కథలున్నాయి. జయధీర్ తిరుమల రావు, జీవన్‌ల సంపాదకత్వంలో వెలువడిన ఈ కథల్లో గిరిజనుల్లోని వివిధ తెగల గురించి కథావస్తువులు, ఇతివృత్తాలుగా చేసుకొని రాయడం జరిగింది. ప్రతి కథలోనూ ఏదో ఒక కదిలించే కోణం ఉంటుంది.

ఇందులోనే బోయ జంగయ్య రాసిన 'ఇప్పపూలు' కథ తండాల్లో

స్త్రీలను సమాజం ఎంతమేర గౌరవంగా చూస్తుంది. వారిపట్ల సమాజంలోని విభిన్న వ్యవస్థల స్పందన యేంటి లాంటి విషయాలను చర్చించారు రచయిత. కథలోని తండా పేరు ముంద్రాయి తండా. తండా వాతావరణాన్ని కథ ప్రారంభంలో ఎంతో అవగాహనతో వర్ణించారు రచయిత. తండా చుట్టురా మోదుగపూలు, జామచెట్లు. వాటికి వేలాడే గురివింద తీగలు, తండా నుంచి తండాకు పిల్లబాటలు. చుట్టుపక్కల ఊళ్లకు ఎగుడుదిగుడు యిండ్ల బాటలు. పక్కమ్మటి, పక్కెమ్మటే పశువుల సన్ని జీవాలదొడ్లు అంటూ తండాను కళ్లకు కట్టారు రచయిత.

ఇక కథలో ప్రధానంగా రెండు విషయాలు చర్చించబడ్డాయి. ఒకటి తండాలోని లంబాడాలు సారాని కాయడం. ఆ పని చేస్తున్నందుకు పోలీసులతో జరిగే ఘర్షణ – శిక్షలు, అరెస్టులు. రెండవది పనికి వెళ్ళే తండా స్త్రీలను యజమానులు, వ్యవస్థ చూసే దృష్టికోణం. కథలో అత్త కోడలుని చూసినప్పుడు పోనీలే అనుకుంది. రెండవసారి రొమ్మును తాకినప్పుడు గుడ్లురిమి చూసింది. ఆ చూపును మనసులో ఉంచుకొని వాళ్ళ మీద కేసు వేశాడు. అసలు కేసు సారా మీద కాదు, ధిక్కారపు చూపు మీద అనే కథలోని వాక్యాలు గిరిజనులపై వ్యవస్థలు చేసే మానసిక దాడిని చెప్తున్నాయి. అంతేకాదు కథ చివరలో ఆగి ఉన్న జీపులో పాపని వదిలి వెళ్లడం ద్వారా వారిలో ఆర్థిక కష్టాలు ఎంతపనికైనా సంసిద్ధం చేస్తాయని చూచాయగా చెప్పారు. కాబట్టి వారికి ఆర్థిక స్వావలంబన కల్పిస్తే వారి జీవితాలు కాస్త మెరుగుపడవచ్చని కథలోని సందేశం.

**ఓ పాలబుగ్గల చిన్నిరైతా :**

చదువుకోవాలని తపన, కాంక్ష ఉన్న ఓ పిల్లవాడు చివరికి అనుకున్నది నెరవేర్చుకోలేని విషాదగాథ ఇతివృత్తంగా కలిగిన కథ ఇది. ఈ కథ సమ్మెట ఉమాదేవి రాసిన "రేలపూలు" కథల సంపుటిలోనిది. ఇందులో 17 కథలు. ప్రతి కథ దేనికదే ప్రత్యేకం. ప్రతి కథలోనూ గిరిజన ఆనవాళ్లు, పరిస్థితులు స్పష్టంగా దృశ్యమానమవుతాయి.

'గువ్వలా ఎగిరిపోవాలి... తల్లి గూటికే చేరుకోవాలి' అంటూ మొదలయ్యే ఈ కథ చదువు కోసమై బంజారా పిల్లలు పడే కష్టాలను తెలుపుతుంది. కేవలం వర్షాధారంగా వ్యవసాయం చేసుకుంటూ ప్రకృతి మీద ఆధారపడి బ్రతికే తండా కుటుంబాల్లో చిన్న పిల్లలూ వ్యవసాయ పనుల్లో సాయపడుతుంటారు.

అటువంటి సందర్భాల్లో పాఠశాలల్లోని రూల్స్ కొన్నిసార్లు వారికి నష్టాన్ని చేకూర్చుతాయి. బడికి రోజూ వచ్చే పిల్లలకు బియ్యం ఇయ్యాలని గవర్నమెంట్ ఆదేశించగా "అమ్మా బియ్యం కోసం బడికిపోవడం కాదమ్మా నాకు చదువు కోవాలనుందమ్మా" అంటాడు దేవ్లా. దీని ద్వారా తండా బిడ్డల్లో గల చదువు కాంక్ష తేటతెల్లమవుతుంది.

దీని ద్వారా అర్థమవుతున్నదేమిటంటే ప్రభుత్వాలు విద్యను తండాలు, గూడెంలకు చెందిన గిరిజన విద్యార్థులకు చిత్తశుద్ధితో అందించాలనుకుంటే ఎటువంటి ఆంక్షలు లేని విధానంలో అందించాలన్నది రచయిత్రి దృష్టికోణంగా తెలుస్తుంది.

అడవుల్లో క్రూరమృగాలతో యుద్ధం చేస్తూ ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుతున్న అడవి బిడ్డలకు కనీస అవసరాలు చేకూర్చే విషయంలో పాలకులు మరింత విశాల దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరముంది.

ఇట్లా ఒక్కొక్క కథను గురించి చర్చ చేస్తూపోతే ప్రతి గిరిజన కథలోనూ ఆయా తెగల బతుకు చిత్రాలే దర్శనమిస్తాయి. మారుతున్న సమాజంతో పాటు గ్రామాల్లోనూ పట్టణ కల్చర్ అనేది వచ్చింది. అది నేడు తండాలకు ఇతర గిరిజన తెగల పాకే దశలో ఉంది.

ఇటువంటి పరిణామ సందర్భంలో ఇప్పటికే అనేక వసతులు లేక వెనకబడ్డ గిరిజన జాతులు ఈ నూతన పోకడలను అందుకోవడంలో వెనకబడితే వారి జీవితాలు మరింత జటిలం అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ గిరిజన కథల్లో చర్చించిన అంశాల్లోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను అన్వేషించాల్సిన అవసరం ఉన్నది.

అక్షరాలు తెలియని గిరిజనులు నేటికీ అనేకమంది ఉన్నారు. వీరంతా సమాజంలోని వ్యవస్థలతో పోరాడుతూనే ఉన్నారు. చదువు కోసం ఒకరు, పోలీసు రాజ్యంలో ఒకరు, యజమానులతో ఒకరు, కంపెనీలు, ఫ్యాక్టరీలు వాటి యాజమాన్యాలు అక్కడ పనిచేసే సందర్భంలో గిరిజనులతో ప్రవర్తించే తీరు మొదలైన అనేక సవాళు గిరిజన జాతి ముందున్నాయి.

కవులు, రచయితలు తమ సాహిత్య సృజనతో తెలిపే వెనుకబడిన వర్గాల సమస్యలను, బాధలను వారిని కాపాడాల్సిన వారు విచక్షణ దృష్టితో చూసి స్పందించాలి. తద్వారా వారి జీవనం, వికాసం, విజ్ఞానం మెరుగైన బాటలో సాగేలా చూడాలి. అప్పుడే గిరిజనుల కోణంలోంచి రాసిన కథలకు, రచయితలకు మనం తగిన గౌరవం ఇచ్చిన వారమవుతాం.

**ఆధార గ్రంథాలు :**

1) రేలాపూలు – సమ్మెట ఉమాదేవి (2015).

2) ఇప్పపూలు – జయధీర్ తిరుమలరావు (2009).

3) చప్పుడు – పద్దం అనసూయ (2019).

4) తెలుగు కథాసాహిత్యంలో గిరిజన జీవితం – డా॥ జి. శైలమ్మ (2011).

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5 (58) హైదరాబాద్ మార్చి : 2022

సమీక్ష

# ముఖాముఖి అను స్తుతి విలాసము

**డా. టి. శ్రీరంగస్వామి,** వరంగల్. ఫోన్: 994 985 7955

అన్నమరాజు ప్రభాకర రావుగారి 14 ఖండికల సంపుటియే "ముఖాముఖి". ముఖాముఖి అనగానే ఎదురెదురుగా సంభాషణ చేయడం. లౌకికముగా అయితే ఇంటర్వ్యూ చేయడమని ఒక అర్థం. తమ ముఖాముఖికి "స్తుతివిలాసము" అనే ఉపశీర్షికను తగిలించారు. విలాసము అంటే క్రీడ. స్తుతి అంటే ప్రార్థించడము. ఇవి రెండూ విభిన్నమైన పదాలు. ప్రార్థించడముతోపాటు సరసక్రీడను సాగించారని చెప్పవచ్చును. ఈ ముఖాముఖి వ్యక్తులతో కాదు, దేవతలతో. దైవప్రార్థన చేస్తూనే వారితో సరస సల్లాపములను చేసారని అనుకోవచ్చును. అంటే దైవమును ప్రార్థిస్తూనే వారితో సహృదయ సంభావనా పూర్వక సంభాషణ అనవచ్చును.

అన్నమరాజు జరిపిన ముఖాముఖి ఎవరితోనంటే – గణపతి, సరస్వతి, దత్తాత్రేయుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీరాముడు, వేంకటేశ్వరుడు, మహావిష్ణువు, లక్ష్మీదేవి, శంకరుడు, శ్రీమాతలతో ఈ స్తుతి మూడుపాయలుగా చేసారు. ఆ త్రివిధాలు – ఒకటి కొలువడము, సాక్షాత్కరించుకోవడము, కవిని ఆశీర్వదించడము శుభాశంసలుగా. ప్రభాకరరావుగారు తను వినమ్రంగా వినతి చేసుకోవడముగా 14 ఖండికలలో తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ఈ పదునాలుగు ఖండికలలో 9 కండికలలో మంగళాశాసనము చేసారు. 5 ఖండికలలో చివర జయ జయ ధ్వానములను పలికారు. ఇది చదివినపుడు ఒక విషయం గుర్తుకు వచ్చింది. చోళరాజు సభలో పెరియాళ్వార్లు విజయుడై తిరిగి వస్తుంటే శ్రీమన్నారాయణుడు ఎవరు వచ్చారు. వారిని ప్రజలు చూస్తే దిష్టి తగులుతుందని పెరియాళ్వారుగారు తాళధ్వనిని చేస్తూ "పల్లాండు పల్లాండు" అంటూ మంగళాశాసనమును కావించారట. ఈ సంపుటిలోని మొత్తము పద్యాల సంఖ్య 770. ఇవన్నీ 38 ఛందస్సుల్లో దొరలినవి – బంధ కవిత్వము, దండకములు కూడా పుష్టిని చేకూర్చినవి.

**"నేరను శాస్త్ర రహస్యము,**
**నేరను భాషా విశేష నియమధ్వనులన్,**
**నేరను వ్యాకరణంబును,**
**నేరను ఛందమును, కరుణ నీవే గనుమా!"**

**(పుట. 17, పద్యం – 14)**

ప్రభాకరరావుగారు తనకు భాష, వ్యాకరణము, ఛందస్సు, శాస్త్ర రహస్యములు తెలియవని వినయపూర్వకముగా చెప్పుతూనే అనేక రకాలైన ఛందస్సులతో వాక్ రహస్యతంత్రులను పొందుపరచారు. తనలోని జిగీష మనకు స్తుతిపద్యములో తణుకులీనుతుంది. అయినా.... ఇలా చెప్పారు, కోరుకున్నారు.

**"పద్యంబారంభించిన**
**సద్యోగం బెట్టిదో! శషభిషలెయిట, స**
**ద్విద్యారాహిత్యంబె య**
**విద్యా హేతువు గణపతి! పల్కులనిమ్ము!"**

**(పుట.7, పద్యం 18)**

గణపతిని వేడుకుని, సరస్వతి ఆశీస్సులను పొందినట్టుగా సరస్వతి ఖండికలో చెప్పారు.

**"నీ పద సంపద కలరితి**
**నీ పద్య రచనయె నీకు నీడగు, నేనున్**
**గాపాడెద నిన్ననిశము**
**ఓ పద్యప్రియ! శుభంబులొందుమ నీవున్"**

**(పుట.20, పద్యం 25)**

ఈ సకల జగత్తుకు సూర్యుడు ఆది గురువు. తేజోరాశులయందు తేజో కారకుడనీ, తన కాంతులచే జలమును స్వీకరించి వర్షమును ప్రసాదిస్తాడని, జనులకు శుభములను అందిస్తారని చెప్పారు. ఉదాహరణకు "సూర్యస్తుతి"లోని నిక్కమైన పద్యాలను...

**"మూడగు మూర్తులు నీవై**
**మూడు గుణంబుల స్వరూపమును నీవై, యా**
**మూడగు శక్తులు నీవై**
**మూడు జగంబులు వెలుంగు మూర్తివల రవీ!"**

**"యజ్ఞమ నీవై యందున్**
**యజ్ఞ రహస్యము నీవెయై, యనిశంబున్**
**యజ్ఞాధిమంత్రమును, నా**
**యజ్ఞ హవిర్భోక్త నీవె యగుదువట రవీ!" (18వ పద్యం)**

నరసింహ స్తోత్రములో ఒక సీస పద్యము, నవక్షేత్ర నారసింహులను మనకు ప్రత్యక్షము గావించారు. నరసింహస్వామి ఈ ప్రభాకరుకిలా వరమును ఇచ్చారు.

**"భక్తి కవిత్వము, పద్యా**
**సక్తియు, భాషానురక్తి, సంయమ రచనా**
**శక్తియు నీకున్ సదమల**
**మౌక్తిక ధారయగుగాత! మద్భక్తయికన్" (58వ పద్యము)**

ఆదిశేషుడు ఈ భూమండలమును మోస్తున్నాడని, ఆ లక్ష్మీనారాయణులను తన తనువుపై ధరించిన పుణ్యచరితుడనీ, ఇతను భాషకు అధిపతియని భావిస్తారు. అందువలననే కవి –

**"భాషకు నిన్ను గొల్చెదరు పండితవర్యులు తొల్త" – 47వ పద్యం**
**"భాషా వైదుష్యంబును శేషా ! శీఘ్రముగ గల్గ జేయుమయా!"**
**– 49వ పద్యం** అని అన్నారు.

ప్రభాకరరావుగారి ''ముఖాముఖి''ని స్తుతిప్రబంధము అనవచ్చును. ఈ రసవత్కావ్యమును మరొక రస గంగాధరుడు, పద్మశ్రీ అలంకారితుడు, అష్టావధాని, డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారికి అంకితమివ్వడం సముచిత నిర్ణయం. ఇవి ఊసుపోకకు రాసినవి కాదు. ఇందులోని పద్యాలలో చేవ ఉంది. అంతేనా రహస్యందముగా నున్నవి. పద్యప్రియులకు జీవమున్న పద్యాలను చదివిన అనుభూతి, తృప్తి కలుగుతుంది.

**ముఖాముఖి**
అన్నమరాజు ప్రభాకరరావు,
పుటలు : 26 + 190, వెల : 250/-
**ప్రతులకు :** ఇం.నెం. 5-2-146, గాంధీనగర్, వనస్థలిపురం, హైదరాబాద్ – 500070.

**సమీక్ష**

# అసామాన్యుడికి అక్షరార్చన – 2

**డా. అట్టెం దత్తయ్య, ఫోన్: 9494715445**

**'సురవరం – తెలంగాణం'** శీర్షికతో రెండు పుస్తకాలు వచ్చాయి. వీటికి మంత్రివర్యులైనా శ్రీ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గారు సంపాదకులుగా ఉండడం అభినందనీయం. వీటిలో మొదటి సంపుటి ఎంత ఆలోచనీయమైన మిశ్రిత ప్రక్రియలతో వచ్చిందో దానికంటే మరింత వైవిధ్యంగా రెండవ సంపుటి కనిపిస్తుంది. ఈ సంపుటికి ఉపశీర్షిక **'సురవరం అనంతర తెలంగాణ సమాజం'** అని పెట్టారు. ఈ ఉపశీర్షికకు తగ్గ ఔచిత్యాన్ని కనపరుస్తూ ఇందులో కథలు, వ్యాసాలు, చారిత్రకాంశాలు మొదలగువాటి ఎంపికల విషయంలో పాటించడం కనిపిస్తుంది. **"ధైర్యం, ఔదార్యం, ప్రజ్ఞ, బహుభాషా పాండిత్యం, వక్తృత్వం, సునిశిత విమర్శ, సువిశాలమైన పరిశోధన, కార్యదీక్ష, భాషాసేవాసక్తి, నిస్తుల రచన, నిర్మలమైన మనసు మున్నగు మణులవంటి గుణాలన్ని 1896లో సురవరాంశలో ఉదయించిన నరోత్తములు శ్రీప్రతాపరెడ్డి…."** అని సురవరం గురించి వెలిబుచ్చిన అమూల్య అభిప్రాయాలు గల దాశరథి వ్యాసంతో ఈ గ్రంథం ప్రారంభమవుతుంది. నైజాం పాలనలో ప్రజల స్థితిగతులకు అద్దంపట్టే **'వకీలు యెంకయ్య'**, **'గ్యారా కద్దూ బారా కోత్వాల్'**, **'మొమ్మెకత'** వంటి ప్రతాపరెడ్డి, యశోదారెడ్డి, సుజాతరెడ్డిల నాలుగు కథలతోపాటు **'తెలంగాణ హైదరాబాద్ చరిత్ర'**ను వైభవాన్ని తెలిపే ఏడువ్యాసాలు అద్వితీయమైనవి. ఇందులో మొదటివ్యాసం 'గోల్కొండ' ప్రాశస్త్యాన్ని తెలుపగా **'ఇద్దరూ ఇద్దరే'** అనే మరోటి మాత్రం తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు ముస్లీంలను గురించి తెలుపుతుంది. అనంతర వ్యాసం **'నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జీవితం'**. ఇది నవాబ్ అలీ నిర్వహించిన పదవులు, నిర్మించిన ప్రాజెక్టులు, భవనాలు, వంతెనలు మొదలైన వాటి విషయాలను గురించి సమగ్రంగా తెలియపరుస్తుంది. తదనంతరం **'ముల్కీ ఉద్యమాలు, నూతన ప్రభుత్వాలు'**ను గురించి తెలిపే విశేషమైన ఆరువ్యాసాలు మన చరిత్రకు దర్పణాలు. ఇందులోనే పొందుపర్చిన 'రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషన్ 1953' శీర్షికకింద ఉన్న వ్యాసాలు ఫజల్ అలీ కమిషన్, పెద్దమనుషుల ఒప్పందం, ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు వంటి విషయాలను కూలంకషంగా తెలియపరుస్తాయి.




**సురవరం – తెలంగాణం**
**(సురవరం అనంతరం తెలంగాణ సమాజం)**
**(2వ సంపుటి)**
**ప్రధాన సంపాదకులు :**
**సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**
**ప్రచురణ :**
**ఎస్.ఎన్.ఆర్. పబ్లికేషన్స్, వనపర్తి**
**వెల : 600, పుటలు : 478**

1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని అవగాహనచేసుకోవడానికి అధ్యయనం చేయవల్సిన వ్యాసాలన్నింటిని ఒక శీర్షికకింద ఉంచారు. అందులో **'ఉర్దూ ఉసురు తీసిన ఆంధ్రులు'** – డా.కె. జయశంకర్, **'నోట్లో మన్ను కొడ్తున్నారు'** – అన్నాబత్తుల రవీంద్రనాథ్, **'1969 ఉద్యమ త్యాగధనులు'** – శోభాగాంధీ వ్యాసాలు తెలంగాణీయులకు నిరంతర పాఠ్యాంశాలవంటివి. కె.ఆర్.ఆమోస్, వెటరన్ జర్నలిస్ట్ ఆదిరాజు వెంకటేశ్వరరావు, నాయిని

నర్సింహారెడ్డి, కేశవరావు జాదవ్ వంటివారి ఆత్మకథాత్మకమైన వారి ఉద్యమజీవితాలు చదువరులకు ఎంతో ఆసక్తిని పెంచి, అనంతరం ఆశ్చర్యానికి గురిచేస్తాయి. వారు ఇంతటి స్మరణీయులుగా మిగలడానికి వారి నిజాయితీ, అంకితభావం, దేశీయభావం పాఠకులను ఆశ్చర్యపరుస్తాయి.

తెలంగాణ వైతాళికులు, కవులు, కథకులు, కళాకారులు శీర్షికల కింద కాళోజీ నారాయణరావు, బిరుదురాజు రామరాజు, రామకృష్ణశర్మ, దాశరథి, రామదాసు, సిద్ధప్ప వరకవి, కొండపల్లి శేషగిరిరావు, కాపు రాజయ్య, ఆళ్వారుస్వామి, మఖ్దూం, చిందు ఎల్లమ్మ వంటి నిత్యస్మరణీయులను గురించిన వ్యాసాలు ఇందులో చోటుచేసుకున్నాయి. అందులో కొన్ని ఆత్మకథాత్మక ప్రసంగాలు కాగా మరిన్ని ఇతర ప్రసిద్ధరచయితలు రాసినవిగా దర్శనమిస్తాయి. వీటిద్వారా తెలంగాణ ఉద్యమంతోపాటు చిందు ఎల్లమ్మ, మఠం మడివాళయ్య, దళితచిత్రకారులు, సిద్ధవరకవి వంటివారి అపూర్వులైనా విస్మరణీయులు వెలుగులోకి వచ్చారు. ఈ విషయాలను తెలిపిన వ్యాసాలే ఇందులో కనిపిస్తాయి.

**'తెలంగాణ భాషా – చారిత్రకత'** అనే ఉపశీర్షిక కింద భాషకు, చరిత్రకు సంబంధించిన ఏడు వ్యాసాలున్నాయి. ఇందులో కుర్రా జితేంద్రబాబు రాసిన కురిక్యాల శాసన ప్రాచీనత, వైశిష్ట్యం వంటి విషయాలు అనిర్వచనీయాలు. **'తెలుగుకు పుట్టినిల్లు తెలంగాణ'** – సంగనభట్ల నరసయ్య, **'మన భాష – దాని సామాగ్రి'** – కపిలవాయి లింగమూర్తి, **'తెలుగుకు తల్లి పాళీ'** – మల్లేపల్లి లక్ష్మయ్య వంటి వ్యాసాలు తెలుగుభాషకు తెలంగాణకు గల ఆధార, ఆధేయ, ప్రాధాన్యతలను తెలుపుతాయి.

చివరగా 'మా గోడు' కింద గడియారం రామకృష్ణశర్మ, దాశరథి, సినారెల కవితలు, పి.వి.నరసింహారావు, ఘంటా చక్రపాణి, ఆర్. విద్యాసాగర్ రావు వంటి వారి వ్యాసాలను ఇందులో దర్శించుకోవచ్చు.

ఈ గ్రంథంలో అన్ని కోణాలను స్పృశించిన మొత్తం 77 అంశాలు చోటుచేసుకున్నాయి. ప్రాంతం, భాష, ఉద్యమం, సంస్కృతి వంటి అంశాలలో అపార ప్రావీణ్యం కలిగి వీటి ఎంపికకు ప్రత్యేక శ్రద్ధతీసుకున్న వారందరు వందనీయులు. రాజకీయ నాయకుల పక్షాన ఇలాంటి గ్రంథాలు మరెన్నో వెలువడి సాహిత్యాన్ని, సంస్కృతిని, మన చరిత్రను మరింత వెలుగులోకి తీసుకురావాలని ఆకాంక్షిద్దాం. అభ్యర్థిద్దాం.

---


**STATEMENT OF OWNERSHIP & OTHER PARTICULARS ABOUT "MUSI" TELUGU MONTHLY**
**FORM IV (See Rule 8)**

| | |
|---|---|
| **1.** Place of Publication | Hyderabad |
| **2.** Periodicity of its Publication | Monthly |
| **3.** Printer's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | - |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **4.** Publisher's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **5.** Editor's Name | **Dr. Sagi Kamalakara Sharma** |
| a) Whether citizen of India | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 2-2-1109/BK-LIG-10, Bathukamma kunta, Bagh Amberpet, Hyderabad -500013 (Telangana) |
| **6.** Name and address of individuals who own the Newspapers and partners or share holders holding morethan one percent of the total capital. | **B. Ananta Laxmi** |

I, **B. Ananta Lakxmi,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

01.03.2022

***Sd/-***
**B. ANANTA LAXMI**
Publisher



**అందని చందమామ అందిన వేళ.. (ఆత్మకథ)**
కోడూరు పుల్లారెడ్డి.
వెల : 190 /-
**ప్రతులకు :** కోడూరు పుల్లారెడ్డి, 104, రిషి రెసిడెన్సీ, కళ్యాణ్ నగర్ III, మోతీనగర్ (పోస్ట్), హైదరాబాద్ - 500 114.
ఫోన్ : 9550 818 495



**వాగ్దేవి వరివస్య (భాషా సాహిత్య వ్యాసాలు)**
**ఆచార్య వెలుదండ నిత్యానందరావు**
**సమగ్రసాహిత్యం -3**
పుటలు : 585, వెల : 600/-
**ప్రతులకు :** వి. గీతారాణి, ప్లాట్ నెం. 34, విరాట్ నగర్, మీర్‌పేట్ పోస్ట్, హైదరాబాద్-97
ఫోన్ : 9441 666 881.




**షట్చక్రం (సాహిత్య విమర్శ వ్యాసాలు)**
డా. లక్ష్మణ చక్రవర్తి, వెల : 180 /-
**ప్రతులకు :** ఆముక్త ప్రచురణలు, శ్రీమతి సిహెచ్. గోదాదేవి, ఇం.నెం. 2-3-402, కృష్ణనగర్ కాలనీ, మచ్చబొల్లారం, ఆల్వాల్, సికింద్రాబాద్- 500010.
ఫోన్ : 98497 14261




**సారాంశం (సంపుటి 1)**
పరిశోధనాగ్రంథాలు - పరిచయ వ్యాసాలు
పుటలు : 612
**డా. అట్టెం దత్తయ్య**
పుటలు : 612
వెల : 350/-
**ప్రతులకు :** ఇం.నెం. 2-2-1109/బికె, ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 13



**డా. తిరుమల శ్రీనివాసాచార్యుల రచనలు - సమగ్ర పరిశీలన** - డా. కమల సుధారాణి,
వెల : 300 /-
**ప్రతులకు :** రచయిత్రి, ఇం.నెం. 12-5-12/7, 2వ ఫ్లోర్, విజయపురి కాలనీ, తార్నాక, హైదరాబాద్ - 500 017.
ఫోన్ : 90107 11340

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | | |
|---|---|---|
| 1. | భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. 2875 - 00 |
| 2. | బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. 1200 - 00 |
| 3. | నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. 350 - 00 |
| 4. | మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. 100 - 00 |
| 5. | శాసన సంపుటి | రూ. 150 - 00 |
| 6. | కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి | రూ. 100 - 00 |
| 7. | షబ్నవీస్ శతజయంతి సంచిక | రూ. 100 - 00 |
| 8. | విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | 90 - 00 |
| 9. | త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. 75 - 00 |
| 10. | పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. 75 - 00 |
| 11. | దేవాలయ వాస్తుశిల్పము | రూ. 50 - 00 |
| 12. | మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. 50 - 00 |
| 13. | మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. 75 - 00 |
| 14. | 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. 100 -00 |
| 15. | మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. 100 - 00 |
| 16. | ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. 175 - 00 |

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/ బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

స్వర సువర్ణ లత
ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5

హైదరాబాద్ మార్చి : 2022

# స్వర సువర్ణ లత



**లతా మంగేష్కర్ ... సుస్వర గాయని**
గానం : నైరూప్య కళ
సమాంతర కాల శ్రావ్యకళ
**లతామంగేష్కర్ ... సంపన్న మానవి**
ఎవరికీ ఉపయోగపడని ధనం ఎందుకు?
ఇదే లత తుది వాక్కు
లత : ఒక శిశిర పత్ర
అంత్యకాల లత వాక్యాలు
తాత్త్విక భావనాగతాలు
పరస్పర విరుద్ధాంశాల
కేంద్ర బిందుతత్త్వమే లత వైఖరి
కళ :
సౌరాగ్యానికే కాదు
వైరాగ్యానికి దగ్గరిదారే
మరణానికి మించిన సత్యం
మరేదీ లేదన్నది లత
లోచనాలను తెరచి చూస్తే జగతి
పరికించి ఆలోచనలు చేస్తే తాత్త్విక ప్రగతి

**గురిజాల రామశేషయ్య**
హైదరాబాద్, ఫోన్ : 703 267 9471

# తేనెలో మునిగి తేలిన తెలుగు..!!



తేనెలోనమునిగి తేలినపదరాశి
తెలుగుభాషవెలుగు తేటగాను
ఊటలుబుకునట్టి నుజ్వలతేజస్సు
తియ్యదనముమీరు తీరుభాష!

తెలుగుపల్కుచూడు తేనెలూరుచునుండు
రకరకాదిఫళ్ళ రమ్యమైన
రుచులకన్నమిన్న రుచిరతెలుగుయే
తేనెలోన తేలు తెలుగుకొమ్మ!

వివిధమైనయట్టి విస్తృతభాషలు
తెలుగుభాషముందు తేలిపోవు
తెలుగుభాషరీతి తీరైనసంపద
వేరెభాషలందు వెదుకలేవు!

శాసనంబులన్ని చక్కనితెలుగులో
చరితలోననిల్చె చక్కగాను
వచనపద్యకవిత వర్ధిల్లెజగతిలో
ముద్దులొలుకునట్టి మోదభాష!

మాతృభాషయన్న మమకార రసధుని
నవరసాలనిండు నవ్యభాష
పరమపావనంబు పతితుల మదులకు
హాయినిచ్చునట్టి నమరభాష!!!

**డా. గన్నోజు శ్రీనివాసాచారి**
మహబూబ్ నగర్, చరవాణి : 8555 899 493


ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం
మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?
అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?
మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.
సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.
7416 106 106
www.ferty9.com
IUI
IVF
ICSI
IMSI
HSG
ఫర్టీ 9
హాస్పిటల్ మరియు
పరిశోధన కేంద్రం
మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...
విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్